Website : http://saisadguruvani.org.in

'యోగదర్శిని' ప్రత్యేక సంచిక



# శ్రీ భరద్వాజ సద్గురువాణి



సంపుటి - 23

అక్టోబర్, నవంబర్, డిసెంబర్ - 2023

సంచిక - 4



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# శ్రీ సద్గురు పాదుకా మహోత్సవము - పవర్‌సిటీ మరియు నర్సీపట్నం
(2023 ఆగస్టు 1,2,3 మరియు 31 తేదీలలో నిర్వహించిన కార్యక్రమాలు)



పూర్తి వివరములకు 21వ పేజీ చూడగలరు

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి

సంపుటి - 23 అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2023 సంచిక - 4

**శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'యోగదర్శిని' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**




"క్షణక్షణము ఆత్మవికాశానికై కృషిచేయటం ఒక్కటే మానవ జీవిత లక్ష్యం కావాలి."
- పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |


మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,
ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224

శ్రీ భరద్వాజ సద్గురువాణి సభ్యత్వ చందా రుసుము పంపుటకు :

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. : 095510011006491
IFSC Code : UBIN0809551
Union Bank of India, Ukkunagaram Branch
(Used for RTGS and NEFT Transactions)


## విషయ సూచిక


శ్రీ సద్గురు పాదుకా మహోత్సవ చిత్రమాళిక .. లోపలి కవర్‌పేజీ

1. విషయసూచిక ..... 1
2. మా మాట ..... 2
3. విశ్వమైన నేను ..... 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ..... 5
5. ఆధ్యాత్మిక జీవితం ..... 7
6. భక్తియోగ సాధన ..... 8
7. శ్రీగురు చరితామృతము ..... 9
8. ఒక్క క్షణం ..... 11
9. మన సంప్రదాయాలు ..... 12
10. జిజ్ఞాస ..... 13
11. ధ్యానం ఎలా చేయాలి ..... 14
12. జ్ఞానేశ్వర్ మహరాజ్, నామ్‌దేవ్ ..... 15
13. పండుగలు - పర్వదినాలు ..... 16
14. పూర్ణ అంతరంగాలు ..... 17
15. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో ..... 21
16. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాళిక ..... 23
17. మేము సహితం ..... 24
18. జన్మదిన శుభాకాంక్షలు ..... 25
19. దత్తజయంతి మహోత్సవము ..... 28
20. బాలవికాసం - ధర్మ మహిమ ..... 29
21. స్ఫూర్తి ప్రధాత (లాల్ బహద్దూర్ శాస్త్రి) ..... 30
22. ఆదర్శమూర్తి శ్రీ గాడ్గే మహరాజ్ ..... 31
23. దీపావళి ..... 32
24. తెలుసుకుందాం ..... 33
25. శ్రీ దత్తమూర్తి ..... 34
26. గురు స్మరణ ..... 35
27. శ్రీ ధునివాలా దాదా ..... 36
28. రామభక్త శ్రీ రంగన్నబాబు ..... 37
29. యోగ పూర్ణులు శ్రీ భరద్వాజ ..... 38
30. ఆహారము - ఆధ్యాత్మికము ..... 39
31. ఏరిన ముత్యాలు ..... 40



E-mail : poorna.sai09@gmail.com
Website : **http://saisadguruvani.org.in**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**








# మా మాట

పాఠకులకు, ప్రకటన కర్తలకు విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలు...

సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో అవతరించిన త్రిమూర్త్యాత్మకుడు, యోగీశ్వరుడు అయిన దత్తాత్రేయుడిని యోగాయ నమః యోగగమ్యాయ నమః, యోగదేశకరాయ నమః, యోగపతయే నమః, యోగీశాయ నమః, యోగాధీశాయ నమః, యోగపరాయణాయ నమః, యోగిధ్యేయాఘ్రి పంకజాయ నమః అని అష్టోత్తరములో పూజిస్తాము. శ్రీ దత్తస్వరూపుడయిన శ్రీ శిరిడీసాయినాథుడిని యోగీశ్వరాయ నమః, యోగక్షేమవహాయ నమః అని కీర్తిస్తాము. నేటి కాలమాన పరిస్థితులను అనుసరించి కుల, మత, జాతి, స్త్రీ, పురుష వయోబేధము లేకుండా సర్వులను ఉద్ధరించాలనే లక్ష్యంతో, షోడశ కళలు సంపూర్ణమైన సద్గురువుగా 16 సంవత్సరాల బాలుడిగా శిరిడీలో ప్రకటమైన దత్తస్వరూపుడు శ్రీసాయినాథుడు. నిరంతరము యోగులచే ధ్యానించబడే యోగస్వరూపుడు జగద్గురువైన శ్రీసాయి. తనను ఆశ్రయించి, సేవించిన వారి యోగము, క్షేమము తానే వహిస్తానని అభయమిచ్చారు. "యోగము" అంటే కలయిక, యోగము అంటే మరొక విధముగా పొందటము అని కూడ వ్యవహరిస్తాము. ఏమి పొందాలనుకున్నామో అవి పొందే దిశగా సాగే అనేక యోగాలు ఉన్నాయి. వాటిలో హఠయోగము, కర్మయోగము, మంత్రయోగము, భక్తియోగము, జ్ఞానయోగము మొదలైనవి. వాటిలో ఆయా యోగాలలో పరాకాష్టకు చేరిన తరువాత పరమాత్మతో కలయిక ప్రారంభమవుతుంది. యోగము అంటే శారీరక యోగము మాత్రమే కాకుండా, విశ్వచైతన్య స్వరూపుడయిన పరమాత్మతో ఆత్మ స్వరూపుడయిన మనిషి కలయికే – అసలైన యోగము.

నీ యోగం బాగుంది, అన్నీ కలిసి వస్తున్నాయి, నీకాయోగం ఉంది కనుక అది పొందగలిగేవు, నీయోగం బాగుంది కనుక బ్రతికి బయటపడ్డావు, నీ యోగం బాగుంది అందుకే అనుకున్నవన్నీ నెరవేరుతున్నాయి. ఇంకా అనేక సందర్భాలలో యోగమనే మాటను మన దైనందిన జీవితంలో వాడుతుంటాము. యోగము అంటే అనుకున్నది పొందటము, లభ్యమవ్వటము అని మన భావన. అయితే నిజమైన యోగము భగవంతుని అనుగ్రహానికి పాత్రులవ్వటం, తద్వారా మన నిజస్థానానికి చేరుకోవటం. భగవంతునిలో ఉండటము–కర్మయోగము, భగవంతునితో ఉండటము–భక్తియోగము, భగవంతునిగా ఉండటము–జ్ఞానయోగము, అదే అసలైన యోగము. అటువంటి యోగాన్ని ప్రసాదిస్తారు కనుకనే యోగీశ్వరుడయినారు శ్రీసాయి. "నాదగ్గరకు వచ్చిన ప్రతి పైసా (జీవిని)ను భగవంతుడికి అప్పచెబుతాను" అని అన్నారు శ్రీసాయి.

యోగమంటే శారీరకమని భావించే వారికి కూడ తాను యోగయోగీశ్వరుడని రుజువుచేశారు శ్రీసాయి. ధౌతి అనే ప్రక్రియ సాధించిన యోగులు 22 అడుగుల పొడవు, మూడంగుళాల వెడల్పు కలిగిన పొడవైన శుభ్రమైన వస్త్రాన్ని నెమ్మదిగా గొంతులోనికి పోనిచ్చి జీర్ణాశయములో అరగంట ఉంచి తరువాత నెమ్మదిగా దానిని బయటకు లాగి, జీర్ణాశయాన్ని శుభ్రం చేసుకుంటారు. అయితే శ్రీసాయి చేసిన 'ధౌతి' మరెవరికి సాధ్యం కాని ప్రక్రియ. మూడు రోజులకొకసారి సాయి లెండితోటలోని బావి దగ్గరకు వెళ్ళి, కడుపులోని ప్రేగులు వెడలగ్రక్కి, నీటితో కడిగి వాటిని చెట్టుపై ఆరబెట్టి తిరిగి మింగివేసేవారు. ఖండయోగము సాధించిన శ్రీసాయికి ఇది ఒక లెక్కా! ఖండయోగమంటే శరీరాన్ని విడివిడి భాగాలుగా చేసి తిరిగి కలుపుకోవడం. శిరిడీలో రాత్రిళ్లు పహరా కాచే అప్పాభిల్ ఒకరోజు రాత్రి బాబా దేహం ముక్కలుగా పడి ఉండటము చూసి భయభ్రాంతులకులోనై ఇంటికివెళ్ళిపోయాడు. మరునాడు ఉదయం మశీదు చేరిన అతనిని చూసి "రాత్రి భయపడ్డావా" అన్నారు శ్రీసాయి. అంటే అది అతని భ్రమకాదని, నిజమని రుజువుచేశారు శ్రీసాయి.

అంతేకాక మశీదు పైకప్పు దూలానికి మూరెడు క్రిందకు సన్నని గుడ్డపీలికలతో వేలాడదీసిన నాలుగు మూరల పొడవు, జానెడు వెడల్పు గల చెక్కపై, నిచ్చెన సహాయంతో భక్తులు నాలుగు మూలల దీపాలు వెలిగించేవారు. ఆజానుబాహుడైన బాబా భక్తులతో మాట్లాడుతూనే అకస్మాత్తుగా దానిపై పరుండి దర్శనమిచ్చేవారు. ఆశ్చర్యపోయిన భక్తులు ఆ వింత చూడటానికి ద్వారకామాయికి తండోపతండాలుగా రాసాగేరు. అది చూసిన శ్రీసాయి ఒకరోజు దానిని విరచి ధునిలో వేశారు. భక్తులను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేసే అటువంటి యోగప్రక్రియలు కాదు శ్రీసాయి తన చెంతచేరిన వారికి ఇవ్వదలచింది. తనను ఆశ్రయించిన, సేవించిన వారిలో భక్తి జ్ఞాన వైరాగ్య యోగాలను పెంపొందించి, జ్ఞానస్వరూపులుగా మార్చటమనే యోగము చేయదలచారు శ్రీసాయి.

శిరిడీ అనే కుగ్రామములోని ఊరి చివరగల ఒక వేపచెట్టుక్రింద పదహారు సంవత్సరాల బాలుడిగా ప్రకటమైన శ్రీసాయి ఆహారము కొరకు ఎక్కడకు కదలకుండా నిరంతరము ధ్యాన యోగముద్రలో ఉంటూ, తన దగ్గరకు వచ్చిన జీవుల, మనుష్యుల భౌతిక రోగాలను ఆకు పసరులతో తగ్గిస్తూ, ఊరిలోని వారికి ఆప్తుడైనాడు. వారిచ్చే పండో, ఫలము ఒకటి, అర మాత్రమే తాను స్వీకరించి, తిరిగి వారికే ఇచ్చేసేవారు. అట్లా కాలం గడుస్తుండగా ఒకనాడు బ్రహ్మాండమైన తుఫాను వచ్చి, మూడురోజుల తరువాత తెరిపిచ్చింది. అప్పటి వరద నీటివలన ఇళ్లల్లో చిక్కుకుపోయిన ఆ ఊరిప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వరద తగ్గిన తరువాత వారికి ఊరిచివరవేపచెట్టుక్రింద కూర్చునే సాయి గుర్తుకువచ్చాడు. వెంటనే శ్రీసాయి ఎట్లా ఉన్నారో అని చూడటానికి అందరూ వేపచెట్టు దగ్గరకు చేరేరు. శ్రీసాయి చెట్టు మొదలులో ఒకప్రక్కకు ఒరిగి ధ్యానావస్థలో ఉన్నారు. వారిపై వరదనీరు ప్రవహిస్తున్నది, ఏమారకుండా నిరంతరం తమను, కాపాడుతున్న ఆ బాలుడు అట్లా వరదనీటిలో పడి ఉండటము చూసి, మనస్సు చలించిపోయి, హృదయతోతుల్లోని ప్రేమ పెల్లుబికిరాగా, అతనికి ఒక ఆవాసం కలిపించాలని భావించి, నిరంతరం 'సబ్‌కా మాలిక్ ఏక్, అల్లా మాలిక్' అంటూ ఉండే ఆ ఫకీరు, చాంద్‌భాయి పటేల్ అనే ముస్లింతో తిరిగి రెండవసారి శిరిడీవచ్చిన కారణంగా అతను ముస్లిం అని భావిస్తూ ఆ ఊరిలో నిరుపయోగముగా ఉన్న పాడుపడ్డ మశీదుకు, సాయి వారిస్తున్నా బలవంతంగా తీసుకొని వెళ్ళేరు శిరిడీప్రజలు.

మశీదులోకి అడుగిడిన బాబా అందులో అగ్నిహోత్రం (ధుని) వెల్చి, కుల, మత, జాతి, స్త్రీ, పురుష వయోబేధం లేకుండా, సర్వులకు ధర్మార్థ కామ్యమోక్షాలనే నాలుగు పురుషార్థాలను ప్రసాదించే వేదిక ఇది అని తెలుపుతూ, దానికి 'ద్వారకామాయి' అని పేరుపెట్టి, ముంగిట తులసి ప్రతిష్టించి, మశీదులో గంటలు వ్రేలాడదీసి, నిత్యం దీపారాధన చేస్తూ తాను ముస్లిం అని భావించే వారి సంశయాలు తొలగిస్తూ, తాను అందరివాడినని తెలుపుతూ, వారి హృదయాలలోని అజ్ఞానాన్ని పటాపంచలుచేస్తూ, నీటితో దీపాలు వెలిగించి, వారి హృదయాలను జ్ఞాన వెలుగుతో నింపేరు యోగస్వరూపుడయిన శ్రీసాయి. మశీదులో ధుని మంటలు పైకెగసినప్పుడు, మాటమాత్రంచేత తగ్గించారు, ఆరిపోతున్న తరుణంలో నోటిలోని నీరుపోసి మండించారు, ఎక్కడో నిప్పుల కొలిమిలో పడబోతున్న పసిబిడ్డను ద్వారకామాయిలోని శ్రీసాయి ధునిలో తనచేతిని చొప్పించి అక్కడి బిడ్డను కాపాడేరు, మండు వేసవిలో కొండప్రాంతంలో దప్పికతో నాలుక పిడచకట్టి ప్రాణాపాయావస్థలో ఉన్న నానాసాహెబ్ చందోర్కర్‌కు బిల్లుడి రూపంలో ఎదురై ఆ కొండపై నీటి ఊట చూపించారు. మాటమాత్రంచేత తుఫాను తగ్గించారు, ఊదీతో పిడుగుపాటు నుంచి ఒక భక్తుడిని రక్షించారు. ఇట్లా ఎన్నో ఎన్నెనో!

పంచభూతాలు తన స్వాధీనంలో ఉన్నా, కేవలం తన మాటమాత్రంచేత, చేతి ఊదీ ద్వారా, సర్వులను కాచిబ్రోచే శ్రీసాయి వరద నీటిలో పడి ఉండటానికి కారణం, భక్తులను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేసి తన యోగశక్తిని, మాయాశక్తిని నిరూపిస్తూ పూజలందుకోవటం శ్రీసాయి అవతార లక్ష్యం కాదు. అవసరమైనప్పుడు అలవోకగా తన భక్తుల యోగము-క్షేమము బాధ్యత వహించగలనని రుజువుచేస్తూ వారి హృదయాంతరాలలో గూడు కట్టుకొని ఉన్న భక్తియోగాన్ని పెల్లుబికించి, జ్ఞానయోగ మార్గంలో పయనింపచేయటము శ్రీదత్తయోగీంద్రుడయిన శ్రీసాయి చర్యలోని ఆంతర్యము, అంతరార్థము.

"సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని భావించేవారు నన్నసలు చూడనట్లే, నా ఈ భౌతిక దేహం నుంచి నా గురువు నన్నెప్పుడో విడుదల చేశారు, మీరు చూసేదంతా కలసి నేను, ఏ జీవిని ఆదరించినా, హింసించినా, అది నాకే చెందుతుందని" ప్రత్యక్ష నిరూపణచేసి, అందరిలో చైతన్యస్వరూపుడయిన పరమాత్మను దర్శించగలిగే యోగము తనను ఆశ్రయించే ప్రతి ఒక్కరిచేత అభ్యసింపచేస్తారు శ్రీసాయి.

ప్రథమ దర్శనంతోనే శ్రీసాయి విశ్వచైతన్యం తన అనుభవం కాగా, విశ్వగురుడైన శ్రీసాయి అనేక రూపాలతో, అనేక విధాలుగా నెరవేరుస్తున్న అవతార కార్యాన్ని గుర్తెరిగి, సాయి స్వరూపులైన ఎందరో అవధూతలను, మహాత్ములను తాను దర్శించి, వారి దర్శన, స్పర్శన, ఆశీర్వాద, బోధనామార్గాన్ని సర్వులకు అందించి, అందరిలో శ్రీసాయిని చూడగలిగే యోగమార్గాన్ని అందించి, "సాయిమాస్టర్"గా వినుతికెక్కారు పూజ్యఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. వారు చూపిన నిర్దుష్టమైన శ్రీదత్తసాయిసంప్రదాయ మార్గంలో పయనిస్తూ, అక్షర స్వరూపమైన సత్సంగ యజ్ఞాన్ని కొనసాగిస్తున్న "శ్రీ భరద్వాజసద్గురువాణి" శ్రీసాయిస్వరూపాలయిన ఎందరో అవధూతలు, మహాత్ములు అందించిన సత్యమైన యోగమార్గాన్ని అందరితో పంచుకోవాలనే భావనతో ఈ సంచికను "యోగదర్శిని" పేరిట ప్రత్యేక సంచికగా రూపొందించి మీకందిస్తున్నాము. ఆ యా వ్యాసాలు మిమ్మల్ని అలరిస్తాయని ఆశిస్తూ, "శ్రీ భరద్వాజ సద్గురువాణి" మీ హృదయవాణిగా తీర్చిదిద్దే దిశగా నిరంతరం మా ప్రయత్నం కొనసాగుతుందని అందుకు సలహా, సూచనలు మరియు వ్యాసాల రూపాలలో మీ వంతు సహాయ, సహకారాలు ఎళ్ళవేళలా కొనసాగగలవని ఆశిస్తూ ....



**కార్తీకపూర్ణిమ, వైకుంఠ ఏకాదశి మరియు శ్రీదత్తజయంతి శుభాకాంక్షలతో...**

**మీ పబ్లిషర్... శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# విశ్వమయిన 'నేను'

కన్నతల్లి కడుపులోంచి బయటపడి,, తొలిసారి ఊపిరి పీల్చిన క్షణం నుండి పుడమితల్లి కడుపులోనికి చేరుకునేందుకు ఆఖరిసారి ఊపిరి విడచి పెట్టడం దాకా సాగే ప్రస్థానం పేరే "నేను".

ఈ "నేను" ప్రాణశక్తి అయిన 'ఊపిరి' కి మారుపేరు. ఊపిరి ఉన్నంతదాకా 'నేను' అనే భావన కొనసాగుతూనే ఉంటుంది. జనన మరణాల మధ్యకాలంలో సాగే జీవన ప్రవంతిలో ఈ 'నేను' ఎన్నెన్నో పోకడలు పోతుంది. మరెన్నో విన్యాసాలు చేస్తుంది. ఈ 'నేను' లోంచే 'నాది' అనే భావన పుడుతుంది.

ఈ నాది లోంచి 1. నావాళ్ళు, 2. నాభార్య, 3. నా పిల్లలు, 4. నాకుటుంబం, 5. నా ఆస్తి, 6. నాప్రతిభ, 7. నాప్రజ్ఞ, 8. నాగొప్ప

అనేవి పుట్టుకొచ్చి చివరికి ఈ నేను అనే భావన భూమండలాన్ని కూడా మించిపోయి, ఆకాశపు సరిహద్దును కూడా దాటిపోయి, నిలువెత్తు విశ్వరూపాన్ని దాల్చి "అహంగా" ప్రజ్వరిల్లుతుంది.



"అహం" అనే మాయపొర కమ్మేసిన స్థితిలో ఈ 'నేను' "నేనే సర్వాంతర్యామిని" అని విర్రవీగుతుంది. నాకు ఎదురే లేదని ప్రగల్భాలూ పలుకుతుంది. 1. పంతాలతో, 2. పట్టింపులతో, 3. పగలతో, 4. ప్రతీకారాలతో తన ప్రత్యర్థిని సర్వనాశనం చేయటానికి సిద్ధపడుతుంది.

'బాల్యం', 'కౌమార', 'యవ్వన', 'వార్ధక్య' దశలదాకా విస్ఫులింగ తేజంతో విజేతగా నిలిచిన 'నేను' అనే ప్రభ ఏదో ఒకనాడు మృత్యుస్పర్శతో కుప్పకూలిపోతుంది.

వందిమాగధులు కైవారం చేసిన శరీరం కట్టెలా మిగులుతుంది. సుందరీమణులతో మదనోత్సవాలు జరుపుకున్న దేహం నిస్తేజంగా పడి ఉంటుంది. సుఖభోగాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగిన 'నేను' చుట్టూ చేరిన బంధుమిత్ర సపరివారపు జాలి చూపులకు కేంద్ర బిందువుగా మారుతుంది. కడసారి చూపులకోసం, కొన్ని ఘడియలపాటు ఆపిఉంచిన విగతజీవికి అంతిమయాత్ర మొదలవుతుంది.

మరు భూమిలో చితిమంటల మధ్య సర్వబంధాల నుంచి విముక్తి కలుగుతుంది. మొలకుచుట్టిన ఖరీదైన కౌపీనముతో సహా మొత్తంగా కాలి బూడిద అవుతుంది.

"నేనే శాసన కర్తను", "నేనే ఈ భూమండలానికి అధిపతిని", "నేనే జగజ్జేతను" అని మహోన్నతంగా భావించిన "నేను" లేకుండానే మళ్ళీ తెల్లవారుతుంది. ఊపిరితో మొదలై ఊపిరితో ఆగిన 'నేను' కథ అలా సమాప్తమవుతుంది. అందుకే ఊపిరి ఆగకముందే 'నేను' గురించి తెలుసుకో అంటారు గీతాచార్యులు, మరియు – భగవాన్ శ్రీరమణమహర్షి. చితిమంటలను చూస్తున్నప్పుడు కలిగేది శ్మశానవైరాగ్యం మాత్రమే. అది శాశ్వతం కానేకాదు.

'నేను' గురించిన సంపూర్ణమైన అవగాహనతో ఉన్నప్పుడే, పరిపూర్ణమైన "వైరాగ్యస్థితి" సాధ్యమవుతుంది. **వైరాగ్యం అంటే అన్నీ వదలివేసుకోవటం కానేకాదు. దేనిమీద వ్యామోహం ఉండక పోవటం, తామరాకుమీద నీటి బొట్టులా జీవించగలగడం.** స్వర్గ, నరకాలు ఎక్కడో లేవు. మనలోనే ఉన్నాయి. **మనిషికి, ఆత్మదృష్టి నశించి బాహ్యదృష్టితో జీవించడమే నరకం. అంతర్ముఖుడై నిత్యసత్యమైన ఆత్మదృష్టిని పొందగలగడం స్వర్గం. ఈ జీవన సత్యాన్ని తెలియచేసేదే వేదాంతం.**

1, నిజాయితీగా, 2. నిస్వార్థంగా, 3. సద్వర్తనతో, 4. సచ్ఛీలతతో, 5. భగవత్ ధ్యానంతో జీవించటము అనేదే వేదాంతసారం. 'అహం బ్రహ్మస్మి' అంటే అన్నీ 'నేనే' అనే స్థితి నుంచి 'త్వమేవాహమ్ ' అంటే "నువ్వే నేను" అని భగవంతుడి పట్ల చిత్తాన్ని నిలుపుకోగల తాదాత్మ్య స్థితిని చేరుకోగలిగితేనే మానవజన్మకు సార్థకత.

'నేను', 'నాది' అనే భావాలను పూర్తిగా తుడిచి పెట్టుకుంటూ ఉండడమే – భక్తియోగం

సంకల్ప, వికల్పాలను ఎప్పటికప్పుడు సరిచేసుకుంటూ మనస్సుని శుద్ధి చేసుకోవడమే – కర్మయోగం

బుద్ధిని సునిశితం చేసుకుంటూ, అంటే నిత్యానిత్య విచక్షణాజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ పోవడమే – జ్ఞానయోగం

చిత్తవృత్తులను నిరోధించుకుంటూ కావలసినప్పుడల్లా సమాధి ప్రజ్ఞను పొందడమే – రాజయోగం

'నేను', 'నేను' అని అంటావుకదా! ఆ'నేను' ఏదో తెలుసుకోమనే కదా భగవాన్ శ్రీరమణమహర్షి బోధ


"నేను – నీవు వేరువేరు కాదు, నీకు–నాకు బేధమనే అడ్డుగోడ ఉంది, దానిని క్రూలదోయి ఉన్నదంతా ఒక్కటే. నీవు నాలో ఉన్నావు నేను నీలో ఉన్నాను, ఇదే భావనచేస్తుండు, ఉన్నదంతా ఒక్కటే. ఎదురుగా ఉన్న నారూపాన్ని (సృష్టి అంతా వ్యాపించి ఉన్న చైతన్యాన్ని) నఖశిఖ పర్యంతం చూస్తూఉండు, ధ్యేత, ధ్యేయం, ధ్యానం నశిస్తుంది బ్రహ్మసమరసత కలుగుతుంది" అంటారు జగద్గురువైన శ్రీశిరిడీసాయిబాబా.

(డిసెంబరు 30వ తేదీ శనివారము భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి సందర్భముగా సమర్పణ)

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

"మనలోని భావాలు మాటల రూపంలో వ్యక్తమయ్యి క్రియారూపం దాలుస్తాయి, ఆ భావాలు, గతజన్మ సంస్కారాలపై ఆధారపడి ఉంటాయి. ఆ సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. సాధన అంటే అనుకున్నది పొందటానికి చేసే ప్రయత్నం. జీవితంలో ముందుకు సాగేకొద్ది, ఎన్నో అవాంతరాలు, అడ్డంగులు, సమస్యలు, సందేహాలు తలెత్తుతాయి. తీవ్రమయిన ప్రయత్నంతో ఒక్కోసారి వాటిని అధికమించగలుగుతాము. మరొకసారి ఎంత తీవ్రంగా ప్రయత్నించినా అనుకున్నది సాధించలేక పోవటం జరుగుతుంది. అందుకు కారణమేమిటి? ప్రయత్న లోపమా! లేక పొందటము, పొందలేకపోవటము అన్నది భగవంతుని నిర్ణయంపై ఆధారపడి ఉండటమా? అయితే సాధన అంటే ఏమిటి? మన భావాలు, మాటలు, చేతలు ఈమూడింటిని నియంత్రించటమే సాధన. మనలోని పాషాణంకన్నా కఠినమైన కుసంస్కారాలను తొలగించుకుంటూ, ఉత్తమమైన వాటిని పెంపొందించుకోవటమే సాధన. తాత్కాలికమైన సుఖము, శాంతి, ఆనందము, అవసరాలకోసం చేసే ప్రయత్నం మాత్రమే కాదు సాధన అంటే.



మన ప్రయత్నంతో అనుకున్నది సాధించినా, మరుసటి ప్రయత్నంతో అనుకున్నది పొందటములో విఫలమవటానికి కారణం తెలుసుకుంటూ, అనుకున్నది పొందటము, పొందకపోవటములోని ఆంతర్యాన్ని గ్రహిస్తూ, వాటిని అధిగమించటము కోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే అసలైన సాధన. ఏది పొందిన తరువాత ఇక పొందవలసింది ఏది ఉండదో! ఏది పొందిన తరువాత శాశ్వతము నిర్హేతుకమైన తృప్తి, శాంతి, సుఖము, సంతోషాలు పొందుతామో, దానిని పొందటానికి చేసే ప్రయత్నమే నిజమైన సాధన. అందుకు మార్గం తెలుసుకోజూడటమే జిజ్ఞాస. దానికొరకే జ్ఞానులను, వారి స్వరూపాలయిన సద్గురువును ఆశ్రయించి, వారిద్వారా సత్యాన్ని గ్రహించి, నిర్హేతుకము, శాశ్వతము అయిన సత్యం మనలో ఉన్నది అని గుర్తించి, దానిని సస్వరూపంగా దర్శించటానికి చేసే ప్రయత్నమే సాధన, అందుకు కావలసిన ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించే వారే సద్గురువు. అట్టి సద్గురువు నిజజీవితంలో ఎదురైన తరువాత అసలైన సాధన ప్రారంభమవుతుంది. సద్గురువు సాంగత్యములో గడిపే ప్రతి క్షణము ఆత్మ వికాసానికై కృషిచేయటము ఒక్కటే మన లక్ష్యం కావాలి అంటారు ఆచార్య శ్రీ భరద్వాజ. గురుకృప తోడైయితే పురోగమనముగా పయనం సాగుతుంది. అయితే ఒక్కరోజుతో గురుకృప పొందటము సాధ్యంకాదు. బంగారము విలువైనదే, అయితే అది ఒకముద్ద రూపంలో ఉన్నప్పుడు ఉండే విలువ కన్నా, ఆభరణంగా మారినప్పుడు దాని విలువ మరింతగా పెరుగుతుంది. ఒకరాయి గడపగా కాళ్ళక్రింద పడిఉంటే, మరొక శిల ప్రతిమగా మారి దేవాలయాలలో పూజలందుకుంటుంది. కాలివేళ్ళ నుంచి మెడవరకు, చివరకు తలపై ధరించే ఆభరణాలన్నీ బంగారంతో చేసినవే అయినప్పటికి, అది అలంకరించబడే ప్రదేశాన్ని అనుసరించి దాని విలువ పెరుగుతుంది. అయితే అది పుటం పెట్టబడి, కంసాలి ఉలి, సుత్తి దెబ్బలుతిని, సాగకొట్టబడి అనేక స్థితులకు తలవొగ్గి తట్టుకొని నిలబడిననాడే ఆస్థితిని పొందగలుగుతుంది, అది రాయి అయినా రత్నమయినా. అదే రీతిన సద్గురువు చెంతకు చేరటముతోనే ఉత్తమ సాధకుడిగా మారిపోవటం జరగదు, మార్గం లభిస్తుంది. క్షణ క్షణమూ సద్గురువు పెట్టే పరీక్షలకు తలవొగ్గి, తట్టుకొని నెగ్గిననాడు మనలోని కుసంస్కారాలనే మాలిన్యాలు తొలగి, ఉత్తమ సంస్కారము పెంపొంది, సద్గురువు కృపకు అర్హులను చేస్తుంది. సర్వకాల సర్వావస్థలయందు సద్గురువును అంటిపెట్టుకొని విశ్వాసంతో ముందుకు సాగటమే సద్గురువుకు సమర్పించే నిజమైన దక్షిణ. అటువంటి దక్షిణ సమర్పించ గలిగిననాడు గురుకృప సంపూర్ణముగా పొంది, ఆధ్యాత్మిక పరిణితి కలిగి, సాధకుడు సామాన్య స్థితినుంచి అసమాన్యస్థితిపొంది సద్గురువు లీలావిలాసంలో భాగస్వామి అయ్యి, జన్మ సార్థకత చెందించుకుంటాడు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే శ్రీ రఘువీరపురందరే జీవితం. "మట్టి కొట్టుకుని రాయిలా పడిఉన్న నీపై కాలమనే ప్రవాహం ప్రవహించినప్పుడు, దానితోపాటు సాగి ఎక్కడో అగాధాలలో పడిపోకుండా నిశ్చలంగా ఉండిపో, అది నిన్ను సంపూర్ణంగా కడిగివేసి, పవిత్రమైన శిలగా మార్చివేస్తుంది" అంటారు మాస్టర్ ఇ.బి. ఈవిషయాన్ని శ్రీ రఘువీరపురందరే జీవితంలోని సంఘటనలు చాలా ప్రస్ఫుటముగా తెలియచేస్తాయి.

బ్రిటీషు ప్రభుత్వానికి సంబంధించిన బొంబాయిలోని ఒక నిర్మాణ సంస్థలో చిరుద్యోగిగా, కేవలం నెలకు 35 రూపాయలజీతంతో పనిచేస్తూ, తన తల్లి, భార్య, బిడ్డ, తమ్ముడితో అద్దెఇంటిలో ఉంటూ, అతికష్టం మీద జీవితాన్ని నెట్టుకొస్తున్న పురందరే, స్వప్నంలో బాబా పిలుపుతో శిరిడీ చేరి, శ్రీసాయి పెట్టిన

ప్రతి పరీక్షకు తలవొగ్గి, నెగ్గుతూ జీవితంలో జీవన్మరణ సమస్యలు ఎదురైన సందర్భాలలోనూ, సద్గురువు పాదాలు వీడకుండా, అచంచలమైన విశ్వాసముతో ఉండిపోయాడు. పర్యవసానంగా తన జీవితంలో జరిగిన ప్రతి సంఘటనలో శ్రీసాయి అభయాన్ని, అనుగ్రహాన్ని చవిచూడగలిగేడు పురందరే. "జీవితంలో ఎదురయ్యే సంఘటనలలోనూ తన అంతరంగాన్ని సంస్కరించుకోవటానికి ప్రయత్నం కొనసాగించేడు పురందరే.

శ్రీసాయి తనను ఎన్నివిధాల పరీక్షించినా తలవోగ్గేడు పురందరే. కనుకనే, సాధనలో తాను పురోగమిస్తూ అలనాడు శ్రీసాయిసన్నిధిలో అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయిన చావడి ఉత్సవానికి నాందిపలికేడు. నేడు ప్రతి సాయిమందిరములో ప్రతి గురువారము అత్యంత వైభవోపేతముగా జరిగే, పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు భక్తిపారవశ్యంతో ఆనందడోలికలలో ఓలలాడుతున్నారు అంటే అందుకు మూలకారకుడు పురందరే. ఆ ఉత్సవం అంత సులభంగా ప్రారంభంకాలేదు నాడు. భగవంతుడి శోధనకు, భక్తుడు నిలవగా, చివరకు భగవంతుడు భక్తపరాధీనుడయ్యి, అంగీకరించిన ఉత్సవం అది.

"అనాటి ఆ చావడి ఉత్సవ దృశ్యం స్ఫురణకు వచ్చినా ఈనాటికీ మనస్సంతా ఆనందడోలికల్లో మునిగిపోతుంది, అంతటి వైభవోపేతమయిన నాటి ఉత్సవాన్ని మరల తిలకించలేము" అని ఆది సాయిచరిత్ర కారకుడు అన్నాసాహెబ్ ధబోల్కర్ అన్నారు. అంటే అది ఎంతటి అద్భుతమైన దృశ్యమో కదా. ఆఉత్సవం జరిగిన మరునాడు జరిగిన ఒక సంఘటన పురందరేపై శ్రీసాయికికల వాత్సల్యానికీ, తాను పొందుతున్న అనుగ్రహం అందరూ పొందాలనే భావనతో పురందరే తలపెట్టిన కార్యక్రమాలే అందుకు నిదర్శనం. పురందరేని నిమిత్తమాత్రుడుగా చేసి శ్రీసాయి మనకందించిన బోధను, అందుకు కారణమైన సంఘటన పూర్వాపరాలను పరిశీలిద్దాము. పల్లకీ ఉత్సవం ముగిసిన పిమ్మట దానిపై ఉన్న వెండి సింహపుబొమ్మలు దొంగలించబడినయ్యి, అంతటితో పల్లకీని భద్రపరచే నిమిత్తము శ్రీసాయికి ఇష్టం లేకపోయినా మశీదులో దక్షిణంవైపు గది నిర్మాణం చేపట్టేడు పురందరే. కోపోద్రిక్తులైన శ్రీసాయిబాబా పురందరేను ఎన్ని తిట్టినా, కొడతానని బెదిరించినా, పని ఆపకుండా కొనసాగించసాగేడు పురందరే. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులందరూ భోజనానికై వెడలినా, పురందరే కదల్లేదు, శ్రీసాయి కూడ ఆహారం తీసుకోలేదు. భోజనం చేసి తిరిగి వచ్చిన దీక్షిత్ తో "ఆకలితో నకనకలాడిపోతున్నాను, కడుపులో ప్రేగులన్నీ ఉండచుట్టుకొనిపోతున్నాయి" అని బాబా అనటంతో భోజనం సిద్ధంచేయబోయిన దీక్షిత్‌తో బాబా "పురందరేను చూపుతూ, ఆకలితో నకనకలాడిపోతున్నది నా ప్రేగులు కాదు వాడివి, ఆకలి బాధను ఓర్చుకుంటూ పనిచేస్తున్న వాడిని విడిచి నేను ఎట్లా భోజనం చేస్తాను, ముందు వాడిని భోజనానికి తీసుకువెళ్ళు" అన్నారు సాయి తీవ్రమయిన స్వరంతో. ఆమాటకు కాకాసాహెబ్ కన్నుల వెంట నీళ్ళు జలజలరాలినయ్యి. దూరంగా ఆమాట ఆలకించిన పురందరే పని ఆపివేసి, ఒక్క ఉదుటనవచ్చి బాబా పాదాలపై పడి భోరున ఏడ్చేశాడు. "మీకు ఇష్టంలేని పని చేస్తున్నందుకు కొడతాను, తిడతాను అంటూనే, మనస్సులో ఇంతటి అవాజ్యమైన ప్రేమను మాపై కురిపిస్తున్నారే, మీ మాటనుమీరి, ప్రయత్నం కొనసాగిస్తున్నా, ఒక్కపూట తిండి మానేసిన మాపై ఇంతటి అపారమైన ప్రేమను చూపెడుతున్నారు ఎంతటి కరుణాసముద్రులు బాబా మీరు!. బిడ్డ ఆకలి తల్లికే తెలిసినట్లుగా, మా ఆకలి మీ ఆకలిగా భావించి బాధపడుతున్నారే, ఇంతటి ప్రేమకు నోచుకున్న మేము, ద్వారకామాయి వాసుడవైన నీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలము" అంటూ బాబాపాదాలను స్పృశించి తన మదిలోని ప్రేమ, ఆశువుల రూపంలో పెళ్ళుబికిరాగా, బాబాపాదాలపై వ్రాలి, కన్నీటితో అభిషేకించి పాదాలను చేతితో స్పృశిస్తూ చిన్నపిల్లవాడిలా రోధించాడు పురందరే. "ఇంతలా మమ్ములను కనిపెట్టుకొని ఉండేవారు ఎవరు బాబా" అన్నాడు. "అదంతా తరువాత నువ్వు ముందు త్వరగా వెళ్ళి భోజనం చేసిరా నా ప్రేగులు ఆకలితో మాడిపోతున్నాయి" అన్నారు శ్రీసాయి. బాబా అనుజ్ఞతో రెండు అడుగులు ముందుకు వేసిన పురందరే ఒక్కక్షణం ఆగి, ఒక్కసారిగా వెనుకకు తిరిగి, 'నేను వెళ్ళను, మీకు ఇష్టంలేని పనిచేస్తున్న నన్ను భోజనానికి అని పంపి, కట్టుబడి అంతా పీకివేయటానికా" అంటూ ఆగిపోయాడు. ఆ మాటకు అక్కడి వాళ్ళందరు నివ్వెరబోయి ఒక్కక్షణం నిశ్చేష్టులై ఉండిపోయారు. "సాయి నీ అవాజ్యమైన ప్రేమను మేము నిలుపుకోగలమా!" అని క్షణకాలం క్రిందట పలికిన పురందరే, మరుక్షణంలో తనలోని మానసిక బలహీనతను సద్గురువుపై మోపేడు. మనము అంతే. నచ్చితే నంది అంటాము, నచ్చకపోతే పంది అంటాము. మనలోని అభిప్రాయాలను అవతలివారిపై రుద్ది సంతోషిస్తాము. మనలోని భావాలు మాటల రూపంలో వ్యక్తమయ్యి, క్రియారూపం దాలుస్తున్నాయని, అవి మన సంస్కారాలకి ప్రతీక అన్న విషయం ఆక్షణంలో మరచి, సంస్కార రహితులమై ప్రవర్తిస్తాము. ఆ సమయములో అవతలివారి స్థితిగతులను, సంస్కారాలను మరచి మాట్లాడుతాము. సముద్రంలోని అల వెనుకకు మరలుతుందేమోగాని, నోరు దాటిన మాట అవతలి వారి హృదయాన్ని తాకి విచ్ఛిన్నంచేసి ఉండిపోతుంది. మనం చేసే పనుల ఫలితం, మన మాట, చేతలపై ఆధారపడి ఉంటుంది. అందుకనే శ్రీసాయి అవతలివారితో మాట్లాడేటప్పుడు విచక్షణ కోల్పోవద్దని, ఆచి, తూచి మాట్లాడమని, "పదిమాటలకొకమాట సమాధానమివ్వాలని" మనకు హితవు చెప్పేరు. మనలోని సంస్కారాన్ని ఉత్తమ రీతితో తీర్చిదిద్దుకొనటానికే సద్గురువు సన్నిధిచేరేది, మనలను సంస్కరించటమే సద్గురువు అవతార లక్ష్యం, లక్షణం, కనుక సద్గురువు మనంచేసే పనులను సహించి, సరిదిద్ది, ఉద్ధరిస్తారు. శిల్పి చేతిలో చేరిన రాయి శిల్పమై పూజలందుకుంటుంది. అయితే అది ఆశిల్పకారుడి చేతిలో ఒదిగి,

ఉలిదెబ్బలను భరించినప్పుడే, ఈ సత్యాన్ని మనకు తెలపటానికే పురందరే నోట అప్రయత్నంగా పలికిన మాటలకు అక్కడివారు నివ్వెరబోయినా, శ్రీసాయి ముఖంలో ప్రేమ భావం చెదరకపోగా, తెలియక తప్పుచేసిన పిల్లవాడిని తల్లి చేరబిలిచినట్లు పురందరేను దగ్గరకు పిలచి "నేనేమయినా రాక్షసుణ్ణా, నచ్చని దానిని, పెరికివేయటానికి, నువ్వనుకున్నట్లు నేనేమి చేయనులే! బిడ్డ కాలిమీద మలం ఏరిగితే కాలు నరుకుతామా! బిడ్డను నరుకుతామా! శుభ్రం చేయటవేు కదా తల్లి చేసేది, ఎంతయినా నీవు నాబిడ్డవుకదా!" అన్నారు ద్వారకామాయి వాసుడైన శ్రీసాయి. ఆ మాటకు అందరి కళ్లు చెమర్చాయి. అవగతమైన పురందరే బాబా పాదాలను కన్నీటితో అభిషేకించి, శ్రీసాయి ఆజ్ఞతో భోజనానికి ముందుకు కదిలేడు.

భోజనానంతరం గది పని పూర్తిచేసి ఒక తలుపును కూడ బిగించేడు పురందరే. సాయంకాలం సంధ్యాహారతి అనంతరం "తెలిసి తెలియక నేనేమన్నా పొరపాటు పని చేసినా, మాట్లాడినా క్షమించండి, మా తప్పులను సరిచేసేవారు మరెవ్వరు లేరు. మాకు తల్లీ, తండ్రి, గురువు, దైవము అన్నీ నీవే బాబా" అంటూ బాబా పాదాలను స్పృశించి నమస్కరించిన పురందరే, చేతులుజోడించి "సెలవు మీద వచ్చిన నాకు ఈరోజుతో సెలవు పూర్తయింది, ప్రారంభించిన పనిలో రెండవ తలుపు బిగించటము మాత్రమే మిగిలి ఉన్నది. ఆపని తాత్యాకోతేపాటిల్ పూర్తిచేస్తానన్నాడు. మీ అనుజ్ఞ అయితే నేను మా ఊరికి బయలుదేరతాను" అన్నాడు పురందరే. "ఏపని అయినా చేయటానికి ఒప్పుకుంటే క్షుణ్ణంగా, సంపూర్ణముగా చేయాలి, నీవు ప్రారంభించిన పని నీవే పూర్తిచేసి వెళ్ళు, ప్రస్తుతానికి వెళ్ళి విశ్రాంతి తీసుకొని, తిరిగి రేపు పని కొనసాగించు" అన్నారు శ్రీసాయి. పురందరే ద్వారా మనందరికి శ్రీసాయి చేసిన బోధ అది. మర్నాడు కాకడ హారతి అనంతరం పనికొనసాగించి దానిని సంపూర్ణం చేసి అందులో పల్లకీని కూడ ఉంచి తలుపులు కూడ బిగించి శ్రీసాయి చెంతచేరేడు పురందరే. "మీ అనుగ్రహ ఆశీస్సులతో తలపెట్టిన పని పూర్తిచేయగలిగేను, అందుకు కావలసిన శక్తిని, ప్రసాదించిన మీకు సర్వదా కృతజ్ఞుడను. మీ అనుజ్ఞ అయితే మరునాడు ఉదయం బయలుదేరతాను" అన్నాడు పురందరే. మందస్మిత వదనుడైన బాబా తన అంగీకారం తెలుపుతూ "రేపు బయలుదేరి వెళ్ళినా, తరచు శిరిడీ వస్తూ ఉండాలి" అన్నారు. "తప్పకుండా బాబా, మీకోసం కాదు, నాకోసం వస్తాను, మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వెంటనే ఇక్కడకు వస్తాను, మీ అనుజ్ఞ అయినమీదటే తిరిగి ప్రయాణమవుతాను" అన్నాడు పురందరే. అందుకు చిరునవ్వు నవ్వుతూ "నేను అందరినీ ఎంతో తరచుగా శిరిడీ పిలుస్తూనే ఉంటాను, కాని పిలచినప్పుడల్లా రావటానికి అందరూ సిద్ధంగా ఉండరు" అన్నారు శ్రీసాయిబాబా.

నేను శిరిడీ వెళదామని ఎంత ప్రయత్నం చేసినా వెళ్ళలేక పోతున్నా, అయినా బాబా ఆజ్ఞ లేకుండా శిరిడీ వెళ్ళలేము కదా అని కొందరంటే, నేను అనుకోకుండా శిరిడీ వెళ్ళివచ్చాను అనేవారు మరికొందరు. అయితే "నేను అందరినీ ఎంతో తరచుగా శిరిడీకి పిలుస్తుంటాను, కాని పిలిచినప్పుడల్లా రావటానికి అందరూ సిద్ధంగా ఉండరు" అన్న శ్రీసాయి మాటలోని ఆంతర్యము, అర్ధము, పరమార్ధము ఏమిటి? మన ప్రయత్నమా – లేక శ్రీసాయిపిలుపా, ఏది నిజం? దానికి సంబంధించిన సంఘటనలోని విషయ విశేషాలను, వాటి పూర్వాపరాలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

విజయదశమి శుభాకాంక్షలతో...

## ఆధ్యాత్మిక జీవితం - సాధనమార్గం

నిజమైన ఆధ్యాత్మిక జీవితం ఇలాంటి ఆత్మపరిశీలన, ఆత్మ విమర్శ, పశ్చాత్తాపాలతో ప్రారంభంకావాలి. రోగి తనకు రోగమెంత ముదిరిందో గుర్తిస్తేనే వైద్యుణ్ణి అంత విశ్వాసంతో ఆశ్రయించగలడు. భూమియొక్క నిజస్థితి తెలిస్తేనే, అది సస్యశ్యామలమవాలంటే ఏమిచేయాలో సరిగ్గా తెలిసేది. అందుకే వేదకాలం నుండీ అన్ని సత్కర్మలకూ ఆరంభంలో ప్రాయశ్చిత్తమనే క్రతువు చేయడం ఆచారమైంది. మనము తెలిసి చేసిన పాపాలను గురించి ఆత్మ విమర్శ చేసుకొని నిజమైన పరితాపం చెందాలి. పాపాలు చేసేలా మనసును ప్రేరేపించే మనలోని దుర్గుణాలను–ప్రక్కవారి తప్పులెన్నినంత నిష్కర్షగా గుర్తించి, మన దుష్టస్వభావానికి హృదయపూర్వకంగా దుఃఖించాలి. అప్పుడే అంతటి దుస్థితి నుంచి మనలను ఉద్ధరించుకోవాలన్న నిజమైన తపన ప్రారంభమవుతుంది, మనలనుద్ధరించమని భగవంతుడిని నిజంగా ప్రార్ధించగలుగుతాం. క్రైస్తవమతంలో గూడా పశ్చాత్తాపం తర్వాతనే ప్రార్ధన చేయాలి. అలాభగవంతుడిని శరణు పొందడమే ఇస్లాం యొక్క హృదయం. మనమెవరికైనా అన్యాయం చేసివుంటే మొదటదానికి ప్రతిక్రియచేసి, వారి క్షమాపణలుకోరి, వారిమనసును సమాధానపరచాకనే భగవంతునికి నైవేద్యమివ్వాలని ఏసుక్రీస్తు చెప్పారు. అజ్ఞానం వలన సాటివారు మనపట్ల అలా వ్యవహరించకున్న, మనతరింపుకోసమై మనమలానే చేయాలని, "నీ శతృవును గూడ ప్రేమించు; వారి శ్రేయస్సుకోసం భగవంతుని ప్రార్ధించు" అని చెప్పాడు క్రీస్తు. "ప్రాణులన్నింటి రూపంలో నేనే సంచరిస్తూ ఉంటాను. ఎవరు ఎవరిపైన కోపించినా, దూషించినా నాకు చాలా బాధ కలుగుతుంది. ఎవడు ధైర్యంగా నిందను, దూషణను సహిస్తాడో వాడు నాకెంతో ఇష్టుడు. మంచికి ఫలితం గొప్పది, చెడుకి ఫలితం స్వల్పం" అన్నారు శ్రీసాయిబాబా.

– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# భక్తి యోగ సాధన

మనలో ఒకరకమైన మార్పురావటానికి అచరించే కర్మగాని, వాక్కుగాని, జ్ఞాన సంబంధమైన అంశంగాని, అనగా మనోవాక్కాయ కర్మలలో ఏదైనాసరే, లేదా మూడింటిలోనైనాసరే మనలో మార్పులు తేవటం అనేది సాధించగలిగితే దాన్ని 'పూజ' లేక 'అర్చన' అంటారు. కొంతమంది ఇవన్నీ ఎగ్గొట్టి, మాది జ్ఞానయోగమండీ, అని బుకాయిస్తుంటారు . "నేను మానసిక పూజ చేస్తానండీ" అంటాడు. అంటే భౌతికంగా చేయటానికి అతడు సిద్ధపడడు. పూజ మానసికంగా చేసేవాడు భోజనం గూడ మానసికంగా ఎందుకు చెయ్యడు? భోజనం మాత్రం భౌతికంగా చేస్తాడట. పూజ మాత్రం మానసికంగా చేస్తాడట. మానసిక పూజయందు నిజంగా నమ్మకం ఉంటే, భోజనం గూడ మానసికంగానే చెయ్యాలి. మట్టితిని, మంచినీళ్ళు తాగాలి. కాని ఆ పని చెయ్యడు గదా! అందుకని భౌతికమైన ఆచరణకు ఒల్లని వేదాంతం దొంగవేషమౌతుంది. భక్తియోగం దగ్గరికి వచ్చేటప్పటికి ఆచరణే ప్రధానమవటం వల్ల, వేదాంతపు కబుర్లన్నీ తేలిపోతాయి. అందువలన నారదులవారు **"భక్తి సాధన పరిపూర్ణత వచ్చిన తరువాత కూడ తోటివారికి ఆదర్శంగా నిలవటానికై సాధన చేస్తూనే ఉండాలి"** అని ఉపదేశించారు.



**ఎవరైనా ఏపని అయినా సక్రమంగా 12 సంవత్సరాలు కనుక నిరాటంకంగా కొనసాగిస్తే, ఆ తరువాత అప్రయత్నంగానే అది కొనసాగుతుంది. అది లౌకికం కావచ్చు ఆధ్యాత్మికం కావచ్చు.** అందుకనే సి.వి.వి. గారు ఇలా వాగ్దానం చేశారు. "పన్నెండు సంవత్సరములు వరుసగా నన్నుగూర్చి ప్రతిరోజు ప్రొద్దున, సాయంకాలం ప్రేయరు చేసినట్లైతే, అట్టివాడు నన్ను పట్టుకోనక్కరలేదు. నేనే అతన్ని పట్టుకుంటాను. దయ్యమైనా వదులుతుందేమోగాని, నేనతన్నివదలను." భక్తి సాధన పూర్తియైన తర్వాత కూడ పూజాదులు కొనసాగింపవలెను, అందువలన చక్కని ప్రయోజనము కలదు. ఒకడు పూజ, అర్చన, ఎలాచేస్తున్నాడో చూసి అతనిలాగ పూజచేసే వాళ్ళు కొందరు తయారౌతారు. తరువాత క్రమంగా ఎందరో నేర్చుకుంటారు. వారిని బట్టి వారి ఇంట్లో వాళ్ళు నేర్చుకుంటారు. ఈ పద్ధతినే 'శాస్త్ర రక్షణము' అంటారు. ఇంతమందీ కూర్చోని పూజ చేస్తుండగా దానిని ఒకరు క్రమ పద్ధతిలో వ్రాసి పెట్టేరనుకోండి. దాంతో పూజ చేసుకొనే శాస్త్రమని ఒక పుస్తకం తయారవుతుంది. అంతకంటే ప్రమాణం ఏం ఉంటుంది? అయితే ఇందులో పొరపాట్లు ఉంటేనో? అని సందేహం రావచ్చు. ఇందులో నిజంగా పొరపాట్లు ఉంటే, పూజచేసే ఇంతమందిలో ఎవడికో ఒకడికి ఇది ఇలా ఉంటే బాగుంటుంది గదా అని తడుతుంది.. ఎందుకంటే ఇన్ని రూపాలలో ఉన్న దైవం ఒక్కడే అనిగదా మనం పూజ చేస్తున్నది. ధర్మం ఎలా తెలుస్తుంది.? ఆ చేస్తూఉన్న శ్రద్ధలో ధర్మం తెలుస్తుంది. "ఆచార ప్రభవో ధర్మః– ఆచారము నుండి ధర్మము ప్రభవిస్తుంది, బయటకు వ్యక్తమవుతుంది లేదా ఆచారము దేనినుండి ప్రభవిస్తుందో అది గూడ ధర్మమే". **మన హృదయంలో ధర్మం ఉండటంవల్లనే ఆచరణ చేద్దామని మనకనిపిస్తుంది. మనం ఆచరిస్తూ ఉంటే మన ఆచరణలోంచి బయటకు వ్యక్తమై, మిగతా వాళ్ళకు కనిపించేది కూడ ధర్మము.** "ధర్మస్య ప్రభు రచ్యుతః". ఈ సమస్త ధర్మానికి గూడ ప్రభువు అంతర్యామియే. ఇలాటి వాళ్ళు ఎవరైనా శ్రద్ధగా ఒకళ్ళు ఒక పదేల్లు పూజచేసేటప్పటికి, కనీసం పది పదులు, వందమంది చేస్తారు అలా చేస్తూ ఉండేదాన్ని అర్చనం అంటారు.

గుహుడు రాముణ్ని ఎలా అర్చించాడు? శబరి ఎలా అర్చించింది? " ఓం కేశవాయ నమః, ఓం నారాయణాయ నమః " అని అర్చించిందా? ఆవిడకు ఇవన్నీ వచ్చా ? సంస్కృతంలో పిలిస్తేనే దేవుడు పలుకుతాడా? అదేమీలేదు, 'కేశవాయ' అంటే కేశవుని కొరకు" 'నమః' అంటే 'నమస్కారము' అంతేగదా! ఆ భావన ప్రధానంగాని, సంస్కృత భాషలోనే పిలుస్తేనే దేవుడు పలుకుతాడని ఏమీలేదు. మరి సాలెపురుగు తరించింది, ఏనుగు తరించింది. అవి ఏదేశంలో చదువుకున్నవి? ఏ శాస్త్రములు చదువుకున్నవి? "చెంచు ఏ మంత్ర మూహించెన్" అన్నాడు ధూర్జటి మహాకవి. అసలు మంత్రములు ఎలా పుడతాయి? అవి హృదయాల్లోంచి పుడతాయి, అవతరిస్తాయి. భక్త్యావేశ్యంతో ఎవరైనా అన్న మాటలే తరువాత మంత్రములైనాయి. కావున ఇక్కడ శాస్త్రరక్షణమనగా ఫలాని భాషలో, ఫలాని పద్ధతిలోనే పూజకాని, స్తోత్రం కాని చేసే విధానమనికాదు. ఏ భాషలోనైనా భక్త్యావేశంతో, హృదయుమార భగవంతుణ్ని గూర్చి పలికినపుడు, ఎవరు పలికినా అవి మంత్రములౌతాయి. పదిమంది ఒక సమయానికి కూర్చోని ఒకే పద్ధతిలో దేవుణ్ని పూజించటం చేసినప్పుడు అదొక సంప్రదాయంగా ఏర్పడి, శాస్త్రరక్షణం జరుగుతుంది. కొన్నాళ్ళయ్యేపాటికి భక్తి అనే కార్యక్రమం ఇందరి హృదయాలలో స్థిరపడుతుంది పూజ, అర్చనం అనేదానికి అర్థం అది. మనం చేత్తో చేస్తున్నపని, నోటితో చేస్తున్న స్తోత్రం – వీటన్నిట్లో అందరి హృదయాలయందును జనార్ధనుడు అనగా అంతర్యామి స్థాపించుకుంటాడు. పూజకు ఈ స్థాపనే ముఖ్యము. ఇది ముఖ్యముగాని ఎంత స్తోత్రము చేశారు అనేది కాదు. మన ఇష్టం ఏ స్తోత్రమైనా చేయవచ్చు. ఏ పద్ధతిలోనైనా పూజ చేయవచ్చు. ఏది చేసినప్పటికి మన హృదయాల్లో ఇది చేద్దామనే సంకల్పం ఒక్క స్వరుపుడుగా ఉన్న అంతర్యామి అనే చైతన్యం వ్యక్తమై, బాగా మనం దాని అందుబాటులోనికి వచ్చి, ఆ చైతన్యం లోనికి మనం ప్రవేశించేటట్లుగా అది వికాసం చెందటం ముఖ్యం. మనం గ్రహించవలసిన విషయం ఇది. మన హృదయాల్లో మంచి పనిచేద్దామని అనిపించిందనుకోండి. ఆ మంచి పనిని చేస్తున్న కొద్దీ ఏమవుతుంది? ఆభావన జనించిన చోట అంతర్యామితత్త్వం వ్యక్తమౌతుంది. విమ్మట అది ప్రకాశమానమౌతుంది. దానియందు మనం స్థిరపడతాం. ఇదీ భక్తియోగమంటే. ఎవరు ఎక్కువ భక్తుడు అని ఉండదు, భక్తిలోనికి ఎవరు ఎంతదూరం ప్రయాణం సాగిస్తున్నారు అని మాత్రమే ఉంటుంది.

భక్తియోగ సాధన చేసినవానికి రావల్సిన స్థితి వచ్చిన తర్వాత గూడ అతడు అదే సాధన చేస్తుంటాడు.

**– కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులు**

సేకరణ : **శ్రీ యు.వి.ఎ.ఎన్ రాజు**, విజయనగరం







# శ్రీ గురు చరిత్రామృతము


**వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు**

"ఋణాను బంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో, నీ దగ్గరకు ఏ జీవి వచ్చినా ఆదరించి, చేతనయినంతగా సహాయమందించు అంతేగాని, అదిలించి ఈసడించుకోవద్దు" అన్నారు జగద్గురువైన శ్రీసాయిబాబా. ''నా ఆజ్ఞలేకుండా ఆకయినా కదలదు, ప్రాణులన్నింటి రూపాలలో నేనే సంచరిస్తూ ఉంటాను. ఆకలిగొన్నవారికి అన్నం, గుడ్డలు లేనివారికి గుడ్డలు ఇవ్వు భగవంతుడు సంతోషిస్తాడు, అంతేగాని ఎవరిని చులకనగా చూడవద్దు, మాట్లాడవద్దు, నీకు ఇవ్వటం ఇష్టం లేకపోతే ఆవిషయమే చెప్పు. నీవు ఎవరిని బాధించవద్దు. ఎవరు నిన్ను బాధించినా, నిందించినా, ఓర్పు వహించి ఆప్రదేశం వీడి వెళ్ళిపో, అంతేగాని మాటకు మాట, దెబ్బకు దెబ్బ తీయటానికి ప్రయత్నించవద్దు, నీవు ఎవరి గురించి తప్పుగా మాట్లాడకు, నీగురించి ఎవరు మాట్లాడినా చలించకు, ఎవరు చేసే పనులకు ఫలితాన్ని వారే అనుభవిస్తారు, మనుష్యులు ఒకరికొకరు వేరని భావిస్తారు, అది పొరపాటు, "నేను నీలో ఉన్నాను, నీవు నాలో ఉన్నావు ఇదే భావన చేస్తూ ఉండు" అన్నారు సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో అవతరించిన శ్రీదత్తస్వరూపులైన శ్రీ శిరిడీసాయిబాబా.


'శతృత్వము, ఋణము' ఉంచుకోరాదని శాస్త్రవాక్యము. "యాత్రకు, పబ్బానికి పండుగకు అప్పుచేయవద్దు", అని హితవు పలికేరు శ్రీసాయి. అప్పు పాపం లాంటిది. అప్పు తీసుకొని, యాత్ర చేయటంవలన యాత్రా ఫలంలో అప్పు ఇచ్చినవారు కూడ భాగస్వామి అవుతారు. అదేవిధముగా, "రుచులకు పోవద్దు, ఒకటి రెండు పదార్థాలతో తృప్తిపడు" అని సాయిబోధిస్తే, పండుగ అని, ఇంట్లో శుభకార్యమని, తనవారి ఆనందం కోసమని అప్పుచేసి, అవసరం తీరిన తరువాత, అప్పు తీర్చేటప్పుడు ఎంతో అయిపోయిందని బాధ పడుతూ, జీవితాన్ని ఇక్కట్లు పాలుచేసుకోవటము జరుగుతున్నది. అప్పిచ్చినవాడు, ఇచ్చిన సొమ్ము సకాలంలో అందకపోవటంతో, అప్పుఇచ్చిన పుణ్యానికి అతను ఇక్కట్లపాలవుతే, అందుకు తగిన మూల్యాన్ని అప్పుతీసుకున్నవాడు అనేక రీతుల అనుభవించవలసివస్తుంది. ఈ విషయం త్రయీకాండ రూపమై, వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలసారమైన 'శ్రీగురుచరిత్ర'లోని 20వ అధ్యాయం చాలా ప్రస్ఫుటముగా తెలియజేస్తుంది.

నరసోబావాడి దగ్గర కృష్ణ–వేణీ పంచగంగా సంగమము సమీపములో గల శిరోల అనే గ్రామములో గంగాధరుడనే బ్రాహ్మణుడు తన భార్యతో కలసి పౌరోహిత్యము చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. ఆదర్శమూర్తులైన ఆదంపతులకు పుట్టిన బిడ్డలు వెంటనే చనిపోతూ ఉండేవారు. గర్భశోకము భరించలేని ఆ బ్రాహ్మణుని భార్య అనేక వ్రతాలు, పూజలు చేసింది, అయినా ఫలితం లేకపోయింది. చివరకు ఒక ప్రముఖ జోతిష్యుని సంప్రదించగా, ఆమె జాతకం పరిశీలించిన ఆ దైవజ్ఞుడు "అమ్మా! నీవు గతంలో ఒక పిసినారి, లోభి అయిన ఒక బ్రాహ్మణుని వద్ద వందరూపాయలు రుణము తీసుకొని, తిరిగి చెల్లించలేదు. అడిగి, అడిగి విసిగివేసారిన ఆ బ్రాహ్మణుడు తన అవసరార్ధమై సొమ్ము అందలేదనే బాధతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నాడు. అందువలన అతనికి అంత్యక్రియలు కూడ సక్రమంగా జరుగలేదు, అంతట అతడు పిశాచమై, నీకు గర్భ శోకాన్ని కలిగిస్తున్నాడు. కనుక నీవు ఆ బ్రాహ్మణునికి ఊర్ధ్వదైహిక కర్మలు జరిపించి, ఆ బ్రాహ్మణుడి గోత్రానికి చెందిన వారికి నూటొక్క రూపాయల దక్షిణ సమర్పించు. అందువలన అతని ఋణంతీరి, నీకు గర్భశోకం తొలగుతుంది. అటుపిమ్మట దోషనివృత్తికై పంచగంగా సంగమ తీరంలోని ఔదుంబర వృక్షఛాయలో పాదుకల రూపంలో నేటికీ నిత్యసత్యులై, కొలిచిన వారిపాలిట కొంగుబంగారమైన శ్రీగురుడిని అర్చించు, వారి అనుగ్రహంతో నీ దోషములు తొలగి, సంతానవంతురాలవవుతావని" చెప్పిన దైవజ్ఞుడి మాటననుసరించి గంగాధర దంపతులు పంచగంగ సంగమము చేరి, అచ్చట మేడిచెట్టు దగ్గరకల శ్రీనృసింహసరస్వతిస్వామి వారి పాదుకలను అభిషేకించి, భక్తి శ్రద్ధలతో పూజాదికములు నిర్వహించి, ప్రదక్షిణ గావించి, అక్కడే నిద్రించసాగారు. మూడవనాటి రాత్రి స్వప్నంలో పిశాచరూపంలోని బ్రాహ్మణుడు గృహిణి కలలో కనిపించి తీవ్రంగా బెదిరిస్తూ, "నాకీయవలసిన బాకీ తీర్చకుండా, పూజలు వ్రతాలు చేస్తున్నావా, నీకు సంతానం ఎట్లా కలుగుతుందో చూస్తాను, నిన్నసలు బ్రతకనీయను'' అంటూ కలలో ఆమెపైకిరాగా, ఉలిక్కిపడిలేచిన ఆమె, అత్యంత భయభ్రాంతులకు లోనై సమీపములోని ఔదుంబర వృక్షము చెంతకు పరుగెత్తి, అక్కడి పాదుకలపై తలవాల్చి దుఃఖించసాగింది. అంతట శ్రీగురుడు

ఆమెకు దర్శనమిచ్చి, ఆమెను చంపటానికి వచ్చిన విప్ర పిశాచాన్ని శ్రీగురుడు నిలవరింపజేసి "పిశాచత్వం పొందిన తరువాత కూడ నీవు, ఒకబ్రాహ్మణస్త్రీని చంపబూనటం మహా పాపభూయిష్టమైన చర్య, ఎందుకు పాల్పడుతున్నావు?" అని ప్రశ్నించగా "స్వామిని గాంచిన ఆవిప్రుడు తన వృత్తాంతమంత చెప్పి, తన దగ్గర తీసుకున్న అప్పు వందరూపాయలు ఆమె తనకు చెల్లించనందువలననే నాకీదుస్థితి కలిగింది, అందుకు ప్రతీకారము చేయదలచాను, కనుక ఆమెను పంపివేయవలసింది" అని కోరేడు. అందుకు శ్రీగురుడు కొంచెం తీవ్రమయిన స్వరంతో "చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సింది పోయి, మరల దుష్కర్మలు చేసి, మరింత పాపాన్ని మూటగట్టుకొని హీనజన్మలలోకి దిగజారవద్దు. నాపాదాలను ఆశ్రయించిన ఈమెను కాపాడటము నాబాధ్యత, కనుక నేను చెప్పిన పద్ధతిని శిరసావహించినచో నీకు విముక్తి కలగచేసెదను" అన్న శ్రీగురుడి పలుకులకు ఆవిప్రుడు "స్వామీ! మీదర్శన, వాక్కులతో నాలోని తమోగుణం అడుగంటిపోతున్నది. మీ ఆజ్ఞను అనుసరించెదను, నాకు విముక్తి కలగజేయమని" కోరగా, "గత జన్మంలో ఈమె నీవద్ద తీసుకున్న ఋణము చెల్లించుటకు అవసరమైన ధనము ఇప్పుడు ఆమెవద్ద లేదు. వీలయినంత ద్రవ్యము ఆమెచేత ఇప్పించటమే కాక, నీ పిశాచత్వం తొలగిపోవటానికి అవసరమైన ఊర్ధ్వదైహిక క్రియలు ఆ దంపతులచే ఆచరింపచేసి నీకు ఉత్తమగతి కలిగించి, విముక్తుడిని చేస్తాను. అందుకు నీవు అంగీకరించినా, అంగీకరించకపోయినా ఈమెను మేము కాపాడి తీరుతాము" అన్న శ్రీగురుడి మాటను శిరసావహించాడు ఆవిప్రుడు. అంతట శ్రీగురుడు ఆ బ్రాహ్మణస్త్రీతో "అమ్మా! తీసుకున్న ఋణము చెల్లించుట నీబాధ్యత, చెల్లించలేని స్థితిలో ఉన్నప్పుడు వారికి ఆ విషయము వినమ్రతతో తెలియజేసి, వీలయినంత త్వరితగతిన ఋణవిముక్తి పొందవలెను, అవసరార్థం అర్థించి తీసుకున్న సొమ్ము ఏ కారణంగానైనా ఎగవేయటానికి ప్రయత్నించినచో, అందుకు తగ్గ మూల్యము పదింతలుగా జీవితంలో అనుభవించవలసి వస్తుంది. దాని పర్యవసానమే ఇది. గతంలో జరిగిన దానికి నీవు పడ్డ మానసిక వ్యధ వలన కొంత పాపం నశించింది. మిగిలిన దానిని పిశాచరూపంలోని ఆవిప్రుడు సంతృప్తి పడేలా యథాశక్తి పైకం వెచ్చించి, అతనికి సద్గతి కలిగేలా ఊర్ధ్వదైహిక క్రియలు శాస్త్రోక్తముగా నిర్వహించి, మీకు భారముకానంత దక్షిణ, ఆబ్రాహ్మణుడి గోత్రానికి సంబంధించిన ఒక విప్రుడికి దానము చేయి, తద్వారా మీకు ఋణవిముక్తి, ఆవిప్రుడికి పిశాచత్వం తొలగిపోతుంది" అని వెనుక దైవజ్ఞుడు చెప్పిన విధానాన్నే శ్రీగురుడు దృవీకరించగా, శ్రీగురుడి మాటను అనుసరించి, తన భర్తతో కలసి పదిరోజులు ఆ బ్రాహ్మణుని పేరిట కర్మకాండలు నిర్వహించి, ప్రతినిత్యము అష్టతీర్థములలో స్నానము చేసెడివారు. అటుపిమ్మట వారంరోజులపాటు మేడిచెట్టుక్రింద పాదుకలకు నిత్యము అభిషేకము చేసెడివారు. అంతట ఆమెకు సంపూర్ణముగా బ్రాహ్మణహత్య దోషము, ఆవిప్రునికి పిశాచరూపం తొలగిపోయాయి. నాటి రాత్రి కలలో శ్రీగురుడు ఆమెకు కనిపించి రెండు కొబ్బరికాయలు ప్రసాదించి, "అమ్మా! నీకర్మఫలం తొలగిపోయింది. నా వాగ్దానాన్ని అనుసరించి నీకు వేదవిదులైన ఇద్దరు కుమారులను ప్రసాదిస్తున్నాను, ఉదయం పారణ ముగించి, ఈ ఫలాలను ఆరగించండి. మీ కోరిక నెరవేరుతుంది" అని అభయమిచ్చారు. శ్రీగురుడి అభయముతో ఆనందభరితురాలైన ఆమె తగురీతిన శ్రీవారి పాదుకలను పూజించి, నారికేళములు శ్రీగురుడికి నైవేద్యము చేసి, అటుపిమ్మట వాటిని ప్రసాదముగా స్వీకరించారు. కొంతకాలమునకు ఆమె గర్భవతియై ఒక శుభముహూర్తాన ఒక మగ పిల్లవాడిని ప్రసవించెను. శ్రీగురుడి అభయంతో జన్మించిన ఆబాలుడిని అత్యంత ప్రేమతో పెంచుకొనసాగేరు. అనంతరం శ్రీగురుడి అభయాన్ని అనుసరించి మరల ఆమె గర్భవతియై రెండవసారి కూడ ఒక మగ పిల్లవాడికి జన్మనిచ్చింది. ముద్దులు మూటగడుతూ ఆడిపాడుతూ ఆ బిడ్డలిద్దరూ వృద్ధి చెందసాగేరు. మొదటి పిల్లవాడికి ఉపనయనము జరిపించుటకు, రెండవ పిల్లవాడికి పుట్టువెంట్రుకలు తీయించుటకు శుభముహూర్తము నిర్ణయించినారు. అందుకు తగిన ఏర్పాట్లు కూడ కొనసాగించసాగేరు. చాలా కాలం తరువాత ఆ ఇంట జరిగే శుభకార్యానికి బంధువులందరూ విచ్చేశారు. అందరి సంతోషానికి అవధులులేవు. వారి ఇంటి ప్రాంగణమంతా బంధుమిత్రుల రాకతో సందడిగా మారిపోయింది. ఇంతలో అకస్మాత్తుగా పెద్దకుమారుడికి ధనుర్వాతం ఏర్పడింది. ఆవ్యాధి లక్షణాలతో ఆబాలుడి అవయవాలన్నీ వంకర తిరిగిపోయి, కళ్ళు భయంకరముగా కనిపించ సాగేయి. ఆవ్యాధితో మూడురోజులు బాధపడిన ఆపిల్లవాడు నాటిరాత్రి ప్రాణాలు వీడేడు. ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్న ఆ ఇంట ఒక్కసారిగా విషాదం అలుముకుంది. పిశాచబాధతో అంతకు ముందు పురిటిలో బిడ్డలు చనిపోగా కలిగిన బాధకంటే, ఎన్నోరెట్లు అధికంగా వారు దుఃఖించసాగేరు. అందుకు కారణం, పిశాచబాధ తొలగి, శ్రీగురుడి అభయంతో బిడ్డలను పొందిన తమకు మరల ఈ పుత్రశోకమెందుకు? జవాబులేని ప్రశ్నలతో వారి దుఃఖానికి అవధులు లేకుండా పోయింది. ఆదృశ్యం చూసిన అక్కడివారి కన్నులు కన్నీటితో చెమర్చాయి. సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడైన శ్రీగురుడి ఆజ్ఞననుసరించి, ఊర్ధ్వదైహిక కర్మను నిర్వహించి, వారి అపార అనుగ్రహంతో శ్రీఫలాలు పొంది, శ్రీవారి అనుగ్రహ అభయాలతో పుత్రులను పొందిన తరువాత, మరల ఈ దుస్థితికి కారణమేమిటి, మా ప్రారబ్దమా, కర్మా! ఆచరణ దోషమా! వీటన్నిటినిమించి శ్రీగురుడు ఇచ్చిన అభయం విఫలమవ్వటంలోని ఆంతర్యమేమిటి? దుఃఖానికి మించిన ఈ ప్రశ్నలతో అల్లకల్లోలమైన మనస్సుతో దుఃఖభారముతో ఉండిపోయారాదంపతులు. మీదుమిక్కిలి గంగాధరుని భార్య దుఃఖభారంతో కృంగిపోసాగింది. ఆమె దుఃఖానికి నివృత్తి ఎలా చేకూరుతుంది! కల్పతరువైన శ్రీగురుడి అభయమే విఫలమయితే ఇక ఆర్తజన రక్షకులెవరు? ఈ ప్రశ్నలకు సమాధానముగా, శ్రీగురుడి లీలావిలాసాల గురించి వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.




# ఒక్క క్షణం !

ఒక గ్రామములో జరిగిన నిజమైన సంఘటన. అక్కడొక మహమ్మదీయుని యింట బాలుడు పుట్టాడు. కాని బాలుని తల్లి మరణించింది. అందుకు అతడు చాల దుఃఖించాడు, ఒకటి భార్య పోయినందుకు దుఃఖం, రెండవది ఆ పసిపిల్లవాడిని పెంచటం ఎలాగా? అని. దగ్గరలోనే ఒక గొల్లవాడు (పాలమ్మేవాడు) ఉంటున్నాడు. అతనికి కూడ రెండు మూడు రోజుల పిల్లవాడే ఉన్నాడు. అతని భార్యకీ సంగతి తెలిసి ఆమె తన భర్తతో “ఆ పిల్లవాణ్ని తీసుకురండి. నేను పెంచుతా” అంది. గొల్లవాడా ముసల్మానుని బాలకుణ్ణి తీసుకువచ్చాడు. గొల్లవాని భార్య ఇద్దరు పిల్లల్నీ పెంచింది. వాళ్లకి తనపాలిస్తోంది. ప్రేమతో పెంచుతోంది. ప్రేమచూపుతోంది. ఆమె మనస్సులో ఇతడు తన పిల్లవాడనీ అతడితరుల పిల్లవాడనీ ద్వంద్వభావం లేదు. ఆబాలుడు పెద్దవాడై చదువుకోదగిన వాడయినప్పుడు ఆమె ఆ మహమ్మదీయుణ్ణి పిలిచి – ‘‘ఇప్పుడు నీవు నీపిల్లవాణ్ణి తీసుకువెళ్ళు. చదువు చెప్పించు – నీకుతోచినట్లు పెంచు” అని చెప్పింది. అతడా బాలుణ్ణి తీసుకువెళ్లి చదువు చెప్పించాడు. చదువుకొని వాడొక ఆసుపత్రిలో



కాంపౌండరయ్యాడు. కొంతకాలం తరువాత దురదృష్టవశాత్తు గొల్లవాని భార్య ఛాతీకొంచెం బలహీనపడింది. దానిలోపల గాయం అయింది. వైద్యం చేయించుకోవటానికి వాళ్ళు ఆసుపత్రిలో డాక్టర్ దగ్గరకు వెళ్లారు. డాక్టర్ రోగిని పరీక్షించి ఈమెకు శస్త్ర చికిత్స సమయంలో చాలా రక్తం అవసరమవుతుంది అని అన్నాడు. రక్తమెవరిస్తారు? పరీక్షచేయబడింది. ముసల్మానుని కొడుకు – కాంపౌండరుగా ఆ ఆసుపత్రిలోనే ఉన్నాడు. దైవయోగం వల్ల అతనిరక్తం కలిసింది. ఆ తల్లిమాత్రం అతనిని గుర్తించలేదు. కాని ఆ పిల్లవాడు ఆమెను గుర్తించాడు. – “ఈమెయే నన్ను పెంచినతల్లి. చిన్నతనంలో ఈమె పాలు త్రాగి పెరిగాను. నా ప్రాణదాత ఈమె. ఆమెకు సహాయం చేయటం తన కర్తవ్యం అని భావించాడు. డాక్టరు ఇతనిరక్తం ఎక్కించవచ్చన్నాడు. నీవు రక్తమివ్వగలవా?” అని అడిగాడు. – “నేను రక్తం మాత్రం ఇస్తాను. కాని రెండువందల రూపాయలు తీసుకుంటా”నన్నాడు, ఆ కాంపౌండరు. గొల్లవాడు అతనికి రెండువందల రూపాయలిచ్చాడు. అతడు కావలసినంత తన రక్తమిచ్చాడు. ఆరక్తమాతల్లి కెక్కించారు. దానితో ఆమె ప్రాణం నిలిచింది. ఆమె తనయింటికి వెళ్లిపోయింది.

కొన్నిరోజుల తరువాత ఆపిల్లవాడు గొల్లవాని యింటికి వెళ్లి రెండువందల రూపాయలు తల్లి పాదాలకు కానుకగా సమర్పించి – మీరు నాతల్లి. నేను మీబిడ్డనే. మీరే నన్ను పెంచారు. ఈ రూపాయలు మీరు తీసుకోండి” అన్నాడు. ఆమె (తీసుకోవటానికి) తిరస్కరిస్తే – “ఇవి మీరు తీసుకోవలసిందే” అన్నాడు. అతడు హాస్పిటల్ సంగతి జ్ఞాపకం చేశాడు. “ఊరికే ఇస్తే రక్తం మీరు తీసుకోరు. తీసుకోకపోతే బతకరు. అందుకని నేను రక్తానికి రెండువందల రూపాయలు తీసుకున్నాను. నిజానికీరక్తం మాత్రమే కాదు నా ఈ శరీరంలోని మాంస ఖండాలు చివరకు శరీరము ప్రథమముగా మీరు పాలిచ్చి, పాలించి, లాలించి పెంచి పోషించబడినవే. అందువల్ల నా యీ శరీరమూ, నా సర్వస్వమూ మీదే. నా రూపాయలు నిష్కల్మషమైన సంపాదనగా వచ్చినవి. మీదయవల్ల నేను సాత్త్విక ఆహారము తిని, సాత్త్విక భావనలతో, సాత్త్వికమైన జీవనం గడుపుతున్నాను. కాబట్టి ఈరూపాయలు తీసుకోవలసిందే’’ అని చెప్పి అతడు రూపాయలిచ్చాడు. గొల్లవాని భార్య చాల శుద్ధమైన భావం గలది. పసిబాలుని తన బిడ్డగా భావించి తాను సాకినందుకే ఆముస్లిం బాలుడిలో కలిగిన పరివర్తన, అతను చూపే కృతజ్ఞతాభావానికి ఆమె కళ్ళు చెమర్చాయి. ఆనందంతో, అతనుఅందించిన ఆ ధనం అతని ప్రేమకు ప్రతిరూపంగా మాత్రమే అందుకొన్నది.

మీరాలోచించండి అలా ఎంతమంది తల్లులున్నారు? బ్రతకటమే ప్రధానము అని అనుకుంటే ఎలాగయినా బ్రతికేయవచ్చు. పశువులు, జంతువులు, పశుపక్ష్యాదులు కూడ బ్రతుకుతున్నాయి. వాటిలాగా బ్రతకటానికి మానవజన్మ అవసరం లేదు. ఎన్నో జన్మల తరువాత లభించిన మానవ జన్మ సార్థకత కావాలి అంటే మనిషి మానవత్వంతో జీవించాలి. మానవత్వం కలిగిన వాడే మనిషి లేనిచో మృగంతో సమానం. మానవత్వానికి ప్రతి రూపమే కృతజ్ఞత. అది లేకుంటే వరాలిచ్చిన శివుడి నెత్తిమీదనే చెయ్యిపెట్టటానికి ప్రయత్నించిన భస్మాసురిడిలా, రాక్షసుల్లా తయారవుతాము.

మహాత్ముల జీవితాలన్నీ కృతజ్ఞతకు ప్రతిరూపంగానే నిలిచాయి. కృతజ్ఞతకు పరాకాష్ఠ సాయి జీవితం. తనకు గుప్పెడు మెతుకులు, రొట్టెముక్కలు పెట్టిన దానికే కృతజ్ఞతగా తన ప్రాణాన్నే పణంగా పెట్టి బయాజాబాయి బిడ్డను కాపాడేరు శ్రీసాయి. మరి మనం అంతలా కృతజ్ఞతగా బ్రతకగలుగుతున్నామా? “సామాజిక సేవ రూపంగా మేము మా కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాము” అని అందామా! కుటుంబసభ్యులను పనిమనుషులకు అప్పగించి, తాము చెయ్యాల్సిన పనులను వారిచేత చేయిస్తూ, ప్రేమ అనురాగం, ఆప్యాయతలను పిల్లలకు ఆమడ దూరంచేసి, తాము పడేసే గుప్పెడు మెతుకులకు, కొంచెం మూల్యానికి, పనివారలను బానిసలుగా చూస్తూ, సమాజములోని బానిసత్వం నిర్మూలిస్తామని వేదికలెక్కి ఉపన్యాసాలిస్తూ సామాజికసేవారూపంలో ఫోటోకు ఫోజులిచ్చి, ప్రచారము, పటాటోపము, పలుకుబడి, ప్రాబల్యాలకోసం ప్రయత్నిస్తూ, విలాస వంతమైన జీవితాన్ని అనుభవిస్తూ, జీవించటం కృతజ్ఞత ఎలా అవుతుంది. చేసే ప్రతి ఆలోచన, మాట, ఆచరణ ఒక్కటై, కార్యరూపం దాల్చినప్పుడు అది సమాజానికి శ్రేయస్సు చేకూర్చటమే కాక, అది ఎన్నోరెట్లు వృద్ధి చెందగా తిరిగి, ఆ ఫలాలు మనమే ఆస్వాదించి, జీవితాన్ని ఆనందమయం చేసుకోవటానికి కారణమవుతుంది. “ఏపని అయినా చేయటానికి ఒప్పుకుంటే క్షుణ్ణంగా త్రికరణశుద్ధిగా చెయ్యి. లేదంటే చేయటానికి ఒప్పుకోకు” అన్నారు శ్రీ శిరిడీసాయినాథుడు. మరి మనం ఏది చేద్దాము? ఒక్కక్షణం ఆలోచించి ముందుకు సాగుదాము.

మీ **పూర్ణచంద్రరావు**

# మన సంప్రదాయాలు - అట్లతద్ది, ధనుర్మాసం

**అట్లతద్ది :** త్రిలోక సంచారి అయిన నారదముని ప్రోద్బలంతో గౌరీదేవి శివుని పతిగా పొందగోరి మొదటిసారిగా చేసిన విశిష్టమైన వ్రతమే ఈ అట్లతద్ది. స్త్రీలు సౌభాగ్యం కోసమై చేసుకునే వ్రతం ఇది. చంద్రారాధన ప్రధానమైన చంద్రకళల్లో కొలువై వున్న శక్తి అనుగ్రహం చేత స్త్రీ సౌభాగ్యం పెరుగుతుందని, కుటుంబంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని శాస్త్ర వచనం.

ఈ పండుగలో అమ్మవారికి అట్లని నైవేద్యంగా పెట్టడంలో ఓ అంతరార్థం వుంది. నవగ్రహాల్లోని కుజుడికి అట్లంటే మహాప్రియం. అట్లను ఆయనకు నైవేద్యంగా పెడితే కుజదోష పరిహారమై సంసార సుఖంలో ఎటువంటి అడ్డంకులూ రావని నమ్మకం. ఋతుచక్రం సరిగా వుండేలా చేసి కాపాడతాడు. అందువల్ల గర్భధారణలో ఎటువంటి సమస్యలూ వుండవు. మినప పిండి, బియ్యపు పిండిని కలిపి అట్లను తయారుచేస్తారు. మినుములు రాహువుకు, బియ్యం చంద్రునికి సంబంధించిన ధాన్యాలు. గర్భదోషాలు తొలిగిపోవాలంటే ఈ అట్లనే వాయనంగా ఇవ్వాలి.

అశ్వయుజ బహుళ తదియనాడు వచ్చే అట్లతద్ది స్త్రీలకు ఎంతో శుభప్రదమైనది. పిల్లలు, పెద్దలు, అందరికీ ప్రమోదాన్ని కలిగించే పర్వదినం. ఈరోజున తెల్లవారు ఝామున మేల్కొని గౌరీదేవి పూజ చేయాలి. చంద్రదర్శనం అనంతరం శుచియై తిరిగి గౌరీపూజ చేసి, ఆమెకు పది అట్లు నైవేద్యంగా పెట్టాలి. తర్వాత ముత్తయిదువులకు అలంకారం చేసి, పది అట్లు, పది ఫలాలు వాయనంగా సమర్పించాలి.

అట్లతద్దినోము కథ చెప్పుకొని, అక్షింతలు వేసుకోవాలి. అనంతరం భోజనం చేయాలి. పదిరకాల ఫలాలను తినడం, పదిమార్లు తాంబూలం వేసుకోవడం, పదిమార్లు ఊయల ఊగడం ఈ పండుగలో విశేషం. గౌరీదేవికి నైవేద్యంగా అట్లు పెడతారు కనుకే ఈ పండుగకు అట్లతద్ది అనే పేరు వచ్చింది.

(అక్టోబరు 31వ తేదీ మంగళవారం అట్లతద్ది సందర్భముగా శుభాకాంక్షలతో సమర్పణ)

**ధనుర్మాసం-తిరుప్పావై :** భారతదేశంలో ధనుర్మాసంలో పెళ్ళికాని పడుచులు, తమకు మంచి భర్తని ప్రసాదించమని గోదాదేవి (ఆండాళ్) ని వేడుకుంటూ పాటలు పాడే ఒక సాంప్రదాయం ఉంది. దీనినే కాత్యాయనీ వ్రతం అంటారు. ఆ కోవకు చెందినదే తిరుప్పావై వ్రతం. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని భర్తగా కోరుకుంటూ గోపికా స్త్రీలు ఇదే వ్రతాన్ని ఆచరించారన్నది ఆండాళ్ నమ్మిక. శ్రీ వైష్ణవులు ఏడాది పొడుగునా, ప్రతిదినం తమ యిళ్ళలో, దేవాలయాల్లో ఈ పాశురాలను పఠిస్తారు. కాని ధనుర్మాసంలో పాడే ఈ పాటలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఒక్కొక్క పాశురం ఒక్కొక్క రోజు గానం చేయబడుతుంది. తిరుప్పావై, ధనుర్మాసంలో శ్రీ వైష్ణవులు ఆచరించవలసిన కొన్ని వైష్ణవ ధర్మ నియమాలను నిర్దేశిస్తుంది. దేశమంతటా శ్రీ వైష్ణవులు భగవత్కృప, శాంతిసౌఖ్యాలను కోరుకుంటూ వీటిని గానం చేస్తారు. ఆండాళ్ తన చెలులతో కలిసి, శ్రీకృష్ణుడిని భర్తగా పొందడానికై తిరుప్పావైని గానం చేస్తూ, ముప్ఫైరోజులు కఠిన వ్రతమాచరిస్తుంది.

మార్గశిర మాసంలో గోదాదేవి తన ఈడు ఆడపిల్లలతో కోవెలకు వచ్చి నెలరోజులపాటు గానం చేసిన ముప్పది గీతాలే(పాశురాలే) ఈ తిరుప్పావై. తిరు అనే పదానికి మంగళ వాచకం, శ్రీకరం, శుభప్రదం పవిత్రం మొదలైన అర్థాలు ఉన్నాయి. పావై అంటే వ్రతం. ఈ వ్రతాన్ని వైష్ణవులు మార్గశీర్ష వ్రతమనీ, ధనుర్మాస వ్రతమనీ అంటారు. గోదాదేవి హృదయం నుండి జాలువారిన ఉపనిషత్తుల సారమైన మహావిష్ణువు అనుగ్రహానికి పాత్రులను చేసే పవిత్రమైన వ్రతమే “తిరుప్పావై”గా ప్రసిద్ధికెక్కిన ధనుర్మాసవ్రతం.

మొదటి అయిదు పాశురాలు ఉపోద్ఘాతం, తిరుప్పావై యొక్క ముఖ్యోద్దేశాన్ని తెలియజేస్తాయి. “చిత్తశుద్ధితో భగవంతుని ప్రార్థిస్తే వానలు కురుస్తాయి. పంటలు పండుతాయి, దేశం సుభిక్షంగా ఉంటుంది. శ్రీకృష్ణుడిని పూవులతో పూజిస్తే, పాపాలు నశిస్తాయి” అని గోదాదేవి విన్నవిస్తుంది.

తరువాతి పది పాశురాల్లో, గోదాదేవి చెలులతో కలిసి పూలను సేకరిస్తూ, పల్లె వాతావరణాన్ని వర్ణించే అంశాలు ఉంటాయి. పక్షుల కిలకిలరావములు, రంగురంగుల పూలు, వెన్నను చిలకడంలోని సంగీత ధ్వనులు, ఆలమందల మెడలోని చిరుగంటల సవ్వడి, దేవాలయంలో వినిపించే శంఖారావం మొదలైన వాటి వర్ణనలు ఉంటాయి. ఉదయాన్నే గోదాదేవి ఒక్కొక్కరింటికి వెళ్ళి తన చెలులను తట్టి లేపుతూ వారిని నదిలో స్నానానికి సిద్ధం చేస్తుంది. విష్ణువు యొక్క అవతారాలను పొగడుతుంది.

తరువాతి ఐదు పాశురాలు గోదాదేవి తన చెలులతో కలిసి చేసిన దేవాలయ సందర్శనను వివరిస్తాయి. భగవంతుడిని నిద్ర మేల్కొలపడానికి ఆండాళ్ సుప్రభాతాన్ని ఆలపిస్తుంది. గోదాదేవి, ఆమె చెలులు దేవాలయ పరిరక్షకుల్ని సమ్మతింపజేసి, గుడిలోకి వెళ్ళి శ్రీకృష్ణుడి తల్లితండ్రులను కీర్తిస్తూ, బలరామ కృష్ణులను మేల్కొలపమంటూ వారిని వేడుకుంటారు. తరువాత వారు కృష్ణుడి అష్టమహిషులలో ఒక్కరైన నీళాదేవిని దర్శించి ప్రార్థిస్తారు.

చివరి తొమ్మిది పాశురాలు భగవద్విభూతిని వర్ణిస్తాయి.

చిట్టచివరి పాశురంలో గోదాదేవి తను విష్ణుచిత్తుని కుమార్తె ననీ, ఈ ముప్ఫై పాశురాలు తాను రచించి పాడాననీ, ఎవరైతే వీటిని గానం చేస్తారో వారికి భగవత్కృప తప్పక కలిగి తీరుతుందనీ ఉద్ఘాటిస్తుంది.


(డిసెంబరు 17వ తేదీ ఆదివారం నుండి జనవరి 14వ తేదీ ఆదివారం వరకు ధనుర్మాసం సందర్భముగా సమర్పణ )

సేకరణ : **శ్రీమతి వి.యస్.లక్ష్మి**

# జిజ్ఞాస

**ప్రశ్న : నేనెంతో కాలంగా ధ్యానమభ్యసించే ప్రయత్నం చేస్తున్నాను. కాని సంతృప్తికరమైన మార్పు కలగడములేదెందువలన?**

**శ్రీ భరద్వాజమాష్టారుగారు :** ఇది ఎందరికో ఎదురయ్యే ప్రశ్న. వ్యవసాయం చేయాలంటే ముందు నేలను ఎంతో సంస్కరించాలి, అలానే ధ్యానం సరిగా అభ్యసించ గలగాలంటే మనస్సును ఎంతగానో సంస్కరించాలి. అన్నిటికంటే ముఖ్యం భావశుద్ధి. మనకు అజ్ఞానజనితాలైన ఎన్నో పొరపాటు భావాలుంటాయి సృష్టి, మానవుడు, జీవిత తత్త్వాల గురించి, సరిగా వాటి తత్త్వాన్ని తెలుసుకుంటే గాని ఈ అపోహలు తొలగవు. వాటినాధారం చేసుకొన్న భ్రాంతులు, వ్యామోహాలు తొలగాలి. మనస్సు వాటిచేత చంచలమవుతుంది.ఆ చాంచల్యం తొలగాలంటే వ్యామోహాలు తొలగాలి. అందుకు వస్తువులయొక్క, జీవితం యొక్క తత్త్వం చక్కగా అర్ధంకావాలి. అందుకే భక్తి, జ్ఞాన, అష్టాంగయోగాలన్నింటిలో తత్త్వజ్ఞానం చాలా ఆవశ్యకం. భక్తిమార్గంలో మనకు గోచరించే యీ స్థూల ప్రపంచమొక్కటే వాస్తవంకాదని, మన ప్రాకృతిక జీవితం దుఃఖమయమని, దానినుండి విడవడగల్గితే ఆనందమయమైన భగవత్‌స్వరూపం అనుభవమవుతుందని ధృడంగా



తెలుసుకోవాలి. గుడ్డిగా నమ్మడం కాదు. ఎంత యత్నించినా మనకు స్పష్టంగా తెలియని దానిని ధృడంగా నమ్మసాధ్యం కాదు. శంక ఎదో ఒకమూల దాగియుండి మన యత్నాన్ని బలహీనపరచి భగ్నంచేస్తుంది. క్షుణ్ణంగా తెలిస్తే ధృడమైన నిశ్చయం కలిగి లక్ష్యంపై అపారమైన కోరిక కలుగుతుంది. స్థూలజగత్తులో గోచరించే వస్తువులు, జీవితానుభవాలే పరమసత్యం కాదని తెలియబట్టి వాటికి మనపై ప్రాబల్యం తగ్గుతుంది. జగత్తు పట్ల వ్యామోహం తగ్గి, ఆనందరూపుడైన పరమాత్మ పట్ల నిశ్చయాత్మకమైన ప్రీతి కలిగి కృతార్ధతచేకూరే వరకూ మన యత్నాన్ని సడల నివ్వద్దు. జ్ఞానమార్గంలో కూడ శ్రవణ, మనన, నిధిధ్యాసల నందుకే చెప్పారుకొందరు. అటు జ్ఞానంగాని, ఇటు భక్తిగాని అష్టాంగయోగానికి అవసరం లేదని తలుస్తారు. కాని సరికాదు. యమ, నియమాలు, ఆసన ప్రాణాయామాలు అష్టాంగయోగానికి ప్రధాన సాధనాలుగా చెప్పబడ్డాయి. యమనియమాలంటే ఇంద్రియమనోనిగ్రహం. మనస్సును నిగ్రహించకుండా యింద్రియాలను మాత్రమే నిగ్రహించడం మిధ్యాచారమని, నిష్ప్రయోజనమని, భగవద్గీతలో స్పష్టంగా చెప్పబడింది. కనుక మనస్సును మొదట జయించాలి. అంటే అజ్ఞానంచేత వస్తువుపట్ల, జీవితానుభవాలపట్ల మనకు సామాన్యంగా వుండే భ్రాంతి తొలగాలి. అందుకు వస్తువులు, జీవితానుభవాల వాస్తవతత్త్వం అర్ధంకావాలి. భ్రాంతులు తొలగి, యింద్రియాలు చాలావరకు వాటంతటవే అదుపులో వుంటాయి. దీనికితోడు యోగసిద్ధి ఫలమైన శాశ్వతానందం పట్ల గల తీవ్రమైన ప్రీతి ధ్యేయంపైన మనసు నిలిచేలాగ చేస్తుంది.

''ఋషులచేత విధించబడిన సత్కర్మలను శ్రద్ధగా ఆచరించేవారు, కామ సంకల్పాలను విడిచినవారు, యమనియమాలు కలవారు, సత్య వ్యామోహములను విడిచినవారు మాత్రమే దానికి అర్హులు.

"ఇహలోక పరలోక విషయములందు విరక్తిగల చిత్తముగలవాడికే యోగమునందు అధికారము కలదు. తదితరులకు లేదు. అలానే వేదాంతోపదేశాలను వింటూ యోగాన్నభ్యసించాలని శాండిల్యోపనిషత్తు, శివ యోగప్రదీపిక చెబుతాయి.

ఉత్సాహ, సాహస, ధైర్య, తత్త్వజ్ఞానమువలన, దానివలన కలిగిన నిశ్చయంవలన, యోగసిద్ధి కలుగుతుంది అని హఠయోగ ప్రదీక చెబుతున్నది. 'నిశ్చయాత్' అన్న మాటకు బ్రహ్మానంద స్వామి "విషయములన్నియు మృగతృష్ణవలె అసత్యములని, బ్రహ్మమొక్కటే సత్యమని, తత్త్వజ్ఞానము, శాస్త్రము, గురువాక్యము లందుగల విశ్వాసము" అని వివరించారు. అంటే సృష్టితత్త్వము, జీవితానుభవతత్త్వమూ తెలుసుకోవడం సాధనామార్గాలన్నింటికీ పునాది. పునాది ధృడముగాలేని యిల్లు నిలువదుగదా! వైజ్ఞానిక తాత్త్వికదృష్టినివహించే, సృష్టిపట్ల చూపుతోనే పూజాదికాలు నిర్వర్తించాలని తెల్పడానికే సామాన్యమైన షోడశోపచార పూజలో పురుషసూక్తాన్ని వినియోగిస్తారు. పురుషసూక్తమంతా సృష్టినంతటినీ యిట్టి వైజ్ఞానిక తాత్త్విక దృష్టితో చూపేదేనని "పురుషసూక్త రహస్యం" అన్న చిన్న గ్రంథం చదివితే తెలుస్తుంది. ఇవి చదివి సరియైన అవగాహన పొందనిదే సాధన నిర్దుష్టం కాజాలదు. పై గ్రంథాలు చదవడం శ్రమ అని చాలామంది వాటిని ఉపేక్షిస్తున్నారంటే అర్ధం నేటి సాధకులు, ముముక్షువులు, ధర్మ ప్రచారకులలో ఎక్కువమంది నిజమైన సాధకులు కారన్నమాట. లక్ష్యంమీద ప్రీతి ఉన్నప్పుడు ఎంత శ్రమించైనా మనిషి సాధనాలను సేకరిస్తాడు. డబ్బు, సంసారలంపటము గలవారు వాటికోసం ఎంతైనా ఎలా శ్రమించి వాటిని నెరవేర్చుకునే మార్గాలను తెలుసుకుంటున్నారో చూడండి. అటువంటప్పుడు సర్వదుఃఖాలకూ అతీతమైన శాశ్వతానందాన్ని పొందగోరేవారు గ్రంథాలను చదవడానికి బాధపడతారా? చివరికి ఒక్క మాట. సద్గురువును నిజంగా ఆశ్రయించిన వాడికి అష్టాంగయోగాదులు వాటికై అవే సిద్ధిస్తాయని శాస్త్రవాక్యం.

"దేహేంద్రియముల వలన కలుగు వైరాగ్యము యమము. పరతత్త్వమునందెడతెగక కలుగు అభిలాష నియమం. సర్వవస్తువులయందు ఉదాసీనత ఉత్తమమైన ఆసనం. సకల జగత్తు మిథ్యగాతోచుట ప్రాణాయామము. చిత్తం యొక్క అంతర్ముఖత్వము ప్రత్యాహారము. చిత్తం యొక్క నిశ్చయ స్థితి ధారణ చిన్మాత్రమే నేనని చింతించుట ధ్యానము. ధ్యానానికి అతీతమైన స్థితిలో ధ్యానాన్ని మరచుట సమాధి.

**– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరాద్వజ**

# ధ్యానం ఎలా చేయాలి?

ఆచార్య శ్రీ భరద్వాజ దేవోభవ. నేను ధ్యానాన్ని అభ్యసించే మొదటి రోజుల్లో ధ్యానం సరిగ్గా కుదరక సతమతమయ్యేవాడిని. ఈ విషయం మాస్టారు గారితో చెబితే, "నీవు డైరీ వ్రాయనిదే ధ్యానం సరిగ్గా కుదరదు" అని శెలవిచ్చారు. "డైరీ ఎలా వ్రాయాలో తెలియదు సార్" అన్నాను నేను. ఏముందీ ధ్యానానికి కూర్చున్న తరువాత నీకేమి ఆలోచనలు వచ్చాయో అవి డైరీలో విపులంగా వ్రాయి. వ్రాయటము అయిపోగానే మరలా ధ్యానం మొదలుపెట్టు. మరలా ఆలోచనలు వస్తే వాటిని కూడా విపులంగా వ్రాయి. ధ్యానం కుదరడములేదు అనే ఆలోచనమాని, ఎంతసేపు ధ్యానానికి కూర్చుందామనుకున్నావో అంత సేపూ కూర్చొని వచ్చిన ఆలోచనలు డైరీలో వ్రాస్తూ ధ్యానం చేస్తూ గడుపు, ఇట్లా ఒక వారం రోజులు అయిపోయిన తరువాత నీవు వ్రాసిన డైరీ తీసుకొని నాదగ్గరకు రా! మిగతాది చెబుతా" నన్నారు మాస్టారు గారు. నేను అలాగే చేశాను. డైరీ తీసుకొని వారం రోజుల తరువాత మాస్టారుగారి దగ్గరకు వెళ్ళాను. దానిలో ఏమి వ్రాసి ఉన్నానో చూడకుండానే మాస్టారుగారు రెండవ పాఠం చెప్పారు. అది జీవితంలో మరచిపోలేనిది.



"1. వాచా శూరత్వం ఆపి, క్రియా శూరత్వం చూపు.

2. నీ ధ్యేయమంతా చిత్తశుద్ధి కలదని, అది పరమపవిత్రమైనదని తలచి, ఆ డైరీలోని విషయాలను వివేక విచారములతో విడమరచి వ్రాస్తూ సాధ్యమైనంతవరకు జీవితంలో ధ్యానానికి విఘ్నాన్ని కలిగించే పనికిమాలిన విషయాలను వదలి వేసేందుకు గట్టి కృషి మొదలుపెట్టు. అప్పుడు సాయి నీపై కరుణిస్తాడు. సర్వము సమకూడుతుంది.

ఒక జీవి ఏవేవి అనుభవించాలో అవన్నీ ముందే నిర్ణయమై నీ ఆలోచనలతో ప్రమేయము లేకుండానే నీకు లభ్యమయ్యేటట్లు భగవంతుడు ముందే ఏర్పాట్లు చేసి ఉన్నాడు, అనే సత్యాన్ని ఎన్నడూ మరువబోకు" అని ముగించారు.

మొదట వడ్డీవ్యాపారానికి సంబంధించిన ఆలోచనలు, ఆ తరువాత మా తల్లిగారు నడిపే చిన్న అంగడికి సంబంధించిన ఆలోచనలు, ఇంట్లో ఉండే దూడ, బట్టల ఆలోచనలు, ఆ తరువాత స్కూలులో స్నేహితులతోటి, గత సంభాషణల గురించిన ఆలోచనలు మొదలగు విషయాలు అన్నీ క్రమంగా మానుకోవడంతో శ్రీసాయిశుని దయ, కృప నాపై వర్షింప మొదలు పెట్టింది. కనుక మాస్టారుగారి సలహాలోని గొప్పతనమేమిటో తెలిసి రావటం మొదలు పెట్టింది.

**పారాయణ :**

పూజ్య శ్రీ మాస్టారుగారితో పరిచయ మయ్యాక మాస్టరుగారు ఇతరులతో చెబుతున్న అతి ముఖ్యమైన విషయం నా హృదయానికి హత్తుకున్నది. **"భగవంతుడు మన నుండి నిజంగా కోరేది ఏమిటనుకున్నావు? మన కాలము, మనస్సు – ఈ రెండూ తప్ప మిగిలినవన్నీ మన తృప్తి కొరకు సమర్పించేవే కానీ, ఆయన కోరేవి మాత్రం కావు"** అన్నారు. ఆ మాట నా కెంతో హృదయానికి హత్తుకొని ఉదయం 6 గం. నుండి 9 గం.ల వరకు పారాయణ, పూజ, ధ్యానాలలో గడపాలనుకొని మొదలు పెట్టాను. పారాయణ మొదలుపెట్టక ముందే శ్రీ సాయిలీలామృత మంతా క్షుణ్ణంగా వంటబట్టించుకొని ఉన్నాను. పారాయణ మొదలుపెట్టిన వెంటనే పారాయణ జరుగదు. మొదలు పెడుతూనే ఒకటే ఏడుపు. ఒక నెల అయినా కనీసం ఒక్క పారాయణ కూడా చేయలేక పోయాను. నా బాధను మాస్టారుగారికి చెప్పుకున్నాను. మాస్టారు గారు "నీవు కన్నీళ్ళు కార్చేటప్పుడుగాని, ఆతర్వాత గానీ నీవేమి ఆలోచిస్తుంటావో చెప్పగలవా?" అని అడిగారు. "ఏముంది సార్ సాయి లీలామృతమంతా ఏకరవు పెట్టి, వాళ్ళ కట్లా చేశావు కదా? వీరికట్లా చేశావు కదా? మరి నన్నలా దూరము చేసి అశ్రద్ధచేస్తున్నావేమి స్వామి? నా తప్పేమిటో నాకు చెప్పకూడదా? అని సాయితో నిష్ఠూరాలాడడంతో కాలమంతా గడిచిపోతుంది. ప్రతి నిత్యం ఇదే కొడవ అయింది. ఈ పారాయణ వగైరా లేకుంటేనే హాయిగా ఉండేవాణ్ణి, ఇదెందుకు సార్!" అని నిస్పృహతో మాట్లాడేను.

మాస్టారు గారు ఎంతో ఉత్తేజంగా, ఉత్సాహంగా అన్నారు, "ఈ విషయం నీవు ఎవరితోను చెప్పవద్దు. ఈ సాధనలన్నీ చేసేది ఒకే ఒక ధ్యేయం సాధించేందుకు. ఆ ధ్యేయం ఏమిటంటే మనస్సు నిగ్రహించబడటం. "దానం, స్వధర్మో నియమో యమశ్చ, శ్రుతంచ శాస్త్రాణి సద్వ్రతాని సర్వే మనో నిగ్రహ లక్షణాం తాహః" అన్నారు. "ఈ సాధనాలేమీ చేయకుండానే నీ మనస్సు సాయినాధునిపై లగ్నమవడమంటే, సాయి నీపై కృప చూపినట్లే. ఎన్ని పారాయణలు చేసామనే లెక్క గాకుండా సాయితో ఎంత సేపు ఉండగలిగాము అనే దాన్ని లెక్కలోకి తీసుకుంటూ, ఇదే విధంగా ఇంకా కొన్నాళ్ళు చేస్తూపో, చాలా సంతోషం, లెక్కకు పారాయణలు చేసేవారిని గురించి నీవు ఆలోచించవద్దు. వారిని గురించిన ధ్యాసే అక్కరలేదు" అని సలహా ఇచ్చారు.

(అక్టోబరు 30వ తేదీ పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా సమర్పణ.)

రచన : **పెసల సుబ్బరామయ్య**, గొలగమూడి

# సంత్ జ్ఞానేశ్వర్‌మహరాజ్



సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్ జీవితంలో అనేక అద్భుతాలు ముడిపడి ఉన్నాయి. అందులో ఒకటి అతని శిష్యుడు సచ్చిదానంద శవం యొక్క పునరుజ్జీవనం. 42 సంవత్సరాల వయస్సులో, జ్ఞానేశ్వర్ తన పేద మరియు బహిష్కృత తోబుట్టువులతో కలసి పైఠాన్ నగరంలోని పూజారుల దయకోసం అక్కడకు వెళ్ళాడు. అయితే వారు జ్ఞానేశ్వర్‌ను వారి సోదరీ సోదరులను అవమానించారు, హేళన చేశారు. పిల్లలు వేధింపులకు గురవుతుండగా, సమీపంలోని రహదారిపై ఒక వ్యక్తి ఒక ముసలి గేదెను హింసాత్మకంగా కొరడాతో కొట్టేడు గాయపడిన ఆజంతువు కన్నీళ్లతో కుప్పకూలిపోయింది. జంతువు పట్ల ఆందోళన విరమించాలని గేదె యజమానిని కోరేడు జ్ఞానేశ్వర్. పురోహితులు "మృగం గురించి ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని మరియు వేదాల బోధనల గురించి పట్టించుకోలేదని" జ్ఞానేశ్వర్‌ను ఎగతాళి చేశారు. "వేదాలు అన్ని జీవితాలను పవిత్రమైనవిగా భావించాయని" జ్ఞానేశ్వర్ బదులిచ్చాడు. ఆగ్రహించిన పూజారులు "మృగాలు కూడా వేదాలను నేర్చుకోగలవని అతని తర్కం సూచించిందని" ఎత్తి చూపారు. అంతటితో ఆగని జ్ఞానేశ్వరుడు గేదె నుదిటిపై తన చేతిని ఉంచాడు, మరుక్షణం అది గంభీర స్వరంతో వేద శ్లోకాన్ని పఠించడం ప్రారంభించింది. అది చూసి అక్కడి పండితులందరు అవాక్కయ్యారు.

అదేవిధంగా మరొక అద్భుతం జరిగింది. ఒకసారి అనేక దివ్యశక్తులు కలిగిన చాంగ్‌దేవ్ అనే యోగి, పులిపై స్వారీ చేస్తూ జ్ఞానేశ్వర్‌ను చూసి, గేదెచే వేదం వల్లించగలవు గాని, పులిపై నాలాగా స్వారీ చేయగలవా అన్నాడు. అందుకు వెంటనే జ్ఞానేశ్వర్ "మూగ జీవులపై స్వారీ చేయటం కూడ ఒక విద్యేనా! జీవంలేని వాటిపైనే స్వారీ చేస్తాను" అంటూ తన సోదరీ సోదరులతో కలసి సమీపంలోని ఒక ఇంటి ప్రహరీగోడపై ఆశీనులై ముందుకు సాగమని పలుకగా, వాహనం వలె ఆగోడ ముందుకు సాగింది. అంతటితో చాంగ్‌దేవ్‌కు జ్ఞానేశ్వర్ ముందు తను ఎంతటి అల్పుడనని తెలిసి జ్ఞానేశ్వర్‌ను ఆశ్రయించి అటుపిమ్మట జ్ఞానేశ్వర్ సోదరి అయిన ముక్తాబాయికి శిష్యుడై సేవించాడు.

(కార్తీకశుద్ధ త్రయోదశి నవంబరు 25వ తేదీ శనివారం జ్ఞానేశ్వర్ 'అళంది'లో సజీవ సమాధిలోకి ప్రవేశించినరోజు సందర్భముగా సమర్పణ.)

# సంత్ నామ్‌దేవ్‌మహరాజ్



ఒకసారి జ్ఞానేశ్వర్ మహరాజ్ మరియు సంత్ నామ్‌దేవ్ కలిసి తీర్థయాత్రకు బయలుదేరేరు. వారు కాశీ, గయ మరియు ప్రయాగ గుండా ప్రయాణించి శంకరుని ఆరాధనా స్థలమైన ఔండ నాగనాథ్ చేరుకున్నారు. ఇతర ప్రదేశాలలో మాదిరిగానే ఇక్కడ కూడా వారు శివుని పవిత్ర పాదాల వద్ద పాండురంగడి మహిమలను పాడటం ద్వారా దేవునికి సేవ చేయాలని నిశ్చయించుకున్నారు.

మహాదేవ్‌కు నమస్కరిస్తూ, శ్రీ నామదేవ్ తన కీర్తన ద్వారా పాండురంగడి మహిమలను వివరించడం ప్రారంభించాడు. దీనికి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. ప్రేక్షకులు పారవశ్యంలో మునిగిపోయారు. ఒక్కసారిగా అక్కడ గందరగోళం నెలకొంది. దాంతోకీర్తన ఆగింది. కొంతమంది కొందరు పూజారులు గుమ్మంలో నిలబడి ఉన్నారు. వారు కోపంగా అరుస్తూ "ఇది కైలాస నివాసుడైన ఉమాశంకరుడి పూజాస్థలం. ఇక్కడ హరి కీర్తనలు పాడటం తగ్గించు. పండర్‌పూర్‌కి వెళ్ళి అక్కడ మీ హరికీర్తన, నర్తన చేయండి" అని బిగ్గరగా తెలిపేరు అక్కడివారు. అంతట కీర్తనలను ఆలకించటానికి వచ్చినవారు విఠల్ మరియు శంకర్ ఇద్దరూ ఒకరేనని, వారి మధ్య ఎటువంటి బేధం లేదని జవాబిచ్చారు. "శంకర్ ముందు హరికీర్తన చేయకూడదని ఎక్కడ రాసి ఉంది" అని అడిగారు. ఇది ఆపెద్దలకు మరింత చికాకు పెట్టింది. "మీరు మాకు నేర్పడానికి ప్రయత్నిస్తున్నారా? వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోండి, లేకపోతే చేతులకు పని చెప్పవలసి వస్తుంది" అన్నారు. అందరూ ప్రశాంతంగా లేచి నిలబడ్డారు. ఎవరూ వెళ్లేందుకు ఇష్టపడలేదు. ఇది చూసిన వారు 'ముందు నామ్‌దేవ్‌ను ఇక్కడి నుంచి గెంటేయాలి' అని నిర్ణయించుకున్నారు. వెంటనే వారు నామ్‌దేవ్‌తో, ''మీ కీర్తన కారణంగా ఆలయ ప్రవేశం నిరోధించబడింది. కాబట్టి కీర్తనను ఆలయం వెనుక కొనసాగించండి" అన్నారు. ఇది విన్న సంత్ నామ్‌దేవ్ వారికి సాష్టాంగ నమస్కారం చేసి, ఆలయాన్ని విడిచిపెట్టి, ఆలయం వెనుక కీర్తనను కొనసాగించాడు. భగవంతుని మహిమలు అకస్మాత్తుగా నిలిపివేయవలసి వచ్చినందుకు, అతను నిర్మలమైన మనస్సాక్షితో పాండురంగడిని తన కీర్తనతో ప్రార్థించాడు

ఆర్తితో నామదేవ్ పాడే సంకీర్తన వినటానికి తూర్పు ముఖంగా ఉన్న శంకరుడు తన గుడితోసహా వచ్చి నామ్‌దేవ్ ఎదురుగా

నిలిచేడు. ఈ అద్భుతాన్ని చూసి అక్కడివారు ఆశ్చర్యపోయారు. 'కైలాసపతి నామ్‌దేవ్ భక్తిని అంగీకరించాడు' అని వారు ఎలుగెత్తి కీర్తించారు. అంతట శంకరునికి పూజాదికాలు ముగించిన తర్వాత అక్కడి పెద్దలు ఆలయం నుండి బయలుదేరారు. కీర్తన మళ్లీ ఆలయం ముందు కొనసాగుతుంది. ఏదో జరిగిందని వారు గ్రహించారు. దేవుడే గుడి దిశను మార్చాడని గ్రహించినప్పుడు వారు సిగ్గుతో తలదించుకున్నారు. ఆ విధంగా భగవంతుడే తనకు భక్తుడు ఎంతటి ప్రియమైనవాడో చూపించాడు. ఈ అద్భుతాన్ని గుర్తుచేసే విధంగా ఇప్పటికి ఔండనాగనాథుల ఆలయం పశ్చిమదిశకు తిరిగి ఉంటుంది.

(అక్టోబరు 26వ తేదీ శ్రీనామ్‌దేవ్ మహరాజ్ జయంతి (తిథిప్రకారం) సందర్భముగా సమర్పణ.)

సేకరణ : **శ్రీమతి వై. సాయి శిరీష**, బెంగుళూరు

## పండుగలు - పర్వదినాలు

### అక్టోబరు - 2023

1. ఉండ్రాళ్ళతద్ది
2. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి
2. శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి
14. మహలయపక్షాలు ముగింపు
15. శరన్నవరాత్రులు ప్రారంభం
15. శ్రీ శిరిడీసాయి మహాసమాధి (తేదీప్రకారం)
20. సరస్వతిపూజ
22. దుర్గాష్టమి
23. మహర్నవమి
23. విజయదశమి
24. శ్రీశిరిడీసాయిబాబా 105వ మహాసమాధి మహోత్సవం
26. సంత్ నామదేవ్ జయంతి (తేదీప్రకారం)
28. పాక్షిక చంద్రగ్రహణం - వాల్మీకి జయంతి
30. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి (తేదీప్రకారం)
31. అట్లతద్ది

### నవంబరు - 2023

1. మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి జయంతి (తేదీ ప్రకారం) సంకటహర చతుర్థి
3. అవధూత శ్రీపూండిస్వామి ఆరాధనోత్సవం (తేదిప్రకారం)
6. అవధూత శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవం (తేదీ ప్రకారం)
8. సంత్ ఏకనాథమహరాజ్ జయంతి (తేదీప్రకారం)
11. ధనత్రయోదశి
12. నరక చతుర్దశి
12. దీపావళి
13. ఆకాశదీపం (కార్తీకమాసం) ప్రారంభం
15. భగినీహస్త భోజనం
15. శ్రీసాయిదీక్షలు (మండలం) ప్రారంభం - పవర్‌సిటీ
17. నాగులచవితి
17. శ్రీకాళహస్తి అవధూత శ్రీ వేణుగోపాలస్వామి ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
19. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి (తిథిప్రకారం)
19. కార్తీక సమారాధన - శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం - పవర్‌సిటీ
21. శ్రీ రంగావధూత జయంతి
25. సంత్ జ్ఞానేశ్వరమహరాజ్ మహాసమాధి (తిథిప్రకారం)
26. కార్తీకపూర్ణిమ
27. గురునానక్ జయంతి
28. రామభక్త శ్రీ రంగన్నబాబుగారి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
29. శ్రీ ధునీవాలాదాదా ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
29. మహద్గురు శ్రీ సుధీంద్రబాబుగారి ఆరాధనోత్సవం (తేదీప్రకారం)

### డిసెంబరు- 2023


3. అవధూత శ్రీ ధునీవాలాదాదా ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
6. శ్రీ సాయిదీక్షలు (అర్ధమండలం) ప్రారంభం - పవర్‌సిటీ
16. ధనుస్సంక్రమణం - ధనుర్మాసం ప్రారంభం
18. సుబ్రహ్మణ్యషష్ఠి
20. కాలభైరవాష్టమి
23. వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి
23. గీతాజయంతి
    3వ దత్తావతారం శ్రీ మాణిక్యప్రభువు సమాధిప్రవేశం (తిథిప్రకారం)

24, 25 మరియు 26 శ్రీ దత్తజయంతి మహోత్సవాలు, పవర్‌సిటీ

25. క్రిస్టమస్
26. శ్రీదత్తజయంతి, సాయిదీక్షలు విరమణ
30. భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి (తేదీప్రకారం)
31. ఆంగ్ల నూతన సంవత్సరం 2023కి వీడ్కోలు మరియు 2024వ సంవత్సరానికి ఆహ్వాన ప్రత్యేక సత్సంగమము - శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం, పవర్‌సిటీ, విశాఖపట్నం

### జనవరి - 2024

1. ఆంగ్ల నూతన సంవత్సర ప్రత్యేక సత్సంగమము - పవర్‌సిటీ
8. కంచి పరమాచార్య జగద్గురు శ్రీ చంద్రశేఖర సరస్వతి మహాస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
10. అవధూత శ్రీ అనసూయమాత ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
14. భోగిపండుగ
15. మకరసంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం
16. కనుమపండుగ
16. అవధూత శ్రీరామిరెడ్డితాత ఆరాధనోత్సవం
26. రిపబ్లిక్ డే
27. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా జయంతి (తేదీప్రకారం)
30. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి.



# పూర్ణ అంతరంగాలు

"సాయినాథా! శాంతచిత్తా! అసమాన ప్రజ్ఞాధురీణా! దయాఘనా! కరుణాసింధూ! సత్స్వరూపా! మాయా మోహాంధకార వినాశకా! కులగోత్రాల కతీతుడవైన ఓ సిద్ధ పురుషా! కరుణా వరుణాలయా! శిరిడీ పురవాసా! ఓ సాయినాథ ప్రభూ! పాహి మాం, పాహి మాం, పాహి మాం, జ్ఞాన భాస్కరా! జ్ఞాన ప్రదాతా! సకల సుభంకరా! సద్భక్త హృదయ విహారా! శరణాగత రక్షకా! పాహి మాం.

నీవు సృష్టికర్తవైన బ్రహ్మదేవుడవు; స్థితి కారకుడవైన లక్ష్మీ వల్లభుడవు; ముల్లోకాలకు లయ కారకుడైన రుద్రుడవు కూడ నిశ్చయంగా నీవే. ఓ త్రిమూర్తి స్వరూపా! సాయినాథా! నీకు నమస్సులు. నీవు సర్వవ్యాపకుడవు. ఈ సమస్త భూమండలంలో నీవు లేని చోటంటూ వుందా? నీవు సర్వజ్ఞుడవు. సకల జీవ హృదయాంతరవాసియైన ఓ సాయినాథా! నీకు నమస్సులు.

ఓ సాయిసమర్థా! నా అపరాధాలన్నిటినీ మన్నించు. చంచల మనస్కుడను, భక్తి హీనుడను అయిన నా సందేహాలన్నింటినీ శీఘ్రమే నివారించు. ఓ సాయి గురువరేణ్యా! నీవు ధేనువు. నేను నీ లేగను. నీవు చంద్రుడవు. నేను చంద్రకాంత మణిని. దివిజ గంగా తరంగిణీ తీర్థమైన నీ పవిత్ర చరణ కమలాలకు ఈ దాసుని హృదయ పూర్వక వందనాలు. సాయి సత్ప్రభూ! కరుణతో మీ వరద హస్తాన్ని నా శిరస్సుపై ఉంచి నన్ను దీవించండి. మీ దాసుడి చింతలు, శోకాలు సత్వరమే నివారించండి.

ఓ సాయినాథా! ఈ ప్రార్థనాష్టకాన్ని మీకు సమర్పించి మీ ముందు సాష్టాంగ పడుతున్నాను. నా పాప, తాప, దైన్యాలను సమూలంగా హరించి నన్నుద్ధరించండి. ఓ సాయి గురువరా! మీరు నా ప్రియ జనని. నేను మీ అనుంగు పసిబిడ్డను. కనుక నాపై కాఠిన్యం చూపకండి.

ఓ పతిత పావనా! నీవు మలయగిరియందలి శ్రీ చందన వృక్షంలాంటి వాడివి. నేనో ... ముళ్ళ పొదలాంటివాణ్ణి. నీవు జీవనదియైన పవిత్ర గోదావరి జలం లాంటివాడివి. నేనో ... మహా పాతకుణ్ణి. ఓ గురురాయా! నిన్ను దర్శించగానే నా మనో మాలిన్యాలు, దుర్బుద్ధులు నశించకపోతే నిన్ను చందన వృక్షంలాంటి వాడవని ఎవరంటారు!?

కస్తూరితో కూడిన మన్ను కూడ సుగంధ పరిమళభరితమై దాని విలువ పెరుగు తుంది. పుష్పమాలలోని దారం పుష్పాల సాంగత్యం వల్లనేగదా శిరస్సు పైకెక్కి ఉన్నత స్థానం పొందుతున్నది! మహాత్ములు గ్రహించడంచేత, వారి మహిమవల్ల సామాన్య వస్తువులుగూడ విశిష్ట స్థితిని పొందుతాయి. అదే మహాత్ముల యొక్క సాంగత్య ఫలం.

ఓ గురుదేవా! సాయినాథప్రభూ! నేను దురాచారుణ్ణే! కాని మీ శరణుజొచ్చాను. నా దురాచారాలను నిర్మూలించమని, నాకు సదా మీ పద సన్నిధిని ప్రసాదించమని మిమ్మల్ని పదే పదే వేడుకొంటున్నాను. ఓ సద్గురుమౌళీ! సాయి సమర్థా! సుఖాలను ఆశించి మేము కోరే ఇహలోక పరలోక సంబంధమైన కోరిక లేవైనా మీరు తప్పక నెరవేరుస్తారని నాకు నిశ్చయంగా తెలుసును, కాని గురుదేవా! నాకు సంపూర్ణ వైరాగ్య బుద్ధిని ఇవ్వండి, ఏ సుఖాలు ఆశించని స్థితిని ప్రసాదించండి. చంచలత లేని నిశ్చల మనస్సునివ్వండి. బాబా! నా మనస్సు సదా నా అధీనంలో వుండేటట్లనుగ్రహించండి. సాయి సమర్థా! సముద్ర జలాలను సహితం మధురమైన జలంగా మార్చగల అపార శక్తిమంతులు మీరు. అందువల్ల ఈ దాసుడి ఈ చిరు కోరికను మన్నించండి.

''ఓ పరాత్పరా! ప్రేమాశ్రువులతో మీ పాదాలు కడుగుతున్నాను. మీకు సద్భక్తి అనే చందనం పూయుచున్నాను. బాబా! 'శబ్దాలంకారాలు' అనే కఫ్నీని మీకు వస్త్రంగా సమర్పిస్తున్నాను. 'ప్రేమ భావాలు' అనే కుసుమాలతో కూర్చిన సుకుమాలను మీ గళసీమను అలంకరిస్తున్నాను. ఓపాపభంజనా! నా దుర్గుణాలను, పాప కర్మలను కాల్చి, ధూపంవేసి మిమ్మల్ని అర్చిస్తున్నాను, మాయా అనే ధూపాన్ని, మోహం అనే దీపాన్ని మీ ముందు వెలిగిస్తున్నాను. అందుకు ప్రతిగా వాటిని జయించే స్థితిని ప్రసాదించండి. 'అచంచల విశ్వాసమ'నే సింహాసనాన్ని నిండు మనస్సుతో మీకు ఆసనంగా సమర్పిస్తున్నాను. దయతో దానిపై విరాజమానులై నా "భక్తి"నే నైవేద్యంగా స్వీకరించండి. ఓ సాయీ పరాత్పరా! దానిని ఆరగించి అందలి సారాన్ని తిరిగి నాకు ప్రసాదించండి. నా మనస్సే మీకు దక్షిణగా సమర్పించాను. దయతో స్వీకరించండి. అందుచేత ఇక మీదట నేను చేయబోయే పనులన్నింటికి 'నేను కర్తను' అనే అహంకారాన్ని నాలో నుండి తొలగించి సంపూర్ణ వైరాగ్యస్థితిని ప్రసాదించండి. పుణ్యశ్లోకా! శ్రీసాయినాథప్రభో! సర్వస్య శరణాగతుడనై, అపారమైన భక్తి విశ్వాసాలతో మీ మ్రోల సాష్టాంగ పడుతున్నాను. దయతో నా విన్నపాన్ని స్వీకరించండి ప్రభో!'' అంటూ స్తోత్రము చేస్తూ ద్వారకామాయి వాసుడైన శ్రీసాయినాథుడి పాదాలచెంత మ్రోకరిల్లి, నమస్కరించాడు దాసగణుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ గణపతిరావు దత్తాత్రేయ సహస్ర బుద్దే

తన హృదయ లోతుల్లోంచి బాబాపై పెల్లుబికిన భావాన్ని, అక్షర కుసుమాలుగా ప్రోగుచేసి జగద్గురువయిన శ్రీసాయి పాదాలపై జాలువార్చిన స్తుతిసాహిత్యం "శ్రీ సాయినాథస్థవనమంజరి". స్థవము లేక స్తోత్రము అంటే పొగడ్త అని అర్థం. తనలోని పాండిత్య ప్రతిభతో దాసగణు తన నాలుకపై నడయాడే భావాన్ని అక్షర బద్ధం చేసిన స్తోత్రము కాదు స్థవనమంజరి. అందులోని ప్రతి అక్షరములో జగద్గురువైన శ్రీసాయి నిజతత్త్వాన్ని గ్రహించటానికి ప్రయత్నం చేస్తూనే అంతకు రెట్టింపుగా అంతర్ముఖుడై, తనను తాను పరిశీలించుకుంటూ, మేరు పర్వతం వంటి సాయిపాదాల చెంత చిన్న గులకరాయి వంటి తనకు స్థానం దొరికినందుకు కంటి భాష్పాలు ఆనంద పుష్పాలుగా జాలువారు తుండగా, తన హృదయలోతుల్లో, శ్రీసాయిపై గూడు కట్టుకున్న భావాన్ని అక్షర రూపంలో పెల్లుబికిన స్తుతిసాహిత్యం 'స్థవనమంజరి'.

శ్రీసాయివిశ్వతత్త్వాన్ని ఎరుకపరచుకోవటానికి ప్రయత్నిస్తూ తనను తాను సరిచేసుకోవటానికి జగద్గురువైన సాయిని వేడుకోలు రూపంలో చేసిన స్తోత్రము "స్థవనమంజరి". భగవంతుడి గుణ గణాలను వర్ణించటం వేయి నాల్కుల ఆదిశేషుడికైన అసాధ్యం. సద్గురువు సాయి శక్తిసామర్ధ్యాలు, సామాన్యమైన మనస్సుకు, వాక్కుకు అందనివి, హృదయగతుడైన భగవంతుడి యొక్క అపారమైన కరుణాకటాక్ష వీక్షణాలలో, భక్తి పారవశ్యుడైన భక్తుడి హృదయ లోతుల్లోంచి జాలువారిన భావ పరంపర, అక్షర స్వరూపమై స్తోత్రముగా జాలువారుతుంది. ఆ భక్తుడు పండితుడైతే, భగవంతుడి తత్త్వాన్ని, మహత్యాన్ని మరింత హృద్యంగ, భావ సౌందర్యంతో (సువాసనా భరితమైన, పూలను మరింత అందముగా ఏర్చి కూర్చటములో అల్లేవాని ప్రతిభ గోచరించినట్లు) వెలిబుచ్చ గలుగుతాడు. తమ శక్త్యానుసారం భగవంతుడి లీలలు, మహత్యం, తత్త్వం గ్రహించటానికి చేసే ప్రయత్నానికి భగవంతుడి అనుగ్రహ, అంగీకారం తోడయితే, అది సమగ్రంగా, దివ్యంగా, ప్రామాణికంగా, ఒక మనోహరమైన శైలితో, పఠించేవారి హృదయాలను స్పృశించే విధముగా, తమ హృదయమనే పాత్రలో ఒడిసి పట్టుకున్న భగవంతుడి అనుగ్రహమనే అమృత బిందువులు, మస్తికం నుండి జాలువారి, అక్షర ముత్యాలై స్తవములుగా రూపు దాలుస్తాయి.

బ్రిటీష్ ప్రభుత్వ పోలీసుశాఖలో సిపాయిగా పనిచేస్తూ, తన పైఅధికారుల ఆజ్ఞను అనుసరించి వృత్తిరీత్యా రక్షకభటుడై ప్రజలను నియంత్రిస్తూ, ప్రవృత్తి రీత్యా అనేక మహాత్ములను తాను దర్శిస్తూ, వారి చరిత్రలను గ్రంథస్తం చేస్తూ, ప్రజలకు సన్మార్గము బోధించటానికి హరికథకుడిగా మారి, భగవత్ కథలను గానం చేస్తూ, ప్రజలలో భక్తిభావం పెంపొందిస్తూ, మరొక వంక ప్రజలను సంతోష పెట్టటానికి తన అంతరాలలో దాగి ఉన్న విలాసాన్ని, ద్వంద్వార్థాల నాటకాల రూపంలో ప్రదర్శిస్తూ, ఏవిధంగానైనా ప్రజల మెప్పుకోసం, అధికారుల మన్ననల కోసం, వృత్తిలో పదోన్నతి కోసం విభిన్న ప్రవృత్తితో జీవించే గణపతిరావు, శ్రీసాయి సాంగత్యంలో, అద్భుతమైన రీతిన మార్పుచెంది, ప్రవృత్తినే వృత్తిగా మార్చుకుంటూ, ప్రవృత్తిలోని ద్వంద్వాన్ని భగవంతుని కృపతో, గురు సన్నిధిలో వారి అనుగ్రహంతో, స్వానుభవముతో నిజతత్త్వాన్ని గ్రహిస్తూ

ఏకత్వంవైపు తన పయనం సాగించాడు గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్దే. డిప్యూటీ కలెక్టర్ అయిన శ్రీ నానాసాహెబ్ చందోర్కర్‌కు అంగరక్షకుడిగా ప్రప్రథమంగా శిరిడీ వచ్చిన గణపతిరావ్‌ను చూస్తూ, "వీడికి ద్వంద్వార్థాల నాటకాలపై, ఉద్యోగంలో పదోన్నతిపై గల ప్రీతిని విడిచిపెట్టమని చెప్పు" అని నానాసాహెబ్ ద్వారా శ్రీసాయిచేసిన హెచ్చరికలోని ఆంతర్యాన్ని గ్రహించిన గణపతిరావు, అంచలంచెలుగా హృదయ నైర్మల్యం చెందించుకొని, శ్రీసాయికి అంకిత భక్తుడై, దాస భక్తితో సాయి భక్తులలో గణుతి కెక్కిన వాడిగా, "దాసగణూ"గా బాబాచే పిలువబడి, ప్రజలచే దాసగణుమహరాజ్ గా ప్రశంసించబడి, శ్రీసాయిబాబా మహాసమాధి చెందటానికి 36 రోజుల ముందు వినాయక చవితి రోజున (09-09-1918) తన హృదయ లోతుల్లోంచి జాలువారిన స్తోత్రాన్ని తన శిష్యుడు దామోదర్ సహకారంతో గ్రంథస్తం చేసి, భాద్రపద శుద్ధ సప్తమి (12-09-1918) గురువారము రోజున స్వయంగా ద్వారకామాయి వాసుడైన శ్రీసాయినాథుని సన్నిధిలో గానం చేసి, శ్రీసాయిబాబా పాదాలకు అంకితము చేసిన స్తోత్రరాజము "శ్రీసాయినాథ స్థవనమంజరి".

శిరిడీలోని ద్వారకామాయిలో, శ్రీసాయి ఎదుట దాసగణు "స్థవనమంజిరి" గానం చేస్తున్నంతసేపు సమర్థసద్గురువైన శ్రీసాయినాథుడు తన్మయత్వంతో, నిమీళితనేత్రాలతో, చిరునవ్వు చిందిస్తూ, ఆసాంతం అలకించారు, అనంతరం దాసగణు తాను రచించిన స్థవనమంజరి వ్రాతప్రతిని శ్రీసాయి పాదాలచెంత ఉంచి బాబాకు అంకితం చేసినప్పుడు దానిని స్వీకరిస్తూ "దీనిని నిత్యపారాయణ చేసేవారి సర్వఅరిష్టాలు తొలగి సుఖశాంతులతో, భోగభాగ్యాలతో వర్ధిల్లెదరు గాక" అని శ్రీసాయి ఆశీర్వదించేరు. (ఈ విషయాన్ని నాడు ప్రత్యక్ష సాక్షి శ్రీసాయికి అంకిత భక్తుడైన సగుణమేర్ నాయక్ గ్రంథ ప్రచురణ సమయంలో తెలియచేశారు) తన రచనకు పరమార్థం చేకూరింది అని పరమానంద భరితుడై పారవశ్యంతో బాబా పాదాలపై వ్రాలేడు, శ్రీసాయిపై అచంచలమైన భక్తి, విశ్వాసాలు కలిగి, పండితుడు, కవి, గాయకుడు అయిన "దాసగణుమహరాజ్"గా ప్రసిద్ధికెక్కిన శ్రీ గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్దే.

మనస్సులోని భావాన్ని అక్షర రూపంలో అందించటము మీదుమిక్కిలి, జనామోదకము, జనరంజకముగా చేయటము సామాన్య మైన విషయం కాదు. "గాయమైన హృదయంలో నుంచి జాలువారేదే గేయము" అని ఒకకవి ఉవాచ. హృదయ లోతుల్లోని భావం అక్షర రూపం దాల్చటానికి ఒక్కొక్కసారి, గర్భస్థ శిశువు బాహ్య ప్రపంచానికి వచ్చిన చందమవుతుంది. అర్థవంతంగానే కాదు, సాటివారికి అర్థమయ్యేలా మాట్లాడటము కూడ ఒక కళే. అది అక్షరరూపం సంతరించుకోవాలనే మానవ ప్రయత్నానికి భగవంతుని అనుగ్రహం తోడైనప్పుడు సఫలీకృతమై కథ, కావ్యం, కవిత, స్తోత్రం మొదలైన రూపాలు సంతరించుకుంటుంది. అందలి అంశము వాస్తవికత, దృక్కోణము, అనుభవసారానికి, భగవత్ అనుగ్రహం తోడైననాడు, భక్త-జన హృదయ కవాటాలను తట్టి హృదయ కోవెలలో కొలువై ఉన్న భగవంతుడిని దర్శింపజేసి, వ్యక్తి మార్పుకు కారణమవుతుంది. అది, పాటైనా, మాటైనా,కవిత అయినా, కావ్యమయినా, అవి ఆలోచింపచేసి, ఆచరణకు ఉపక్రమింప చేస్తాయి. అక్షరానికి అంతటి శక్తి ఉంది.

"మహామహిమాన్వితమైన స్థవనమంజరి" పఠించిన వారిపై, శ్రవణంచేసే వారిపై శ్రీసాయి కృప వర్షిస్తుంది. శ్రీసాయినాధుడు సత్వరమే వారి ఐహిక, పారమార్థిక కోరికలన్నీ నెరవేర్చి, అంత్యకాలంలో ఉత్తమ గతులు ప్రసాదిస్తారు. దాని శ్రవణం, పారాయణం వలన మంద బుద్ధి నశించి, బుద్ధి వికసిస్తుంది, అల్పాయుష్కులు శతాయుష్కులవుతారు, నిరుపేదలు ధనవంతులవుతారు, సంతానంలేనివారికి సంతానం కలుగుతుంది, రోగులు పరిపూర్ణ ఆరోగ్యవంతులవుతారు. శ్రవణం, పఠనం చేసేవారి సకల చింతలు, భయాలు తొలగి, కీర్తిమంతులై గౌరవ సత్కారాలు పొందుతారు. చివరకు సర్వవ్యాపి అయిన పరబ్రహ్మను తెలుసుకుంటారు" అని స్థవనమంజరి ముగింపులో దాసగణు వ్రాసిన ఫలశృతిని శ్రీసాయినాధమహరాజ్ ఆమోదించారు, కనుకనే అది ఎంతో మహిమాన్వితమైన స్తోత్రరాజముగా విరాజిల్లుతున్నది.

1963 ఫిబ్రవరి 9వ తేదీన శిరిడీలో శ్రీసాయినాధుని ప్రథమ దర్శనంతోనే, విశ్వచైతన్యానుభూతి పొంది, శ్రీసాయి విశ్వ తత్త్వాన్ని అవగతం చేసుకొని, అనుభవంలోకి తెచ్చుకొని, లక్షలాది మందిని నిర్దుష్టమైన శ్రీసాయి మార్గంలో పయనింపచేస్తున్న పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజగారు స్థవనమంజరి ప్రాశస్త్యము ఎరిగి, మరాఠీ భాషలో శ్రీ దాసగణుచే విరచితమైన స్థవనమంజరిని శ్రీ గంజాం శేషగిరిరావు గారిచే యధాతథముగా పద్యరూపములో తెలుగులోనికి అనువదింపచేసి, 1982 ఆగష్టు 22వ తేదీ వినాయక చవితి పర్వదినాన ఒంగోలులోని ద్వారకామాయి సత్సంగమందిరములో దానిని ఆవిష్కరించి, శ్రీసాయిభక్త జనులకు ఆస్తోత్రమంజరిని అందించి మహోపకారము చేసారు. అటుపిమ్మట ఎంతో మంది పద్యరూపంలో దానిని గానం చేస్తూ, తరిస్తూ, మరల దానిని గద్య రూపములో, సరళ భాషలో వచనరూపంలో సాయిభక్తకోటికి అందిస్తూ, తాము తరిస్తూ, శ్రీసాయి భక్తజనులకు సూక్ష్మంలో మోక్ష మార్గముగా "శ్రీసాయినాధ స్థవనమంజరి"ని అందించారు, అందిస్తున్నారు. అంతటి మహిమాన్వితమైన స్థవనమంజరి గురించి ఎంత చెప్పుకున్నా అది సముద్రంలోని నీటి బిందువు అంత మాత్రమే.

సామాన్య పోలీసు ఉద్యోగి అయిన గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్దే, సముద్ర జలాలనుసైతం మధురమైన జలంగా మార్చగల శ్రీసాయినాధుని పాదాలనుండి గంగా యమునలను పొందే అదృష్టం పొందటానికిగల కారణం స్థవనమంజరిలో అంతర్లీనముగా గోచరమవుతూ ఉంటుంది. తన అంతర్మధనం ద్వారా శ్రీసాయి నిజతత్త్వాన్ని, స్వరూపాన్ని, అవతార పరమావధిని తన హృదయంలో ప్రతిష్ఠితంబు చేసుకొని, దానిని హృదయాక్షర సంపుటిగా వెలువరించినదే శ్రీ సాయినాథస్థవనమంజరి. అందుకు దోహదము చేసిన ప్రతి అంశాన్ని మనో నేత్రంతో పరికిస్తూ, పరిశీలించుకుంటూ, ప్రశ్నించు కుంటూ సాగిననాడు, మనకు దాని ఔన్నత్యం సంపూర్ణంగా బోధపడటానికి కించితైన అవకాశం కలుగుతుంది. శ్రీసాయినాధుని అనుగ్రహంతో, ఆదిశగాసాగే మన ప్రయత్నం కొనసాగించేముందు, స్థవనమంజరి స్మరణ ద్వారా స్మృతిపథంలో మెరిసిన భావాల్ని పదిల పరచుకొని, మన ప్రయత్నం, కొనసాగిద్దాము అంటూ, "శ్రీసాయినాథ స్థవనమంజరి" కూడ ఒక స్తోత్రమే కదా, నేను వ్రాసిన సాయి స్తోత్రానికి దానికి తేడా ఏమిటి అన్న నా చిరకాలపు మిత్రుడైన మూర్తి మాటలకు, మదిలో భావాన్ని వ్యక్తం చేసి, నేను చెప్పిన విషయాన్ని ఆలకించి, ఆలోచిస్తూ ఉండిపోయిన మూర్తిని చూస్తూ మౌనం వహించి ఉండిపోయాను. మాట మౌనం వహించినా, మనస్సు మాట్లాడుతూనే ఉంది. "నా ఆజ్ఞ లేకుండా ఆకయినా కదలదు" అన్నారు శ్రీసాయినాధుడు. అటువంటిది, మాట, పాట, స్తోత్రం, కావ్యం, కథనం, ఇంకా ఎన్నో ఎన్నెన్నో అక్షరం (నాశంలేని) రూపం ధరించాలంటే నాబోటి సామాన్యులకు సంభవమేనా! అటువంటి కార్యములు ఏవైనా జరిపింపబడుతున్నాయి అంటే, ఆ సదాశివుడి కనుసన్నలతో మాత్రమే జరుగుతుంది. "నా ఆజ్ఞలేకుండా చీమయినా కుట్టదని" సదాశివుడంటే, " నా ఆజ్ఞలేకుండా ఆకయినా కదలదు" అన్నారు కదా సాయీశ్వరుడు. అందుకనే కాబోలు శ్రీ దాసగణు "స్థవనమంజరి" రచన ప్రారంభిస్తూ, ఆదినాధుడు గణేశుడిని, వాగ్విలాసిని సరస్వతినీ, కులదైవమైన పాండురంగడితో పాటుగా శ్రీ సదాశివుడిని కీర్తిస్తూ

"ఓపంచవదనా! శంకరా! కపాల మాలాభరణా! నీలకంఠా! దిగంబరా, ఓ పశుపతీ! ఓంకార స్వరూప! నీ నామాన్ని స్మరించినంత మాత్రాన దైన్యం నశిస్తుంది, ఓ ధూర్జటీ ఏమి నీ నామమహిమ, ఓ నీలకంఠా! నీ చరణాంబుజాలకు నమస్కరించి నేనీ స్థవనమంజరి (స్తోత్రాన్ని) వ్రాయబూనితిని, ఓ పరమేశ్వరా! సదా నీ సంపూర్ణ సహాయాన్ని అందించి నన్ను సఫలీకృతుణ్ణి చేయి" అని ఆమహాశివుడిని ప్రార్థించాడు.

శివుడి ఆజ్ఞ గురించి మదిలో మెదలగానే అప్రయత్నంగా సిరివెన్నెల శ్రీ సీతారామశాస్త్రి కలము నుండి జాలువారిన స్వాతిచినుకు, ఆణిముత్యముగా మారి, స్వాతికిరణమై మెరిసిన 'ఆనతి నీయరా! హరా! అంటూ సాగినగీతం హృదయాన్ని స్పృశించి, మనోఫలకంపై దృశ్యకావ్యమై జాలువారుతుండగా మౌనంగా ఆస్వాదిస్తూ ఉండిపోయాను.

ఆనతినీయరా హరా! సన్నుతి సేయగా సమ్మతి నీయరా!
దొరా...సన్నిధి చేరగా!
ఆనతినీయరా హరా! సన్నుతి సేయగా సమ్మతి నీయరా!
దొరా...సన్నిధి చేరగా!
ఆనతినీయరా హరా!

నీ ఆన లేనిదే గ్రహింప జాలున, వేదాల వాణితో విరించి విశ్వనాటకం,
నీ సైగ కానిదే, జగాన సాగున, ఆయోగమాయతో మురారి దివ్యపాలనం
వసుమతిలో ప్రతి క్షణం, పశుపతి నీ అధీనమై
వసుమతిలో ప్రతి క్షణం, పశుపతి నీ అధీనమై
కదులును గా! సదా!... సదాశివ!

ఆనతినీయరా హరా!

జంగమ దేవర సేవలు గొనరా! మంగళ దాయక దీవెనలిడరా!
సాష్టాంగముగ దండము సేతు ర!
ఆనతినీయరా హరా!

శంకర శంకించకుర
వంక జాబిలిని జడను ముడుచుకొని
విషపు నాగులను చంకనెత్తుకొని
నిలకడ నెరుగని గంగనేలి
యే వంకనేలి నా వంకనొక్క కడగంటి చూపు పడనీయవేమి
నీకింకరునిగ సేవించుకొందుర
ఆనతినీయరా హరా!

రక్ష ద్వర సిక్షా దీక్ష! దక్షా విరూపక్షా
నీ కృపావీక్షణాపేక్షిత ప్రతీక్షననుఉపేక్ష సేయక, పరీక్ష సేయక,
రక్ష రక్ష అను ప్రార్ధన వినరా!
ఆనతినీయరా హరా!
సన్నుతి సేయగా సమ్మతి నీయరా దొరా!
సన్నిధి చేరగా ఆనతి నీయరా హరా!

కార్తీకపూర్ణిమ శుభాకాంక్షలతో

మీ... వి.వి.పూర్ణచంద్రరావు

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - పరవాడ

## (2023 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2023 జూలై, ఆగష్టు మరియు సెప్టెంబరు నెలల్లో అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించటమైనది.

జూలై 1న జరిగిన ప్రత్యేక కార్యక్రమములో సామూహిక అక్షరాభ్యాసములు నిర్వహించటమైనది

జూలై 1వ తేదీ స్థానిక మరిడిమాంబ ఆలయ కమిటీవారు అమ్మవారికి సమర్పించిన దాదాపు 350 చీరెలను గిరిజనులు, నిరుపేదలు, దివ్యాంగులు మొదలైనవారికి పంపిణీ నిమిత్తము శ్రీ శిరిడీసాయిసేవాట్రస్టు ఛైర్మన్‌కు శ్రీ సద్గురుపాదుకాక్షేత్రము నందు అందజేయటమైనది. ఆ సందర్భముగా మరిడిమాంబ ఆలయ అభివృద్ధి నిమిత్తము ఐదువేల రూపాయలు ఆలయ కమిటీవారికి ట్రస్టు ఛైర్మన్ అందజేయటమైనది.

జూలై 2 మరియు 3వ తేదీలలో శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు గురుపూర్ణిమ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించటమైనది. జూలై 2వ తేదీ ఆదివారం ఉదయం విఘ్నేశ్వరపూజతో ప్రారంభమైన కార్యక్రమాలు, "శ్రీ దత్త సాయిభరద్వాజ" చాలీసా సామూహిక పారాయణ, శ్రీదత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకలకు సామూహిక పూజచేసి మధ్యాహ్నం భక్తసమారాధన అనంతరం భక్తుల ఆధ్యాత్మిక సందేహాల నివృత్తి కార్యక్రమం "సద్గోష్ఠి" నిర్వహించి, సాయంకాలం లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీసాయినాథ స్థవనమంజరి" పారాయణ చేయటమైనది.

జూలై 3వ తేదీ సోమవారము మరియు గురుపూర్ణిమ సందర్భముగా శ్రీ దత్త సాయి భరద్వాజులకు సామూహిక పంచామృతాభిషేకము అనంతరము లోకకళ్యాణార్థం బ్రహ్మశ్రీ కోటరామశాస్త్రి అధ్వర్యములో సామూహిక శ్రీ సత్యన్నారాయణ స్వామి వ్రతము శాస్త్రోక్తముగా నిర్వహించటమైనది. ఆ కార్యక్రమములో విశేష సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు. విశేష భక్తసమారాధన జరిగింది. "శ్రీభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 70 అతినిరుపేద, దివ్యాంగ, వితంతు కుటుంబాలకు విందుభోజనముతోపాటు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది. తరువాత జరిగిన "ఇష్టాగోష్ఠి" కార్యక్రమములో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు తమ అనుభవాలు తెలియజేశారు. సాయంత్రం పౌర్ణమి ప్రత్యేక ధ్యానం నిర్వహించి సమారాధన ఏర్పాటుచేయటమైనది.

గురుపూర్ణిమ పురస్కరించుకొని శ్రీకాకుళంలోని అనాథ వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

జూలై 13వ తేదీ గురువారం 'తొలిఏకాదశి' పర్వదినాన్ని పురస్కరించుకొని, శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు లోకకళ్యాణార్థము సామూహిక 'శ్రీ సంహితాయన గురుద్విసహస్రి (శ్రీగురుచరిత్ర) ఏకాహ పారాయణ చేసి భక్తసమారాధన ఏర్పాటు చేయటమైనది.

సాయంత్రం జరిగిన ప్రత్యేక సత్సంగమములో "సాయి సంప్రదాయంలో శ్రీగురుచరిత్ర ప్రాముఖ్యత" అనే అంశముపై సద్గురువాణి సంపాదకులు శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు.

జూలై 27వతేదీ శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు ప్రత్యేక సత్సంగమము నిర్వహించి లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీసాయినాథ స్థవనమంజరి" పారాయణ చేయటమైనది.

ఆగష్టు 1,2,3 తేదీలలో అధిక శ్రావణమాస పౌర్ణమి తిథులను పురస్కరించుకొని, శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు 29వ సద్గురువుల పాదుకామహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించటమైనది.

ఆగష్టు 1వ తేదీ ఉదయం శ్రీ దత్తసాయిభరద్వాజులకు పంచామృతాభిషేకము అనంతరం సామూహిక "శ్రీ లలితా, విష్ణు సహస్రనామ" పారాయణచేసి, లోకకళ్యాణార్థము శ్రీ కోట రామశాస్త్రి గారిచే సామూహిక "శ్రీదత్తసాయిభరద్వాజ హోమము" నిర్వహించటమైనది. ఆ కార్యక్రమములో అత్యధిక సంఖ్యలో స్థానికులు, స్థానికేతరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం విశేషముగా జరిగిన భక్త సమారాధన అనంతరం శ్రీదత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకల సహిత శ్రీ దత్తసాయిభరద్వాజులను పవర్‌సిటీ వీధులలో 'పల్లకీ ఉత్సవం' పేరిట ఊరేగించటమైనది. సాయంత్రం "సాయి సంప్రదాయం"పై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమము జరిగింది.

ఆగష్టు 2వ తేదీ బుధవారం శ్రీ దత్తసాయిభరద్వాజులకు పంచామృతాభిషేక, షోడశోపచార పూజ అనంతరం ఉదయం 6 గంటలనుండి సాయంత్రం 6 గంటల వరకు శ్రీమతి యమ్. విజయలక్ష్మి (విశాఖపట్నం) వారి బృందముచే "అఖండసాయినామ సంకీర్తన" జరిగింది. అత్యంత భక్తి ప్రపత్తులతో కడురమ్యంగా జరిగిన ఆ కార్యక్రమములో స్థానికభక్తులు కూడ అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సందర్భముగా సామూహిక "శ్రీసాయి కోటిలేఖనము" జరిగింది. మధ్యాహ్నం భక్తసమారాధన, సాయంత్రం ప్రత్యేక హారతి నిర్వహించటమైనది. అనంతరం జరిగిన కార్యక్రమములో "శ్రీసాయినామ మహిమ" అనే అంశముపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది.

ఆగష్టు 3వ తేదీ గురువారం ఉదయం "సంక్షిప్త శ్రీగురుచరిత్ర" పారాయణ, "శ్రీదత్త సాయి భరద్వాజ చాలీసా", "శ్రీసాయినాధస్థవన మంజరి" పారాయణ అనంతరం లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీసాయి దివ్యపూజ" నిర్వహించి, అందుకు అవసరమైన పూజాసామాగ్రి ఉచితముగా అందజేయటమైనది. ఆ కార్యక్రమములో సమీప గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తసమారాధన అనంతరం " శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 70 అతినిరుపేద, వితంతు, దివ్యాంగుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులతోపాటు, వస్త్ర

బహూకరణ చేయటమైనది. అంతకు ముందు వారందరికి సహపంక్తి భోజనం ఏర్పాటుచేయటమైనది. సద్గోష్టి అనంతరం "సకలకార్య సిద్ధికి - శ్రీసాయి చూపిన మార్గం"పై ఆధ్యాత్మిక ప్రవచనము జరిగింది. అనంతరం జరిగిన సమారాధనతో 29వ సద్గురువుల పాదుకామహోత్సవం అత్యంత వైభవోపేతంగా ఆధ్యాత్మిక పరిపూర్ణతతో సంపూర్ణమైంది. మూడు రోజుల కార్యక్రమాలకి విశేషముగా భక్తులు, ట్రస్టు అనుబంధ సంస్థలనుండి సభ్యులు తరలి వచ్చారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఉచిత వసతి, సామూహిక భోజనాదులు ఏర్పాటుచేయటమైనది. వేలాదిగా విచ్చేసిన భక్తులు దాదాపు 30 మంది శ్రీదత్తావతారుల, అవధూత, మహాత్ముల పాదుకలను, వారు ఉపయోగించిన వస్త్ర, వస్తు సముదాయమును ఒక్కచోట దర్శించి, స్పృశించి పునీతమయ్యామని తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.

ఆగష్టు 12వతేదీ శనివారం విశాఖపట్నంలో జరిగిన '37వ భారతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సు'లో "శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు" వ్యవస్థాపక ఛైర్మన్ మరియు "శ్రీభరద్వాజసద్గురువాణి" సంపాదకులు శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు దంపతులు పాల్గొన్నారు. ఆ సందర్భముగా వి.వి.పూర్ణచంద్రరావు "ఆధ్యాత్మికతతో కూడి మానవత్వపు విలువలు" అనే అంశముపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం నిర్వాహకులు ట్రస్టు ఛైర్మన్ దంపతులను ఘనంగా సన్మానించటము జరిగింది.

ఆగష్టు 15వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీగురుచరిత్ర" ఏకాహ పారాయణ చేయగా, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆ సందర్భముగా అవసరమైనవారికి 'శ్రీగురుచరిత్ర' గ్రంథం ఉచితముగా అందజేయటమైనది.

ఆగష్టు 24వ తేదీ గురువారం అవధూత శ్రీ వెంకయ్యస్వామివారి ఆరాధనోత్సవం సందర్భముగా స్వామివారి పాదుకలకు, వస్త్రమునకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి, అనంతరం "శ్రీవెంకయ్యస్వామివారి చరిత్ర" సామూహిక పారాయణచేయటమైనది. అనంతరం భక్తసమారాధన ఏర్పాటు చేయటమైనది. సాయంత్రం ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, ప్రసాద వితరణ చేయటమైనది.

ఆగష్టు 31 తేదీ గురువారం శ్రావణపౌర్ణమి సందర్భముగా నర్సీపట్నంలోని, శ్రీ పాకలపాటిగురువుగారి (శ్రీ దామరాజు వేంకటరామయోగీంద్రులు) ఆశ్రమములో, శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ఆధ్వర్యములో శ్రీ సద్గురువులపాదుకామహోత్సవం నిర్వహించటమైనది. ఆ సందర్భముగా విచ్చేసిన వేలాదిమంది పౌర్ణమి హోమములో పాల్గొని, పాదుకలను దర్శించి పరవశించారు. భక్తులందరికి నిర్వాహకులు భోజనాదివసతులు ఏర్పాటు చేశారు. పాదుకామహోత్సవం సందర్భముగా ఆశ్రమ నిర్వాహకులు ట్రస్టు ఛైర్మన్ దంపతులను ఘనంగా సత్కరించారు.

నిజశ్రావణపౌర్ణమి గురువారము సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో సాయంత్రం ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, సమారాధన ఏర్పాటుచేయటమైనది.

సెప్టెంబరు 3వ తేదీ ఆదివారం అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీ చీరాలస్వామి చరిత్ర" ఏకాహపారాయణ చేయటమైనది. అనంతరం భక్తసమారాధన జరిగింది.

సెప్టెంబరు 7వ తేదీ శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి సాయంత్రం "జగద్గురువు శ్రీసాయికృష్ణుడు" అనే అంశముపై ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, ప్రసాద వితరణ చేయటమైనది.

సెప్టెంబరు 12వ తేదీ శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో జరిగిన ఒక కార్యక్రమములో "శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 70 అతి నిరపేద, వితంతు, దివ్యాంగుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు బహూకరించి, వైద్యఖర్చుల నిమిత్తము నిరుపేద గిరిజనులకు ఆర్థిక సహాయము అందజేయటమైనది.

సెప్టెంబరు 14వ తేదీ గురువారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీగురుచరిత్ర" ఏకాహ పారాయణ చేయటమైనది.

సాయంత్రం ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, భక్తసమారాధన ఏర్పాటు చేయటమైనది.

సెప్టెంబరు 18వ తేదీ వినాయకచవితి సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో లోకకళ్యాణార్థము విఘ్నేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించటమైనది. వినాయకచవితి మరియు శ్రీపాద శ్రీవల్లభుల జయంతి శుభ సమయములో శ్రీదత్తసాయిభరద్వాజుల అనుగ్రహంతో, తెలంగాణ రాష్ట్రంలోని, బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహరాజ్‌గారి ఆశ్రమమునుండి శ్రీ అవధూతానందగిరిస్వామి అనుగ్రహంతో ప్రస్తుత పీఠాధిపతి, శ్రీ సిద్దేశ్వరానందగిరిస్వామి వారు శ్రీ దత్తగిరిమహరాజ్‌గారి పాదుకలు మరియు చిత్రపటము, శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంనకు బహూకరించటమైనది. ఆ సందర్భముగా శ్రీ దత్తగిరిమహరాజ్ పాదుకలకు ట్రస్టు ఛైర్మన్ దంపతులు విశేష పూజాదికములు నిర్వహించారు. అనంతరం భక్తజనులు వాటిని దర్శించుకొని, శ్రీ దత్తసాయిభరద్వాజుల అనుగ్రహానికి పొంగిపోయారు. ఇప్పటికి శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు శ్రీ దత్తావతారులు, అవధూతలు, మహాత్ములు 32 మంది పాదుకల రూపంలో కొలువై భక్తులను అనుగ్రహిస్తున్నారు. అది అంతయు శ్రీ దత్తసాయి కృపానుగ్రహముతో గత 36 సంవత్సరాలుగా నిరాటంకముగా జరుగుతున్న సత్సంగమము మరియు పారాయణం ఫలితమే.

సెప్టెంబరు 28వ తేదీ గురువారం అనంతపద్మనాభచతుర్దశి సందర్భముగా విశేష సత్సంగమము నిర్వహించి, సమారాధన ఏర్పాటు చేయటమైనది. ఆసందర్భముగా స్థానిక అనాథ ఆశ్రమమునకు వారి కోరికమేరకు నెలకు సరిపడా బియ్యము అందజేయటమైనది.

స్థలాభావము వలన ఆ యా కార్యక్రమాల విషయ విశేషాలు సంక్షిప్తముగా అందజేయటమైనది.

సమీక్షకురాలు : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2023 జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)



పూర్తి వివరములకు 21 పేజీ చూడగలరు

# మేము సహితం

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ 2023 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు కూడ నిర్వహించటమైనది.

సామాజిక కార్యక్రమాలలో భాగంగా, 'శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం' పేరిట అతి నిరుపేద, వితంతు, దివ్యాంగుల 70 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, ప్రతినెల అందజేయటముతో పాటుగా, స్థానిక నిరుపేద కుటుంబాలకు కూడ నిత్యావసర వస్తువులు అందజేయటము, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు, ఆర్థిక సాయం అందజేయటము, శ్రీకాకుళంలోని నిత్యాన్నదాన సేవాసమితి వారికి, ప్రతినెల, అవసరమైన నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయటం, ఆ యా మహాత్ముల ఆరాధనోత్సవాల సమయములలో అవసరమైన నిరుపేద కుటుంబాలవారికి వారి అవసరాన్ని అనుసరించి ధన, వస్త్ర, అన్నదానాలు చేయటము, మారుమూల గ్రామాలలోని అతినిరుపేద గిరిజనులకు, స్థానికముగా వైద్య సహకారము అందించటముతోపాటుగా రవాణా మరియు మందుల నిమిత్తము ఆర్థిక సహాయము, స్థానిక అనాథ ఆశ్రమము వారికి నెలకు సరిపడా బియ్యం అందజేయటము మొదలైనవి సేవాకార్యక్రమాలలో కొన్ని. వీటితో పాటుగా ఆ యా సందర్భాలలో, ఆర్తుల అవసరాన్ని అనుసరించి ట్రస్టు ప్రాంగణములో వివిధ రూపాలలో సహాయ సహకారములు అందజేయటము జరుగుతున్నది.

మేము చేసే సామాజిక సేవా కార్యక్రమాలకు సహృదయంతో ఇతోధికంగా తమవంతు సహాయముగా ధన, వస్తు రూపేణా సహకారములు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు, హృదయ పూర్వకంగా మీరందించే ప్రతి చిరు సహాయము దైవసహాయముగా భావిస్తూ, తగురీతిన అర్హులైన వారికి అందించే దిశగా మావంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాము.

సహాయ సహకారములు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదములర్పిస్తూ, శ్రీదత్త,సాయి భరద్వాజుల కృపానుగ్రహముతో వారు మరింతగా సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, చేయూతనిచ్చిన వారి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము. ఆధ్యాత్మిక - సామాజిక సేవాకార్యక్రమాల పూర్తి వివరాలకు 21వ పేజీలో చూడగలరు.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| శ్రీ పి. రామారావుమాష్టారు, పవర్‌సిటీ, విశాఖపట్నం | 10000/- |
| శ్రీ అప్పారావు, దేశపాత్రునిపాలెం, విశాఖపట్నం | 10000/- |
| శ్రీమతి సిహెచ్. కృష్ణవేణి, కూర్మన్నపాలెం | 8000/- |
| శ్రీ కె, రమేష్‌బాబు, శ్రీనగర్, విశాఖపట్నం | 3000/- |
| శ్రీమతి ఎ. శారద సత్యన్నారాయణ, కెనడా | 3000/- |
| శ్రీ పార్థసారధి, అనకాపల్లి | 1680/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 1212/- |
| శ్రీమతి ఆర్.యు.వి.ఆర్.యస్.లక్ష్మి, విశాఖపట్నం | 1116/- |
| శ్రీ వి. సురేష్‌కుమార్, కాట్పాడి, తమిళనాడు | 1000/- |
| శ్రీమతి యమ్. మహాలక్ష్మి, విశాఖపట్నం | 1000/- |
| శ్రీమతి బి. సుశీల, పవర్‌సిటీ, విశాఖపట్నం | 501/- |
| శ్రీ వి. సత్యన్నారాయణ, కోడూరు, కడప | 500/- |
| శ్రీ బి. కృష్ణారావు, విశాఖపట్నం | 500/- |
| శ్రీ జి. హనుమంతరావు, యన్.టి.పి.సి, పరవాడ | 500/- |
| శ్రీమతి స్రవంతి, యన్.టి.పి.సి, పరవాడ | 500/- |
| శ్రీమతి బి. వెంకటలక్ష్మి, విశాఖపట్న | 300/- |
| శ్రీ బి. భిక్షపతి, హైదరాబాదు | 251/- |
| శ్రీ జి. అప్పలనాయుడు, పవర్‌సిటీ, విశాఖపట్నం | 200/- |
| శ్రీ కె. సన్నిబాబు, పవర్‌సిటీ, విశాఖపట్నం | 200/- |

## అక్షర యజ్ఞానికి చేయూత

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా నిర్వహించే సామాజిక సేవాకార్యక్రమాలకు మరియు "శ్రీ భరద్వాజసద్గురువాణి" ద్వారా వేలాది భక్తుల జ్ఞాన తృష్ణతీర్చే అక్షరయజ్ఞానికి తమవంతు సహకారముగా

**శ్రీ కె. కరుణారెడ్డి**, వారి కుటుంబసభ్యులు-USA రూ॥1,16,279/-

శ్రీమతి ఆర్.యు.వి.ఆర్.యన్ లక్ష్మి, విశాఖపట్నం 1116/-

అందజేయటమైనది. వారి సహృదయతకు ధన్యవాదాలు అర్పిస్తూ, శ్రీ దత్తసాయి భరద్వాజుల కృపానుగ్రహముతో వారు మరింతగా ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, మరొక్కసారి కృతజ్ఞతాభివందనములతో - మేనేజరు

**ధన, వస్తు రూపేణా మీ విరాళములు పంపవలసిన చిరునామా :**

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్ట్ (రిజిష్టర్డ్)**

**ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం)**
**విశాఖపట్నం - 531 021. సెల్ : 9849645224**

**మేము సహితమునకు విరాళములు పంపుటకు**
**చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**శ్రీ భరద్వాజ సద్గురువాణి సభ్యత్వము కొరకు విరాళములు పంపుటకు**

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 095510011006491
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**గమనిక :** సేవా కార్యక్రమాలకు, బ్యాంకుఎక్కౌంటులో సొమ్ము జమచేయు వారు, తమ పూర్తి వివరాలుఈ క్రింది నెంబరుకు మెసేజ్ ద్వారాగాని, వాట్సప్ ద్వారాగాని తెలియజేయగలరు
**సెల్ నెం. : 98496 45224** **- మేనేజరు**

# బాలవికాసం - ధర్మ మహిమ

"ధనం పెరిగినకొద్దీ దానం పెరగాలి. విలాసాలు, డాబు పెరుగుతున్నాయి అంటే, ఏ నాటికైనా పతనం తప్పదు"

వరిపంటకు నీరు లేకపోతే ఎండిపోతుంది, సమంగా ఉంటే బంగారంలా పండుతుంది. నీరు అధికమైతే, ఆ నీటనే మునిగి కుళ్ళి నశిస్తుంది. ఇక్కడ నీటినే ధనం అనుకుంటే తగినంత లేకుంటే కరువు, సరిపడా ఉంటే సమృద్ధి, ఎక్కువైతే తనను తానే నశింపచేసుకునే రాచమార్గం. అదే అధికంగా ఉన్న ధనాన్ని (నీటిని తీసివేస్తే) దానం చేస్తే తిరిగి దైవానుగ్రహమనే దివ్య ఫలాన్ని పొందవచ్చు. ఇప్పుడు లోకం తీరు మారింది. ఉన్నది తినేకంటే, తింటూ ఎదుటివాడికి చూపి గొప్పలు కొట్టుకునే పద్ధతి పెరిగింది. తనకున్న డబ్బు, కార్లు, బంగళాలు, విలాస వస్తువులు, తిరిగిన ప్రాంతాలు అన్నీ వెంటనే ఇతరులకు ప్రచార, ప్రసారమాధ్యాల ద్వారా చూపాలి. దేవాలయానికి వెళ్ళినా, దైవదర్శనం కంటే ఫోటోలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. చీరలు నగలు ధరించి షోకేసుల్లో బొమ్మల్లా, ఇతరులకు ప్రదర్శించాలి. నిజానికి ఇటువంటి వారి చూపు, నవ్వు, ప్రదర్శన అంతా పటాటోపమే, వీరికి అంతర్గత శాంతి ఉండదు. వీరిని చూసి, ఇతరులు అనుకరించరాదు. మరి అంతర్గత శాంతి, ధర్మచక్రం యొక్క బలం ఎలా ఉంటుంది అని అడిగేవారు, చక్వేణ మహారాజు కథను తప్పక చదివి తెలుసుకోవాలి.



పూర్వం చక్వేణుడు అనే ధర్మాత్ముడు, సదాచారపరాయణుడు, సత్యవాది, దయామయుడు, మహాజ్ఞాని అయిన మహారాజు ఉండేవాడు. అతను రాజద్రవ్యాన్ని తనకోసం వాడుకోవడం దోషంగా భావించి, భార్యతో తన పొలంలో వ్యవసాయం చేసుకునేవాడు. రాణి నాగలి లాగితే రాజు విత్తనాలు చల్లేవాడు. తమ పొలంలో పండిన ప్రత్తితో బట్టలు చేసుకు ధరించేవాడు. తమ పొలంలో పండిన ఆహారమే తినేవారు. రాణికి ఖరీదైన ఆభరణాలు ఉండేవి కావు. వారి కష్టార్జితం వారి జీవనానికి సరిపోయేది.

ఒకనాడు ఆ రాజ్యంలో జరిగిన తీర్థానికి వచ్చిన ధనికులైన వ్యాపారుల భార్యలు, ఆడంబరంగా రాణిని దర్శించి, ఆమె కూడా మహారాజును అడిగి, అటువంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారి మాటలు విన్న రాణి చక్వేణుడిని తనకూ విలువైన వస్త్రాభరణాలు కావాలని కోరింది. రాజు బాగా ఆలోచించాడు. తాను రాజద్రవ్యాన్ని ముట్టడు. కాని తను సామ్రాట్టు కనుక దుష్టులు, బలవంతులు, అత్యాచారులు అయిన రాజుల నుంచి పన్నును వసూలు చేయవచ్చు అనుకున్నాడు. తన మంత్రిని రప్పించి, "ఒక రాక్షస రాజు వద్దకు వెళ్ళి, నేను 1.25 మణుగుల బరువైన బంగారాన్ని పన్నుగా చెల్లించమని ఆజ్ఞాపించాను అని చెప్పి తీసుకురమ్మని"అనుజ్ఞ ఇచ్చాడు. మంత్రి తెచ్చిన వార్తను విన్న బలగర్వితుడైన ఆరాజు అతన్ని పరిహాసం చేసి పంపాడు. ఇదే విషయాన్ని తన భార్యకి చెప్పగా, ఆమె 'స్వామీ! పొరపాటు చేసారు. వారడిగిన బంగారం ఇవ్వాల్సింది. చక్వేణుడి మహిమను రేపు ఉదయం మీకు చూపుతాను" అంది. ఉదయం ఆమె పావురాలకు గింజలు వేసి, అవి తింటూ ఉండగా, 'మనరాజు మీద ఆన, గింజలు ముట్టకండి" అంది. అవి లెక్కచేయక తినసాగాయి. 'చూశారా స్వామి! ఇదీ చక్వేణుడి ధర్మ చక్ర మహిమ' అంది ఆ రాక్షసరాజు భార్య. "పిచ్చి పక్షులకు ఏమి తెలుస్తుంది" అంటూ కొట్టి పారేశాడు ఆరాజు.

చక్వేణుడి మంత్రి సముద్ర తీరానికి చేరి, ఇసుక, మట్టితో రాక్షసరాజు నగర నమూనాను సరిగ్గా అలాగే చేసి, 'ఒక వినోదం చూపుతాను" అంటూ రాజుని పిలుచుకువచ్చాడు. 'చక్వేణ మహారాజుపై ఆన" అంటూ నమూనాలో తూర్పువైపు ఉన్న బురుజులు, ప్రాకారాలను పడగొట్టగానే, నిజంగా ఆరాజ్యంలో అమరిఉన్న నిజమైన తూర్పు వైపు బురుజు, ప్రాకారం కూలిపోయాయి. హతాశుడయ్యాడు ఆరాజు. అలాగే మంత్రి నమూనాలో ఉన్న తూర్పువైపు స్థూపాలు, 'చక్వేణ మహారాజుపై ఆన" అంటూ పడగొట్టగానే నిజంగానే ఆరాజ్యంలో ఉన్న తూర్పువైపు స్థూపాలు కూలిపోయాయి. ఇది చూసి బెదిరిన ఆరాజు, చక్వేణుడి మంత్రి కోరిన బంగారాన్ని అతడికి ఇచ్చి పంపేశాడు.

మంత్రి ఆ బంగారాన్ని చక్వేణుడికి ఇవ్వగా, అతడు అది ఎలా తెచ్చావో చెప్పమని మంత్రిని అడిగాడు. మంత్రి చెప్పింది విన్న రాణి ఆశ్చర్యచకితురాలు అయింది. ఆమె పవిత్ర వర్తనం యొక్క మహిమ తెలుసుకుని, బంగారం వద్దంది. ఆ బంగారం తిరిగి ఆ రాక్షసరాజుకి పంపివేయబడింది. అన్ని లోకాలను ప్రభావితం చెయ్యగల చక్వేణుడి త్యాగబుద్ధిని తెలుసుకుని, ఆరాక్షసరాజు హృదయం కూడా పరివర్తన చెంది, మంత్రిని ఆదరించి పంపివేసాడు.

**నీతి :** క్షణకాల దుస్సాంగత్యం కూడా అనర్థాన్ని కలిగిస్తుంది. అందుకే దురభ్యాసాలు, మత్తుపదార్థాలు, క్రీడావినోదాలు, ఖరీదైన ఆడంబరాలతో గడిపేవారి సాంగత్యం వదలాలి. మోసంతో ఆర్జించిన మృష్టాన్నం కూడా విషతుల్యమే అవుతుంది. పవిత్ర ద్రవ్యం వల్ల ప్రాప్తించిన పిడికెడు అన్నమైనా అమృతతుల్యం అవుతుంది. దానం, దయ, ప్రేమతో అన్ని ప్రాణులపట్ల సమభావంతో ప్రవర్తిస్తే

ప్రపంచమే పాదాక్రాంతం అవుతుంది. ఇది సత్యం.


మన జీవితంలో సాంగత్యం ఎనలేని ప్రభావాన్ని చూపుతుంది. నీ స్నేహితులు ఎవరో నీవు చెప్పు, నీ గురించి నేను చెబుతాను అని ఒక నానుడి. మన స్నేహితులపట్ల మన మాటలు, అలవాట్లు, చర్యలు మనస్సు బుద్ధి మొదలైనవి రూపుదిద్దుకుంటాయి. అందుకనే ఎల్లప్పుడూ సజ్జనులతో సాంగత్యం చేయటం మంచిది. తద్వారా సద్బుద్ధి స్థిరమవుతూ, మరింత ఉన్నతంగా మారటానికి దోహదమవుతుంది. అలనాడు ఋషులు కూడ "మాకు అన్ని దిక్కులనుంచి ఉత్తమమైన భావాలే వచ్చుగాక" అని అడిగేవారట.

"మనలోని భావాలే మాటలలో వ్యక్తమయ్యి క్రియారూపం దాలుస్తాయి" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజగారు. ఆ భావాలు మన సంస్కారాలపై ఆధారపడి ఉంటాయి. మనలోని చెడు సంస్కారాలను గుర్తించి తొలగించుకుంటూ ఉత్తమ సంస్కారాలను పెంపొందించుకుంటూ జీవితాన్ని సాఫల్యం చెందించుకోవాలి. అప్పుడే మనిషి జన్మకు సార్ధకత. ఆ రీతిలో మనం సజ్జనులతో సాంగత్యం నెరిపి, సన్మార్గవర్తనులము అవుదాము ఏమంటారు బాలలు

సేకరణ మరియు సంకలనం : **సత్యేంద్రకుమార్,** విశాఖపట్నం

# స్ఫూర్తి ప్రదాత - శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి

శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రిగారు చిన్నతనంలోనే దేశ భక్తిని పెంచుకొని గాంధీజీతో పాటు పలు స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మంత్రిగా మరియు జవహర్‌లాల్ నెహ్రూ చనిపోయిన తరువాత భారతదేశ రెండవ ప్రధానమంత్రిగా బాధ్యతలను చేపట్టారు.



దేశ ప్రధాని కాకముందు శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారు ఉత్తరప్రదేశ్‌లో అలహాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో గెలిచారు. దానితో సహజంగా 'అలహాబాద్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టు'కు కూడా ట్రస్టీ అయ్యారు. అపుడు అక్కడి 'టాగూర్‌నగర్' అనే పేరుతో 1/2 ఎకరా భూమిని విభజించి వేలానికి పెట్టారు. శాస్త్రి వూళ్ళో లేని సమయంలో, ఆయన అంతరంగిక మిత్రుడొకాయన కమీషనర్‌ను కలిసి 'శాస్త్రి' గారికి సొంత ఇల్లులేదు. కాబట్టి ట్రస్టు సభ్యులందరూ ఒక్కో ప్లాటు దక్కించుకొనేలాగా ఒప్పించి, తనకు, శాస్త్రికి ఒక్కో ప్లాటు సంపాదించగలిగాడు. ఆ విషయాన్ని శాస్త్రి గారి భార్య లలితాశాస్త్రితో చెపితే "పోనీలెండి, అన్నయ్యగారూ, మీ ప్రయత్నం కారణంగా ఇన్నేళ్ళకు "స్వంత ఇల్లు" అనే మా కల నెరవేరబోతుంది అని సంతోషించారట. రెండురోజుల తరువాత అలహాబాద్ తిరిగొచ్చిన శాస్త్రిగారికి ఈ విషయం తెలిసింది. ఆయన చాలా బాధపడ్డారు. తన అంతరంగిక మిత్రుడిని పిలిచి "నాకు ఈ విషయం తెలిసినప్పటినుండి రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. మనం ప్రజాప్రతినిధులం. ప్రజలముందు నిజాయితీగా నిలవాల్సిన వాళ్ళం. నేను నా ప్లాటును వాపసు ఇచ్చేస్తున్నాను. మీరుకూడా వాపసు ఇచ్చేయండి. లేదా రాజీనామాచేసి, సాధారణ పౌరుడిగా వేలంపాటలో పాల్గొని, కావాల్సి వుంటే ప్లాటును దక్కించుకోండి" అని చెప్పి ప్లాటును ట్రస్టుకే వాపసు ఇచ్చేసారట. జీవితాంతం స్వంత ఇల్లులేకుండానే జీవించారు.

లాల్‌బహదూర్‌శాస్త్రి దేశ ప్రధానమంత్రి అయిన తరువాత కూడా ఆయన కొడుకులు సిటీ బస్సుల్లోనే ప్రయాణించేవారు. కొందరు స్నేహితులు ఈ విషయంగా కొంచెం గేలిచేయడంతో, కారు కొనమని వాళ్ళు తండ్రి (శాస్త్రిగారు) మీద ఒత్తిడిచేస్తే ఇష్టంలేకపోయినా, ఆయనఅక్కడక్కడ అప్పులుచేసి ఒక ఫియట్‌కారు కొన్నారు. కారు కొనేందుకు చేసిన అప్పు ఇంకా 4600 రూపాయలుండగా శాస్త్రి మరణించారు. ఈ విషయం దినపత్రికల్లో వచ్చిందట. దేశవ్యాప్తంగా శాస్త్రి అభిమానులు, ఆయన భార్య లలితాశాస్త్రికి మనీఆర్డర్ చేశారట. రెండు సంవత్సరాలపాటు ఆమె మనిఆర్డర్‌లు అందుకొన్నారట. కానీ ఆమె డబ్బు పంపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలతో ఉత్తరం వ్రాస్తూ, డబ్బును కూడా వాపసు పంపించేసారట.

లాల్ బహదూర్‌శాస్త్రి ప్రధానిగా ఉన్న సమయంలో వీరి పెద్ద కొడుకు హరికృష్ణశాస్త్రి అశోక్ లేలాండ్ సంస్థలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆ సంస్థవారు హరికృష్ణశాస్త్రికి సీనియర్ మేనేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. సంతోషించిన హరికృష్ణశాస్త్రి మరుసటిరోజు, లాల్‌బహదూర్‌శాస్త్రి గారికి ఈ విషయం తెలిపాడు. ఒక నిముషం ఆలోచించి, "హరీ, ఆ సంస్థ, అకస్మాత్తుగా నీకెందుకు ప్రమోషన్ ఇచ్చిందో నేనూహించగలను. కొన్ని రోజుల తరువాత, ఆ కంపెనీవాళ్ళు ఏదో ఒక సహాయం చేయండని నాదగ్గరకు వస్తారు. నేను వారికాసహాయం చేస్తే దేశ ప్రజలు దాన్నెలా అర్ధంచేసుకుంటారో నాకు తెలుసు, నీకూ తెలుసు. పాలకుల నిజాయితీని ప్రజలు శంకించేలాగా జీవించడానికి నేను వ్యతిరేకం. కాబట్టి నీవు వెంటనే ఆ సంస్థలో నీ ఉద్యోగానికి రాజీనామా చేయి, నేను ప్రధానిగా వున్నంతకాలమూ నీవు ఆ సంస్థలో ఉద్యోగం చేయడానికి లేదు" అన్నారట.

బాలలు విద్యతోపాటు విచక్షణాజ్ఞానము కూడ అలవరచుకున్నప్పుడు మాత్రమే ఉత్తమ పదవులతోపాటు అత్యున్నత సంస్కారము కూడ అలవడి, పలువురికి ఆదర్శముగా నిలవడమవుతుంది. అందుకని చదివే చదువులు కేవలం ధనార్జన (ఉద్యోగ, వ్యాపారాలు) కోసం మాత్రమే కాకుండా, తనకు తన కుటుంబానికి సహకరిస్తున్న సమాజానికి హితము చేకూర్చే విధముగా విద్య సముపార్జన చేయాలి.

(అక్టోబరు 2వ తేదీ సోమవారం శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రిగారి జయంతి సందర్భముగా సమర్పణ.)

సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష**, విజయవాడ

# ఆదర్శమూర్తి 'శ్రీ గాడ్గే (బాబా) మహరాజ్'

ఈయన అసలుపేరు దేవీదాస్ దేబూజీ. గాడ్గే మహరాజ్ మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన అంజన్గావ్ తాలూకాకు చెందిన షేన్గావ్ గ్రామంలోని రజక కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లితండ్రులు జింగ్రాజీ, సక్కుబాయిలు. వారు రజక కులంలో జన్మించినా తండ్రితాతల కాలం నుంచే ఉన్న భూమిని సాగుచేసుకుంటూ జీవించేవారు. తండ్రి దేబూజీ చిన్నతనంలోనే మరణించడంతో దేబూజీ మేనమామ ఇంట్లో ఆశ్రయం పొందేరు. మేనమామ కూడా మంచి భూవసతి కలిగినవాడే కావడంతో దేబూజీ ఆయన పశువుల్ని చూసుకుంటూ, పొలంపనులు చేస్తూ కుటుంబంలో మంచిపేరు తెచ్చుకున్నారు. చిన్నతనం నుంచీ భజనమండళ్ళలో కీర్తనలు, పాటలు పాడుతూ చుట్టుప్రక్కల గ్రామాలలో కూడా ప్రఖ్యాతిపొందేరు. ఇట్లుండగా వారి జీవితంలో ఒక ముఖ్యమైన ఘటన జరిగింది. ఒక దివ్య తేజస్సుగల ఫకీరు ఆ గ్రామానికి వచ్చారు. ఆయనముస్లిం అని భావించి ఎవ్వరూ భిక్ష ఇవ్వకపోవటంతో శ్రీ దేబూజీ ఇంటినుంచి భిక్ష తీసుకొని వెళ్ళి ఆ ఫకీరుకి ఇచ్చారు. మీకు ఎవరు ఏమిఇవ్వలేదని నేను భిక్షతెచ్చాను అన్నారు. అంతట ఆఫకీరు "అయితే నేను ఏమికోరితే అది ఇస్తావా" అన్నారు. "నాదగ్గరలేని డబ్బు తప్ప ఇంకేది అడిగినా ఇస్తాను చివరకు నాప్రాణమైన. నాకు ఈ జీవితం మీద విరక్తి పుట్టింది" అన్నారు దేబూజీ. ఆ ఫకీరు నవ్వి గాడ్గే తలమీద చేయిపెట్టి ఆశీర్వదించారు. అంతటితో దేబూజీ తన 29వ ఏట ఫిబ్రవరి 5, 1904న కుటుంబాన్ని అర్ధరాత్రివేళ విడిచిపెట్టి ఆ ఫకీరు వెంట వెళ్ళిపోయారు.



"నేను ఇవ్వదలచింది ఇచ్చాను కదా! ఇంకా నావెంట ఎందుకు పడుతున్నావని" ఆ ఫకీరు గద్దించిన, అతని వెంట నడిచారు దేబూజీ. ఆ ఫకీరు ఒక స్మశానంలో ప్రవేశించి ఒక సమాధి చెంత గుంటతీసి దానిలో రెండు కుండలనీరుపోసి ఆయన మూడు దోసిళ్ళు త్రాగి దేబూజీని త్రాగమన్నారు. అది త్రాగగానే బాహ్యస్మృతి కోల్పోయారు శ్రీ దేబూజీ. స్పృహ వచ్చిన తరువాత ఆ ఫకీరును వెతుకుతూ చాలాకాలం తిరిగేరు. చివరకు శిరిడీలోని మశీదుకు చేరి, దించిన తెరలు ఎత్తి చూస్తే అక్కడ అంతకుముందు తనను అనుగ్రహించిన ఫకీరు స్నానం చేస్తూ కనిపించారు.. ఆ ఫకీరు అయిన శ్రీసాయిబాబా ఒక ఇటుకను విసరగా, దేబూజీ నుదిటన తగిలి రక్తం కారింది. మరుక్షణమే శ్రీసాయిబాబా చేరబిలచి "ప్రేమతో నిన్ను పూర్ణంగా అనుగ్రహించాను, భగవంతుని అనుగ్రహం నీకెప్పుడూ ఉంటుంది, ఇక నుంచి నిన్ను అందరూ దైవంగా కొలుస్తారు. ఇక నావెంట తిరగవద్దు" అని సంపూర్ణంగా ఆశీర్వదించారు శ్రీ శిరిడీసాయిబాబా. (ఈ విషయం స్వయంగా శ్రీ శిరిడీసాయి ప్రత్యక్ష భక్తుడైన దామోదర్ రాస్నే ఆహ్వానం మీదట అతని ఇంటికి వెళ్ళిన శ్రీ గాడ్గేమహరాజ్ స్వయంగా తన గురుసేవవృత్తాంతము గురించి చెప్పిన విషయాన్ని రాస్నే కుమారుడు అయిన నానాసాహెబ్ రాస్నే పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారితో చెప్పిన విషయం వారిచే విరచితమైన "శ్రీసాయిలీలామృతం గ్రంథ 6,7,8 పేజీలలో చూడవచ్చును.) అప్పటికే ఆయన ఇద్దరు బిడ్డల తండ్రి కావడంతోపాటుగా భార్య గర్భవతిగా ఉంది. అనంతర కాలంలో దేబూజీ సన్యాసాశ్రమాన్ని స్వీకరించి రంగురంగుల పీలికలను కలిపికట్టుకునేవారు. ఆయన భిక్షను స్వీకరించే మట్టిపాత్ర (మరాఠీలో గాడ్గే) తలపై పెట్టుకొని తిరుగుతూ ఉండటంతో ఆయన గాడ్గే బాబాగానూ, గాడ్గే మహరాజ్‌గా పిలవబడుతూ ప్రసిద్ధికెక్కేరు. గ్రామాల్లో సంచరిస్తూ భిక్షను స్వీకరించడమే కాక, తాను స్వయంగా రచించిన కీర్తనలను ఆలపిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక సాంఘిక విషయాల పట్ల చైతన్యం రేకెత్తించేవారు.

గాడ్గే మహరాజ్ ఆధ్యాత్మిక విషయాలను బోధించడంతో పాటుగా సాంఘిక సమస్యల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడం, సేవాకార్యక్రమాలు చేపట్టడం వంటివి చేసేవారు. ఆకలితో వున్నవారికి ఆహారం, దాహంతో అలమటిస్తున్న వారికి నీరు, దుస్తులు లేనివారికి వస్త్రాలు, పేదలకు నాణ్యమైన విద్య, రోగులకు వైద్యం, తలదాచుకునేందుకు నివాసం, జంతువులకు రక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీయువకులకు వివాహం జరగాలని ఆశించి, అందుకోసం జీవితమంతా కృషిచేశారు. భక్తులను ప్రోత్సహించి, వారి విరాళాలతో మహారాష్ట్ర వ్యాప్తంగా 150 పాఠశాలలు, ధర్మశాలలు, శరణాలయాలు, గోశాలలు, ఆస్పత్రులు, విద్యార్థినుల వసతి గృహాలు నిర్మించారు. వందలాది సేవాసంస్థలను, ట్రస్టులను నిర్మించిన బాబా తన కుటుంబసభ్యులను, బంధువులను ఆయా ట్రస్టుల్లోని పదవుల్లో నియమించకుండా, సేవాభిలాష ఉన్న సహచరులనే ఎంపికచేసి నియమించడం విశేషం. జ్యోతిరావ్ ఫులే అనంతరం మహారాష్ట్రలో అత్యంత సామాజిక కార్యకర్తగా పేరుగాంచిన వ్యక్తులలో గాడ్గేబాబా ఒకరు.

గాడ్గేమహరాజ్ ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికిని, చెత్తను చీపురుతో శుభ్రపరిచేవారు. ఆయన పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందేరు. తన భక్తులకు పరిశుభ్రత ద్వారానే భగవత్సేవ చేయమని ప్రబోధం చేసేవారు. కొన్నేళ్లు గడిచాకా గ్రామగ్రామాలలో అపరిశుభ్రతను రూపుమాపి, శుభ్రపరిచేందుకు చీపురు దండును నెలకొల్పారు. బాబా స్థాపించిన చీపురుదండులో కృషిచేసిన వారిలో ఎందరో తదనంతర కాలంలో రచయితలుగా, పత్రికా సంపాదకులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగి ఆయన భావజాలానికి ప్రత్యక్ష, పరోక్ష వ్యాప్తిని కల్పించారు. ఎక్కడ స్వచ్ఛత ఉంటుందో అక్కడ పరమాత్మ ఉంటాడు అనేది గాడ్గే మహరాజ్ ప్రబోధించేవారు.

బాబా తన పర్యటనలలో జంతుబలులను ఖండించేవారు. సంతానం కలిగినపుడు ఇచ్చే జంతుబలులను ఉద్దేశించి ఒక జీవి

పుట్టుక సందర్భంగా ఇంకో జీవిని బలి ఇవ్వడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించేవారు.

చిన్నతనంలోనే తండ్రిని తాగుడు కారణంగా పోగొట్టుకున్న గాడ్గేబాబా పై వ్యసనాలపై వ్యతిరేకత జీవితాంతం కొనసాగించారు. తన కీర్తనల ద్వారా మద్యపానం, ధూమపానం, జూదం వంటి దుర్వ్యసనాలకు వ్యతిరేకంగా చైతన్యాన్ని ప్రజల్లో వ్యాపింపచేశారు. తాగుడు వ్యసనం కుటుంబాల ఆర్థిక స్థితిని, వ్యక్తి ఆరోగ్యస్థితిని, మానసికస్థితిని ఎలా దెబ్బతీస్తుందో మనస్సుకు హత్తుకునేలా వివరించేవారు.

మహారాష్ట్ర సమాజంపైన ఆయన సామాజిక బోధనల ప్రభావం ఉంది. భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు బి. ఆర్. అంబేద్కర్, గాడ్గేబాబా కార్యకలాపాలకు, వ్యక్తిత్వానికి, భావజాలానికి ప్రభావితులై ఆయనను గురువుగా సంబోధించేవారు. మహాత్మాగాంధీ సైతం ఆయన భావాలకు, ఆచరణకు ముగ్ధుడై, గాడ్గేబాబా గాంధీజీ సేవాశ్రమానికి దగ్గరలోని వార్ధాకు విచ్చేసిన సమయంలో వారిని తన ఆశ్రమానికి ఆహ్వానించి కలిశారు. గాంధీజీని కలిసినప్పుడు వారిద్దరూ సమాజంలోని అవిద్యను, అంటరానితనాన్ని, దుర్వ్యసనాలను రూపుమాపడం వంటి విషయాలపై చర్చించారు. ఆయన సంఘంలోని సంస్కరణల కోసం కృషిచేసిన పలువురు సాధువుల నుంచి స్ఫూర్తి పొందేరు. చొక్కమేళ అనే దళిత సాధువును అభిమానించే గాడ్గేబాబా ఆయన పేరుమీదుగానే తాను దళితుల కొరకు నిర్మింపజేసిన ధర్మశాలలకు ఆయన పేరుపెట్టారు.

శ్రీ శిరిడీసాయిబాబాచే ఆశీర్వదించబడి మరియు శ్రీసాయిబాబా సలహా, సూచన మేరకు సంఘసంస్కర్త అయిన శ్రీ గాడ్గేమహరాజ్. శ్రీసాయిబాబాను భక్తితో పూజించడమే కాకుండా తన ఉపన్యాసాలలో కబీర్ దోహాస్‌ను, శ్రీ సాయిబాబా 'నామ స్మరణ'ను ప్రచారం చేశారు. అదేవిధంగా, గాడ్గే మహరాజ్ తన ఉపన్యాసాలను "కీర్తనలు" రూపంలో నిర్వహించారు. అందులో అతను మానవత్వానికి సేవ మరియు కరుణ వంటి విలువలను నొక్కి చెప్పారు. అతని కీర్తనల సమయంలో, అతను గుడ్డి విశ్వాసాలు మరియు మూఢాచారాలకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

శ్రీ గాడ్గేమహరాజ్ శ్రీశిరిడీసాయిబాబా మరియు మెహర్‌బాబాలను చాలాసార్లు కలిశారు. లోకపూజ్యులైన శ్రీ గాడ్గేమహరాజ్ 1927 ప్రాంతంలో తమ వేలాది భక్తులతో కలసి సంకీర్తన చేస్తూ శిరిడీచేరి, భక్తులతో కలసి శిరిడీ వీధులు శుభ్రంచేసి, సమాధి మందిరానికి ఉత్తరాన సంకీర్తన జరుపుతూ "ఇక నేను మావూరు వెళ్ళిపోతున్నాను" అని చెప్పేవారు. అక్కడి భక్తులతో "ఇదే మన చివరి కలయిక" అని చెప్పేరు.

శ్రీ గాడ్గేమహరాజ్ మెహర్‌బాబాను పండర్‌పూర్‌కు ఆహ్వానించారు 6 నవంబర్ 1954న వేలాది మంది ప్రజలు మహరాజ్ మరియు మెహర్‌బాబాల దర్శనం చేసుకున్నారు. శ్రీ గాడ్గేమహరాజ్ 1956 డిసెంబర్ 20న అమరావతికి వెళుతుండగా వాల్గావ్ సమీపంలోని పెధి నది ఒడ్డున మహాసమాధి పొందేరు. 1999లో భారతప్రభుత్వం శ్రీ గాడ్గేమహరాజ్ గౌరవార్థం తపాలబిళ్ళ విడుదల చేసింది. ఆయన గౌరవార్థం మహారాష్ట్ర ప్రభుత్వం 2000-01లో సంత్ గాడ్గేబాబా గ్రామ స్వచ్ఛత అభియాన్ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ కార్యక్రమం స్వచ్ఛ గ్రామాలను నిర్వహించే గ్రామస్తులకు బహుమతులు అందజేస్తుంది. అంతేకాకుండా, భారత ప్రభుత్వం అతని గౌరవార్థం పారిశుద్ధ్యం మరియు నీటికి జాతీయ అవార్డును ఏర్పాటు చేసింది. ఆయన గౌరవార్థం అమరావతిలోని యూనివర్సిటీకి వారి పేరు పెట్టారు. డిసెంబరు 20వ తేదీ శ్రీ శిరిడీసాయిబాబా సమకాలనీకులైన శ్రీ గాడ్గే(బాబా) మహరాజ్ ఆరాధనోత్సవం సందర్భముగా సమర్పణ.)

సౌజన్యం : అంతర్జాలము

సేకరణ : **"సత్యేంద్ర"**

# దీపావళి


బాధలు, రోగాలు, కష్టాలు, నష్టాలు అనే కడలిలో దారితెన్ను తెలీయక కొట్టుమిట్టాడే వారికి వెలుగు దారి చూపే అఖండ జ్యోతి శ్రీసాయినాధుడు, దుఃఖమనే చీకటిలో మగ్గిపోతున్న వారిపాలిటి కాంతిరేఖ శ్రీ శిరిడీసాయి. అజ్ఞానమనే చీకటిలో కొట్టుమిట్టాడే వారి పాలిట అఖండ వెలుగు ద్వారకామాయి వాసుడు శ్రీ సాయినాధుడు.

శ్రీసాయి పాదాలను ఆశ్రయించి, కోరికలు, కష్టాలు తీర్చుకొని అందుకు కృతజ్ఞతగా సాయిని హృదయంలో నిలుపుకొని ఆరాధించటము నిజమైన దీపారాధన. బాహ్యముగా వెలిగించే దీపపు వెలుగులో చుట్టూ ఉన్న ప్రదేశాన్ని శుభ్రమూ, కాంతివంతము చేసినట్లే, అంతరంగికముగా వెలిగే సాయి జ్యోతిలో హృదయమాలిన్యాన్ని తొలిగించుకొని భావశుద్ధి చేసుకోవటమే నిజమైన సద్గురువు ఆరాధన. ఇంట్లో మనము వెలిగించే దీపము మనకు వెలుగు, బయట వెలిగించే దీపము దారి తెన్ను తెలీయని బాట సారులకు వెలుగు. అంతరంగికముగా వెలిగిన సద్గురువు జ్యోతి మన జీవితానికి వెలుగు. అంతరంగిక అనుభూతులను, సద్గురు కృపా వెలుగును అందరికీ పంచటము నిజమైన సద్గురువు సేవ.

ఇట్లా ప్రతి ఒక్కరూ ఇంటా, బయట జ్యోతులను వెలిగిస్తే, ప్రపంచమంతా వెలుగే. ఇంక అజ్ఞానాంధ కారమనే చీకటికి తావెక్కడ? ఆ పని ఒక రోజో, ఒక నెలో, ఒక సంవత్సరమో కాదు నిరంతరము కొనసాగాలి. అది తెలియజేయటానికి సాయినాధుడు మశీదులో నిరంతరం జ్యోతులు వెలిగించారు. మన హృదయమనే ప్రమిదను శుభ్రంచేసి, సిద్ధంచేసి, అందులో భక్తి శ్రద్ధలనే వత్తులు వేసి, అహంకారమనే నూనెపోసి సద్గురుజ్యోతితో వెలిగిస్తే, హృదయ కుహరములోని అజ్ఞానమనే చీకటి పారద్రోలబడి జ్ఞానమనే వెలుగుతో నిండిపోతుంది. అట్లా శ్రీసాయి వెలిగించిన జ్యోతిలో మార్గము సరిచూసుకుంటూ ఇతరులకు కూడ సద్గురు జ్యోతిని దర్శింపజేసే ప్రయత్నము చేయటమే నిజమైన దీపావళి. అట్లాంటి దీపావళి మనమందరమూ జరుపుకోవాలని, అందుకు శ్రీసాయి కృప తోడవ్వాలని కోరుకుంటూ

(నవంబరు 12వ తేదీ దీపావళి సందర్భముగా అందరికీ శుభాకాంక్షలు.)

రచన : **పూర్ణచంద్రరావు**




**చిన్నచూపు :** ఒకసారి విష్ణుమూర్తి తలపై ఉన్న కిరీటం, విష్ణుమూర్తి ధరించిన పాదరక్షలను చూస్తూ హేళనగా నవ్వుతూ, నువ్వు ఎప్పుడు క్రిందే ఉంటావు, నిన్ను గుమ్మం వద్ద వదిలేస్తారు. నన్ను చూడు, నేనెప్పుడు పైనే ఉంటాను అని పాదరక్షలను కించపరిచింది. యోగనిద్రలో ఉన్న శ్రీహరి ఇదంతా విని పాదరక్షలతో "పాదుకలారా చింతించకండి, రామావతారంలో మిమ్మల్ని సింహాసనంపై కూర్చోబెట్టి 14 ఏళ్లు రాజ్యపాలన చేయిస్తాను. కిరీటం గర్వాన్ని అణచివేస్తాను" అని అన్నాడు. అలా రామావతారంలో శ్రీరాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు, భరతుడు శ్రీరామ పాదుకలు తెచ్చి సింహాసనంపై ఉంచాడు. భరతుడు ఆ పాదుకలకు నమస్కరించినప్పుడల్లా భరతుని తలపై ఉన్న కిరీటం సిగ్గుతో తలదించుకునేది. ఎవరినీ చిన్నచూపు చూడకూడదు కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.

**సప్త చిరంజీవులు** : చిరంజీవులు అంటే చావులేకుండా ఎప్పటికీ జీవించి ఉండేవారు అని అర్థం. పురాణాల ప్రకారం ఏడుగురు చిరంజీవులు ఉన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ ఆజ్ఞ వలన అశ్వత్థాముడు, వామనుని అనుగ్రహము వలన బలిచక్రవర్తి, లోకహితము కొరకు వ్యాసుడు, శ్రీరాముని యొక్క భక్తితో హనుమంతుడు, రాముని అనుగ్రహము వలన విభీషణుడు, విచిత్రమైన జన్మము కలగడం వలన కృపుడు, ఉత్కృష్టమైన తపోశక్తి కలగడం చేత పరశురాముడు సప్త చిరంజీవులు అయ్యారు. ఈ ఏడుగురితోపాటుగా, శివానుగ్రహముచే మృత్యుంజయుడైన మార్కండేయుడిని ప్రతినిత్యం స్మరించుకొన్నచో సర్వ వ్యాధుల నుండి ఉపశమనం పొంది శతాయుష్మంతులు అవుతారని శాస్త్రవాక్యం.

**సమాజ ఋణం :** స్థానిక భక్తులకూ, సహృదయులకూ సత్సంగమును పరిచయం చేసి, వారిని సభ్యులుగ చేర్చిన, ధర్మప్రచార యజ్ఞానికి సహకరించినట్లవుతుంది. ప్రథమంగా, స్థానికంగా చుట్టుప్రక్కలున్న కళాశాలల, పాఠశాలల గ్రంథాలయాలలో మన సాహిత్యం 2,3 ప్రతులు చొప్పున వుండడం మంచిది. అన్ని సిద్ధాంతాల వారూ అలానే చేస్తున్నారు.

వారానికో రోజు సత్సంగం చేయడం మంచిది. అందుకై, అందరికీ వసతిగా వుండే రోజు, సమయం వారికి తెల్పి, వసతిగల మిత్రులింట్లోనో , స్థానిక మందిరంలోనో – మొదట అష్టోత్తరం చేసి, తర్వాత 40 ని॥లు 'శ్రీసాయిలీలామృతము' శ్రవణం చేయించి, తర్వాత భజనగానీ, పూజగానీ చేసి, 10 ని॥లు ప్రశాంతంగా నామస్మరణ చేసుకొని, ప్రసాదం పంచుతాము. ఇదీ సత్సంగం. కొన్ని వారాల్లో ఆ కథవలన ఆకర్షించబడి ఎందరో చేరుతారు. ఈ విధంగా మనము సమాజానికి మన ఋణం తీర్చుకున్న వారం అవుతాము. –పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ఆలోచించు :** ఈ ప్రపంచంలో ఎన్ని రకాల వ్యక్తిత్వాలు ఉన్నాయో అన్ని రకాల వ్యక్తిత్వాలు ప్రతి మనిషిలోనూ ఉంటాయి. అయితే మనలో ఏ రకమైన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుంటామో ఆ రకమైన వ్యక్తిగా కనిపిస్తాము. ఎదుట వ్యక్తిలో మనము ఏ రకమైన వ్యక్తిత్వాన్ని చూస్తామో వాళ్ళు అలానే కనిపిస్తారు. అంటే మనము ఒక అహంకార పూరితుడిగా చూస్తే వాళ్ళు అలానే కనిపిస్తారు. వాళ్ళు మనమీద అహంకారముతో ప్రవర్తిస్తున్నారు అంటే మన అహంకారంతో వాళ్ళని ప్రేరేపిస్తున్నామని అర్థం. మనము వినయముతో, ప్రేమతో ఉంటే వాళ్ళు మనతో ప్రేమతో వినయముతోనే ఉంటారు. అంటే భర్త కానీ, భార్య కానీ మనతో ఎలా ప్రవర్తిస్తున్నారు అనేది పూర్తిగా మన మీదే ఆధాపడి ఉంది. మనము ప్రేమతో వాళ్ళలో ఉన్న ప్రేమతో కూడిన వ్యక్తిత్వాన్ని మనము సృజించినప్పుడు మనకు ప్రేమే దక్కుతుంది. మనము వాళ్ళలో ఉన్న అహంకారమును ప్రేరేపిస్తే వాళ్ళు అలానే ప్రవర్తిస్తారు. కావున అంతా మన చేతిలోనే ఉంది. మనము మారితే వాళ్ళు మారిపోతారు. ఆలకించు, ఆలోచించు, ఆచరించు.

## బొప్పాయిపండు ఆరోగ్య లక్షణాలు

బొప్పాయి వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. విటమిన్ ఎ, సి, ఇ లు కలిగివుండే బొప్పాయిని తీసుకోవడం ద్వారా స్థూలకాయాన్ని తగ్గించవచ్చని ఆహార నిపుణులు అంటున్నారు.

శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించాలంటే రోజూ పరగడుపున ఒక కప్పు బొప్పాయిని తీసుకోవడం మంచిది.

బొప్పాయిలో పీచు పదార్థాలెక్కువ జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. శరీరానికి ఎనర్జీనిస్తుంది.

చర్మ వ్యాధులను నయం చేస్తుంది. చర్మ సంరక్షణకు ఎంతో మేలు చేస్తుంది. చర్మం ప్రకాశవంతమవుతుంది.

కంటికి మేలు చేస్తుంది. దృష్టిలోపాలను నయం చేయడంలో బొప్పాయి దివ్యౌషధంగా పనిచేస్తుంది.

**అష్టదిక్పాలకులు :** ఇంద్రుడు (తూర్పు), అగ్ని (ఆగ్నేయం), యముడు (దక్షిణం), నిరృతి (నైఋతి), వరుణుడు (పశ్చిమం), వాయువు (వాయువ్యం), కుబేరుడు (ఉత్తరం), ఈశానుడు (ఈశాన్యం) మొదలైన ఎనిమిది దిక్కులను పాలించేవారే అష్టదిక్పాలకులు.

# మహాలయ పక్షము

మహాభారతంలో కర్ణుడు మరణించిన తర్వాత తిరిగి భూలోకానికి వచ్చి భూలోకంలో అన్నదానం చేస్తూ గడిపి తిరిగి స్వర్గానికి వెళ్ళిన ఈ పదిహేను రోజులకే మహాలయ పక్షమని పేరు. ప్రతీ సంవత్సరంలో వచ్చే భాద్రపద మాసంలోని, శుక్లపక్షంలోని 15 రోజులు దేవపదము. కృష్ణపక్షంలోని 15 రోజులు పితృపదము. ఇదే మహాలయ పక్షము.

పితృదేవతలకు, అమావాస్య తిథి మిట్టమధ్యాహ్న మవుతుందని శాస్త్ర వచనం. అందుకే భాద్రపద అమావాస్య రోజున, దీపావళి అమావాస్య రోజున పితృదేవతలు పుత్రులిచ్చే తర్పణములకు ఎదురు చూస్తూ ఉంటారని ధర్మగ్రంథాలు తెలుపుతున్నాయి.

జననీ జనకులకు ప్రేమానుగారాలను అందించి, మరణానంతరం కూడా వారికోసం యథావిధిగా నైమిత్తిక కర్మల నాచరించి పితృ తర్పణాదులనిస్తే వారి ఋణం తీర్చుకున్న వాళ్లవుతారని పితరుల ఆశీస్సులతో వంశాభివృద్ధి జరుగుతుందని చెప్తోంది మహాలయ అమావాస్య. తండ్రి జీవించి తల్లిని కోల్పోయినవారైతే ఈ పక్షంలో వచ్చే నవమినాడు తర్పణ, శ్రాద్ధ విధులను ఆచరించాలి. తల్లీ, తండ్రీ ఇద్దరూ లేనివారు ఈ పక్షాన తప్పక పితృకర్మలు, పేదలకు అన్నదానములు చేయాలని శాస్త్రం తెలుపుతుంది. ఈ పక్షమంతా చేయలేనివారు ఒక్క మహాలయ అమావాస్య నాడైనా చేయాలని చెబుతారు.

బహుళ పాడ్యమి తిథి నుండి అమావాస్య వరకు మహాలయ పక్షము. ఈ సమయంలో ఎటువంటి శుభకార్యాలు చేయరాదని చెబుతారు. ఈ 15 రోజులు ప్రతి రోజు పితృ దేవతలకు తర్పణం శ్రాద్ధ విధులను, పేదలకు అన్నదానములు నిర్వహించాలి. అలా కుదరని పక్షమున పితృ దేవతలు ఏ తిథిలో మరణిస్తే ఆ తిథి రోజు ఈ పక్షం 15 రోజులలో నిర్వహించాలి. ఈ పక్షములో పితరులు అన్నాన్ని, ప్రతి రోజూ జలమును కోరుతారు. తండ్రి చనిపోయిన రోజున మహాలయ పక్షములలో పితృ తర్పణములు, పేదలకు అన్నదానములు, యధావిధిగా శ్రాద్ధ విధులు నిర్వర్తిస్తే పితృదేవతలంతా సంవత్సరమంతా తృప్తి చెందుతారని శాస్త్ర వచనం. తమ వంశాభివృద్ధిని గావిస్తారు. వారు ఉత్తమ గతిని పొందుతారు. ఈ విషయాలన్నీ నిర్ణయ సింధువు, ధర్మసింధూ, నిర్ణయ దీపికా గ్రంథములలో పేర్కొనబడ్డాయి.

(సెప్టెంబరు 30వ తేదీ శనివారము నుండి అక్టోబరు 14వ తేదీ శనివారము వరకు మహలయ పక్షాలు సందర్భముగా సమర్పణ.)

సేకరణ : **"విరించి"**

# "శ్రీ దత్తమూర్తి"

శ్రీదత్తాత్రేయుల వారికి మూడు తలలు ఉన్నట్లు వర్ణించారు ఋషులు. అకార, ఉకార, మకారాలకు ఆ మూడు శిరస్సులు సంకేతాలు. అందువలన దత్తాత్రేయుల వారు పరబ్రహ్మము, ప్రణవ స్వరూపం. అందుకని ఆయన మూడు శిరస్సులూ త్రిమూర్తులకు, వారి కార్యాలయిన సృష్టి, స్థితి, లయలకు, నాద, బిందు, కళలకు త్రయీ విద్య యనబడు వేదాలకు, మూడు పాదములుగల గాయిత్రికి, మూడు యజ్ఞాగ్నులైన గార్హపత్య, ఆవాహనీయ, దక్షిణాగ్నులకు చిహ్నాలు. సద్భక్తుల అంతఃకరణ చతుష్టయమే ఆయన చెంతనున్న నాలుగు కుక్కలు. స్వతహాగా చాపల్యం గల్గిన హీన జంతువులైనప్పటికి, శిక్షణ యిచ్చిన వాణ్ణి నమ్మికతో సేవించి, దుర్గుణాలనే చోరులనుండి రక్షించేవి. హృదయంలో ఆ సద్గురుమూర్తిని నిలుపుకున్నవారిని నమ్మికతో సేవించేవి.



ఆయన చెంతనున్న ఆవు కామధేనువు. ఆవు సాత్వికమైన నాలుగు పురుషార్థాలను గ్రహించగల మనస్సుకు సంకేతం. అంతఃకరణ చతుష్టయాన్ని గురుధ్యానంతో ధరించిన మనస్సే కామధేనువు. కామమంటే పురుషార్థం. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్నట్లు ముముక్షువులు గానివారికి ధర్మార్థ కామాలను ప్రసాదిస్తూ, సద్గురు భక్తులకు అంతర్ముఖమైన మోక్షాన్ని ప్రసాదించేది మనస్సు. అందుకని అది కామధేనువు.

శ్రీదత్తమూర్తి సామాన్యంగా మూడు తలలు, ఆరు బాహువులు కలిగియున్నట్లు వర్ణించడము మనకు తెలిసిందే. కుడి చేతిలో 'రుద్రాక్షమాల' మంత్ర శాస్త్రానికి సంకేతం. ఢమరుకం, శబ్దరాశి అయిన శృత్యాది శాస్త్రాధ్యయానికి చిహ్నం. ఆ పై కుడిచేతిలోని చక్రం కర్మ బంధచ్ఛేదకమయిన సత్వర మోక్షప్రదమైన జ్ఞానానికి సంకేతం. అది అహంకార విధ్వంది. స్వప్రభావ ప్రకాశప్రదము. ఎడమచేతిలోని కలశంలోని జలం, కర్మకు సంకేతం. దాని నుండే జీవులకు అన్నపానీయాలు లభిస్తాయి. మరొక ఎడమ చేతిలోని త్రిశూలం, ఆచార, వ్యవహారిక కర్మకాండకు చిహ్నం. ప్రవృత్తి మార్గావలంబులకు ధర్మార్థ కామప్రదము. మరొక చేతిలోని శంఖువు దాని పూరణ బద్ధజీవులకు సంసార చక్ర ప్రవర్తకము సృష్టి కారణమైన శబ్ద బ్రహ్మ.


శ్రీ దత్తమూర్తి యొక్క ఎడవ భాగంలోని దేహము భగవంతుడు. కుడి భాగం ముక్తి ప్రదాత అయిన సద్గురువు.

(డిసెంబరు 26వ తేదీ దత్తజయంతి సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష**, విజయవాడ

# గురుస్మరణ - సాధనమార్గము

"బహుజనం పలు విధం" అన్నట్లుగా, ఒక్కొక్క భక్తుడు ఒక్కొక్క దేవతను ఆరాధిస్తుంటారు. అయితే ఒక్కొక్క దేవతకు ఒక్కొక్కరోజు ప్రాముఖ్యమున్నట్లు అనుకుంటారు. ఉదాహరణకు సాయిబాబాలాంటి గురువులను ఆరాధించడానికి గురువారం విశేషమని, ఆంజనేయస్వామివారికి మంగళవారమని, అమ్మవారికి శుక్రవారమని, శివారాధనకు సోమవారం అని మనము అనుకుంటాము. మిగతా రోజులలో ఆయా దేవతలను పూజిస్తే ఫలితముండదా? వారికి తమ భక్తులననుగ్రహించే శక్తి లేదనుకోవాలా? లేక దీనిని మానసికంగా కలిగిన బలమైన భావన (సెంటిమెంటు) అని చెప్పవచ్చా?



ఒక భక్తుడు, తనకు సోమవారం సెలవు దినం కావడంతో ఆదివారం రాత్రి బయలుదేరి, సోమవారం శ్రీశైలంలోని సున్నిపెంట వద్దనున్న శ్రీ పూర్ణానందస్వామి వారి వద్ద గడిపి, ఆ రోజు రాత్రి మళ్ళీ అక్కడినుండి బయలుదేరి మంగళవారం రోజున ఆఫీసుకు వెళ్ళేవారు. అతను బాబా చరిత్ర చదివి, అందులో వివరింపబడిన గురువారం ప్రాముఖ్యతను గుర్తించి, ఒకసారి స్వామివారి దర్శనార్థం గురువారం ఆశ్రమానికి వెళ్ళగా, సర్వాంతర్యామియైన స్వామివారు తామేమీ ఎరగనట్లు ఆ భక్తునితో "ఈరోజు ఏమిటి సోమవారమా? అని అడుగగా అతను "కాదు స్వామీజీ ఈరోజు గురువారం. బాబా పుస్తకంలో గురువారం ప్రాముఖ్యత గురించి చదివి, గురువైన మీ దర్శనం చేసుకుందామని వచ్చాను" అని అన్నారు. అప్పుడు స్వామివారు, "సరే యిప్పుడు ఏదైనా ప్రత్యేకత కనిపించిందా?" అని అడుగగా అతను "ఏమీ లేదు ఎప్పటిలాగే వుంది స్వామీజీ" అని అన్నారు. అప్పుడు స్వామివారు నవ్వుతూ "మరింకేమిటీ? గురువారం నాడు నా దగ్గర ఎక్కువ శక్తి వుంటుందా? మిగిలిన రోజుల్లో వుండదా? గురువు నిరంతరం తనకృప ప్రసరింపచేస్తూనే ఉంటాడు. వారాలు, ముహూర్తాలు పెట్టుకొనేది మనమే" అని అన్నారు శ్రీ పూర్ణానందస్వామివారు.

గురుస్మరణను మించిన గొప్ప తపస్సు లేదని గురుగీత ఘోషిస్తోంది. గురుమహరాజులైన స్వామివారు కూడ దీనిని ధృవపరుస్తున్నారు. ఒకరోజు కొంతసేపు ఏకాంతంగా శ్రీ పూర్ణానంద స్వామివారితో గడపడానికి అదృష్టం కలిగిన ఒక భక్తుడు, స్వామీజీ ఆకాశంలోకి చూస్తూ మౌనంగా వుండడం గమనించి, వారిని ఏదైన బోధించమని మళ్ళీ మళ్ళీ అడుగగా వారు " ఒకసారి ఎవరో శిరిడీ బాబాను మీరెప్పుడు ఏమి చేస్తుంటారని అడిగారట. అప్పుడు బాబాగారు "నేను నా గురువును తలచుకుంటూ ధ్యానం చేస్తుంటాను" అని అన్నారట. బాబాగారే తమ గురువును తలచుకొంటూ ధ్యానిస్తుంటే నీకు వేరే చెప్పాలా ఏం చెయ్యాలో?" అని గురుస్మరణ గొప్పతనాన్ని పరోక్షంగా బోధించారు స్వామీజీ.

ఒకసారి ఒక సాధకుని శిష్యులు కొందరు వచ్చి గురు శిష్య బంధం గురించి స్వామివారితో అడుగగా వారు "ఇష్ట దేవత పూర్ణ అనుగ్రహం లభించిన వెంటనే గురువు లభిస్తారు. ఇక అతని బరువు బాధ్యతలన్నియూ ఆ గురువే చూస్తారు" అని అనగా, వాళ్ళు "అయితే అప్పుడు వారి సాధన ఎలా వుంటుంది. ఏ సాధన చెయ్యాలి?" అని అడిగారు. అందుకు స్వామి "నిజం చెప్పాలంటే ఏమీ చేయనక్కరలేదు" అని చెప్పగా, అది అర్థం కాక వాళ్ళు ''నిజంగానా స్వామీజీ! శిష్యుడు ఏమీ చేయనక్కరలేదా?" అని ఆశ్చర్యంతో అడిగారు. స్వామివారప్పుడు "కానీ శిష్యుడు తప్పకుండా చేయవలసిన సాధన ఒకటుంది. అది గురువును ఎప్పుడూ మరచిపోకుండా జ్ఞాపకం వుండేలా అనుగ్రహించమని గురువునే వేడుకోవాలి. అదే అతని సాధన. చాలా మంది అంటారు. నేను స్వామీజీని మరచిపోవడమేమిటి? నేనెప్పుడూ స్వామీజీని తలచుకుంటూ వుంటానని. అప్పుడు స్వామీజీ ఏమంటారో తెలుసా? ఐ సీ అంటారు. దాని భావమేమిటో తెలుసా? ఆహా! అలాగా? అంత సమర్థుడివా! అని. స్వామీజీని మరచిపోక పోవడం, గుర్తుంచుకోవడమనేది ఒక అసాధారణ సాధన" అని ఎంతో భావయుక్తంగా గురుస్మరణ గొప్పతనాన్ని గురించి బోధించారు శ్రీస్వామివారు.

శ్రీస్వామివారు ఒకసారి "అసలు ఆశ్రమమంటే ఏమిటో తెలుసా? ఈ శరీరమే ఒక ఆశ్రమం. అందులో జీవుడు సదా తపస్సు చేసుకుంటూ వుంటాడు అంతే" అని ఒకరికి బోధించారు.

కాలమాన పరిస్థితులను బట్టి వివిధ రకాల పూజలు జపాలు చేస్తున్న వారెందరో "యింత చేసినా, నేనాశించిన ఫలితం ఎందుకు పొందలేక పోతున్నాను?" అని వాపోవడం మనం వింటూ ఉంటాము. అసలు యిందుకు కారణమేమిటని మనం నిష్పక్షపాతంగా ఆలోచిస్తే, ఆ సమయంలో మన భావం ఎలా వుండేదని పరిశీలిస్తే, అందుకు కారకులము మనమేనని రుజువవుతుంది! అంటే, మనలోని భావలోపం యిందుకు కారణమన్నమాట. ఈ విషయమై ఒకసారి ఒక భక్తుడు "స్వామీజీ! పూజ ఫలితం మేము ఎందుకు పొందలేక పోతున్నాము?" అని అడుగగా వారు "భావలోపంతో గంటల తరబడి చేసే పూజకంటే, భావయుక్తంగా నిమిషాలలో చేసే పూజల నుండి సత్ఫలితాలు పొందగలరు" అని అంటూ "యిందుకు గురుత్వం కూడ ఎంతో అవసరం" అని కూడ బోధించారు. (నవంబరు 1వ తేదీ బుధవారం మహద్గురు శ్రీ పూర్ణానందస్వామివారి జయంతి (తేదీప్రకారం) సందర్భముగా సమర్పణ.)

రచన : **శ్రీ సాయిదాస్‌స్వామి,** హైదరాబాదు

# శ్రీ ధునీవాలాదాదా

పూర్ణదత్తావతారులు, అవధూతలు ఎక్కడవారు సంకల్పిస్తే అక్కడ స్వప్నములోకాని, భౌతికంగా కాని దర్శనమివ్వగలరు. ఒకేసారి వివిధ ప్రదేశములలో దర్శనమివ్వగలరు. భోపాల్‌కి చెందిన గంగాప్రసాద్ వ్యాస్ గారు జీవితము మీద విరక్తిచెంది కాశీవెళ్ళి అక్కడ సాధన చేస్తున్నారు. ఒకరోజు స్వప్నములో వీరికి దాదాగారు దర్శనమిచ్చి "మేమిప్పుడు సాయిఖేడాలో ఉన్నాము. కాశీలో కాలమెందుకు వృథాచేసుకుంటావు" అని ఆదేశమిచ్చారు. గంగాప్రసాద్‌వ్యాస్‌గారు సాయిఖేడావచ్చి దాదాగారిని దర్శించి కాశీలో స్వప్నదర్శనమిచ్చినది దాదాగారని నిర్ధారించుకుని వారి సన్నిధిలో సాధన చేసుకుని ఉత్తమమైన సన్యాసిజీవితం గడిపి ఆయనలో ఐక్యమయ్యారు.



ఆనందరావు మరియు అతని స్నేహితులు దాదాగారిని దర్శించారు. వాళ్ళు దాదాగారు ఎన్ని రోజులైనా కాలకృత్యములు తీర్చుకోవడంగాని, స్నానం చేయుటగాని వీరు చూడలేదు. అయినప్పటికీ దాదాగారి శరీరం నుండి సుగంధపరిమళాలు వస్తూవుండేవి. వారు వంతులు ప్రకారం దాదాగారు ఎప్పుడేమిచేస్తుంటారో గమనించేవారు. దాదాగారు మాత్రం తన స్థానమునుండి ఎచ్చటకు బయటకు వెళ్ళుటలేదు. ఒకరోజు ఉదయం దూదీనదీతీరం నుండి భక్తులు వచ్చారు. వారు ఉదయం దాదాగారు దూదీనదిలో స్నానం చేస్తుండగా చూచామని చెప్పారు. కాని దాదాగారు ఆసమయంలో ఆశ్రమంలోనే ఉండటము ఆనందరావు మొదలైన భక్తులు చూశారు.

ఖాంజుడే అనే భక్తుడు దాదాగారి దర్శనార్థం సాయిఖేడా వెళ్ళాలని రైల్వేస్టేషన్‌కి వెళ్ళాడు. అప్పుడే రైలు దిగిన కొందరు భక్తులు దాదాగారు సాయిఖేడాలో లేరని వారిని హోషంగాబాద్‌లో దర్శించుకొని వస్తున్నామని చెప్పారు. దాదాగారి నిజతత్త్వం తెలిసిన ఖాంజుడేగారు వారు సర్వవ్యాపియని, భక్తుల శ్రద్ధననుసరించి వారు కోరినచోట దర్శనమీయగలరని చెప్పి తాను సాయిఖేడాకు వెళ్ళాడు. దీనార్తుల బాధలు తీరుస్తూ దాదాగారు సాయిఖేడాలోనే దర్శనమిచ్చారు.

ఒకసారి బొంబాయి నుండి ఒక శేఠ్ 1500 రూ. విలువైన శాలువాను తీసుకొచ్చి దాదాగారికి కప్పేడు. వెంటనే దాదాగారు ఆ శాలువాను తీసి ధునిలో పడవేసి బూడిదచేశారు. అది చూసి ఆ శేఠ్ చాలా బాధపడి దాదాగారిని నిష్ఠూరంగా మాట్లాడాడు. వెంటనే దాదాగారు మండుతున్న అగ్ని గుండములో చెయ్యిపెట్టి యధాతథంగా ఆ శాలువాను తీసి ఆశేఠ్‌కిచ్చి "భక్తిశ్రద్ధలతో సమర్పించిన రెండు పైసల వస్తువైనను మాకు అమూల్యమైనదే, భక్తిలేక సమర్పించిన వస్తువు ఎంత విలువ కలదైనా మాకక్కరలేదు" అని దాదాగారు బోధించారు. ఒక పేద భక్తురాలు తన కుమార్తె వివాహానికి బంధువు లెవరూ ధన సహాయం చేయలేదని దాదాగారే తనకు శరణ్యమని మొరపెట్టుకుంది. దాదాగారు "దయామయిఅయిన నర్మదామాత నీకు ధనసహాయం చెయ్యగలదు. నీవామెవద్దకు వెళ్ళు" అని ఆదేశించారు. ఆ మాటయందు విశ్వాసముంచి ఆమె నర్మదానది ఒడ్డుకెళ్ళింది. ఆ నది నీటి నుండి ఒక దివ్య స్త్రీమూర్తి హస్తమొకటి పైకి వచ్చి రూ. 500/-ల నోట్లకట్టను ప్రసాదించింది. ఆనందంతో ఆ పేదరాలు తన కుమార్తె వివాహం వైభవంగా జరుపుకున్నది.

1930 నవంబరు నెలలో ఖాండ్వాకు (మధ్యప్రదేశ్) దాదాగారు భక్తులవిన్నపముపై వచ్చారు. నవంబరు 23వ తేదీ శ్రీ దాదాగారు ఒక అతీంద్రియస్థితికి వెళ్ళిపోవడంతో, ఇంక కొద్దిరోజులలో భౌతిక శరీరము విడిచి పెడతారని భక్తులు గ్రహించారు. వారి అంతిమ దర్శనంకోసం భక్తజనం మహాసముద్రంలా తరలివచ్చారు. హరిహర భగవాన్‌గారు (చిన్నదాదాగారు), గంగాధర బ్రహ్మచారి, మురళీధర్ సోదరుడు, గిరిజానంద్ గుప్తాగారు మొదలగు సన్నిహిత భక్తులు రాత్రింబవళ్ళు కూడా కనిపెట్టుకుని ఉన్నారు. 1930 డిసెంబరు 3వ తేదీన అశేషభక్తజనం శోకసముద్రంలో మునిగి ఉండగా శ్రీ ధునీవాలా దాదాగారు సమాధి అయినారు. దాదాగారు తాము ఎక్కడ ఉంటే అక్కడ నిరంతరం ధుని వెలిగించి ఉంచటముతో వారిని శ్రీధునీవాలాదాదా అని భక్తులు కొలిచేవారు.

పూర్ణులైన మహనీయులు అందులో దత్తావతారములుగా ప్రసిద్ధి చెందిన వారి యోగలీల సమాధి అనంతరం కూడా కొనసాగుతుంటుంది. శిరిడీ సాయిబాబా, మనాకీవాలా అనేభక్తునికి స్వప్నములో దర్శనమిచ్చి "నేను ముస్లింనికాను, విశ్వగురుడైన దత్తాత్రేయుని అవతారాన్ని, అక్కల్‌కోటలోని స్వామి సమర్థులు, ఖాండ్వాలోని ధునీవాలాదాదా, షేగాంలోని గజానన్ మహరాజ్, నాగపూర్‌లోని తాజుద్దీన్ బాబా, శిరిడీలోను - దైవ కార్యం నిర్వహిస్తున్నాము" అని తెలియజేశారు. అందుకనే శ్రీధునీవాలా దాదా మహరాజ్‌గారు సమాధి అనంతరం కూడా స్మరించినంతనే వారి అభీష్టములను నెరవేరుస్తూ దత్తావతార కార్యం కొనసాగిస్తున్నారు.

(డిసెంబరు 3వ తేదీ ఆదివారము (తేదీప్రకారం) శ్రీ ధునీవాలా దాదాగారి ఆరాధనోత్సవ సందర్భంగా ప్రత్యేక వ్యాసం.)

సౌజన్యం : *శ్రీ దాదాగారి జీవిత చరిత్ర*

సేకరణ : **'సుప్రియ'**

# రామ భక్త శ్రీ రంగన్న బాబు

శ్రీ రంగన్నబాబు గారి జీవితం చాలా విశిష్ఠమైనది. అతి సాధారణ వైశ్య కుటుంబానికి చెందినవారు. మిధునకుల గోత్రీకులు. ఇంటి పేరు బూర్లెవారు. తండ్రి పుల్లయ్యగారు, తల్లి జాలమ్మ గారు. వీరు 1895 సం॥లో జన్మించినారు. రంగన్నబాబుగారు వారి తల్లిదండ్రులకు నాల్గవ సంతానము. అదే కడగొట్టు కూడా. వీరికి ఇద్దరు అన్నలు, ఒక అక్కగారు కలరు.



శ్రీ రంగన్నబాబు గారు చదువుకోలేదు. రంగన్నగారి చిన్నవయసులోనే, అనగా 6–7 సం॥ల ప్రాయంలోనే తల్లి స్వర్గస్థురాలైరి. అందరికంటే చిన్నవాడైనందున రంగన్నగారిని కుటుంబములోని వారందరూ గారాబంగా చూచెడివారు. అయినప్పటికీ ఆయన జీవితసరళే వేరుగా ఉండేది. దుస్తులు ధరించవలెనన్న శ్రద్ధగాని, తినుబండారాలపై కోరికగాని, ఉండెడిదికాదు. ఆకతాయితనంగా తిరుగుతూ ఉండేవారు. ఇలా ఉండగా ఒక సాధువు వీరికి తటస్థించి, “నీవు నాతోకూడా వస్తావా? నీకు అన్ని ఊళ్ళు చూపిస్తా” అని ఆశ కలిగించినాడట. అంతట రంగన్నగారు అంగీకారం తెలుపగా “మరి మీ ఇంటినుండి డబ్బు తెచ్చెదవా” అని అడిగెనట. వెంటనే “మా ఇంట్లో డబ్బు ఉన్నది, తెస్తా” నని చెప్పి ఇంటిలో తండ్రిగారు రంగన్న గారి సోదరి వివాహ నిమిత్తమై దాచి ఉంచిన డబ్బు (బహుశ : ఏడు లేక ఎనిమిది వందలు) తీసుకుని సాధువుతో ప్రయాణమై వెళ్ళిపోయారట. తదుపరి బాబుగారి ఆచూకీ కొరకు తండ్రి, సోదరులు వెతికి, వెతికి ఆశలు వదులుకున్నారట. ఆ సాధువు రంగూన్, బర్మా, కలకత్తా మొదలగు ప్రదేశములు త్రిప్పి, పవిత్ర నదులలో స్నానాలు చేయించి, డబ్బు యావత్తూ ఖర్చయిన పిదప తిరిగి ఏలూరులో వదలివెళ్ళిపోయారట. ఈ యాత్ర సుమారు ఒక సంవత్సరం పైకాలము జరిగినదని, ఈ యాత్రయే వారి జీవితములో మలుపు తెచ్చినదని బాబుగారు చెప్పెడివారు. తిరిగి వచ్చిన బిడ్డను చూచిన రంగన్నగారి తండ్రి పరమానందభరితులైనారట. తదాది రంగన్నగారి స్వీయ జీవనయాత్రకు శ్రీకారము చుట్టబడింది. రంగన్నబాబుగారి పర్యటన ముగిసి తిరిగి వారు ఏలూరు చేరునప్పటికి వారి వయస్సు సుమారు 15 సంవత్సరములు.

రంగన్నబాబు గారికి తన 18వ యేట శ్రీమతి లక్ష్మీదేవమ్మతో వివాహము జరిగినది. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగినారు. రంగన్నబాబు గారి జీవనయాత్రకు నీళ్ళ కావిళ్ళు మోయుటే ఆధారభూతమైనది. ఏలూరు పట్టణము అభివృద్ధి చెంది మునిసిపాలిటీ పంపులద్వారా నీటి సరఫరా వీధి వీధికి చేస్తున్నందున రంగన్నగారి నీళ్ళ కావిడికి పనిలేకుండా పోయింది. కుటుంబము గడవటానికి మార్గము వెతుక్కోవలసి వచ్చినది. బాబుగారు తెలిసిన వారి సలహాపై నీళ్ళ కావిళ్ళు మోయడానికి చీరాల చేరుకున్నారు. అప్పటికి బాబు గారి వయస్సు 50 సం॥లు దాటినది. ఊరిలో అక్కడక్కడ ఉన్న మంచినీటి బావుల నుండి సంపన్నులైన వారి ఇండ్లకు, హోటళ్ళకు మంచినీళ్ళు మోసేవారు. నీళ్ళుపోస్తే రెండణాలు (బేడ) ఇచ్చేవారు. ఆ విధంగా నీళ్ళు సరఫరా చేసి, ఏలూరులో ఉన్న కుటుంబ పోషణ నిమిత్తం డబ్బు పంపించెడివారు. ఇద్దరి ఆడపిల్లలకు పెండ్లిండ్లు చేసినారు. 1960 సం॥లో బాబుగారి ధర్మపత్ని దివంగతులైరి.

బాబుగారు భౌతికంగా కోస్తా ప్రాంతమైన ఏలూరు, చీరాల, గుంటూరులలో సంచరించేవారు. సుమారు 52 సం॥లు వయస్సు వచ్చేవరకు బాబుగారు ఏలూరులో గడిపిరి. తరువాత 14 సం॥లు చీరాలలో, ఆపైన స్వర్గస్తులయ్యేవరకు దాదాపు 18 సంవత్సరాలపాటు గుంటూరులోనే ఉండిపోయారు. రామ సాక్షాత్కారం పొందిన శ్రీ రంగన్న బాబుగారు శ్రీ సిద్ధార్ధి నామ సంవత్సర కార్తీక శుద్ధ పాడ్యమి సోమవారము అనగా తేది 22–10–1979న రామ సాన్నిధ్యము చేరినారు. అవధూత సాక్షాత్ శ్రీ రామచంద్రమూర్తి స్వరూపులు శ్రీశ్రీశ్రీ రంగన్నబాబు గారి ఆరాధన జరుపుటకు నాకు ప్రేరణ కలిగించినవారు శ్రీ భరద్వాజ మాస్టరు గారు. వారి రుణము నేను తీర్చుకొనలేను. శ్రీ భరద్వాజ మాస్టరు గారు అప్పుడప్పుడు శ్రీ రంగన్నబాబు గారి దర్శనార్థము వస్తూవుండేవారు.

ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ పాడ్యమి తిధిన గుంటూరు ఎ.టి.అగ్రహారము 14వ లైనులోని శ్రీ భరతాశ్రమములోని మాతృశ్రీ కనకమ్మగారి ఆశీస్సులతో అనేకమంది మహనీయుల సమక్షములో సంకీర్తన, నామపారాయణ, హోమాది పూజా కార్యక్రమము, అన్నదానము, సత్సంగ సమావేశము మొదలగు కార్యక్రమములు మహా వైభవముగా జరుగుతున్నాయి. ఆఖరిసారిగా శ్రీ భరద్వాజ మాస్టరుగారు భరతాశ్రమంలో 23–11–1987 శుక్రవారము జరిగిన ఎనిమిదవ ఆరాధనలో పాల్గొన్నారు. అదే మాస్టరుగారి నా చివరి దర్శనము. ఏదన్నా మనము చేస్తామంటే ఏదీ చేయలేము. చేసేది మనముకాదు అనుకుంటే భగవంతుడే మనకు ప్రేరణ కలిగించి చేయిస్తాడని శ్రీ బాబుగారి ఆరాధన ద్వారా అనుభవము.

సర్వేజనా సుఖినో భవన్తు

(నవంబరు 14వ తేదీ కార్తీక శుద్ధపాడ్యమి మంగళవారం (తిథిప్రకారం) శ్రీ రంగన్న బాబుగారి ఆరాధనోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

రచన : **జొన్నలగడ్డ భానుమూర్తి**, గుంటూరు

# యోగపూర్ణులు - శ్రీ భరద్వాజ

సర్వకాల సర్వావస్థల్లోనూ మనస్సు నిశ్చలంగా ప్రశాంతంగా ఉండడమే సమచిత్తత్వం! అప్పుడు బాహ్య వాతావరణంలో పరిస్థితులలో మార్పు ఏ విధంగా ఉన్నా, ఆ మార్పు మన మనస్సును ప్రభావితం చేయలేదు.



దుఃఖాలకు క్రుంగిపోక, సుఖాలకు పొంగిపోక ఆసక్తి, భయక్రోధాధులు వీడడమే గురుచిత్తత్వం. అటువంటి వారి మనస్సు నిశ్చలంగా ఉంటుందని 'గీతాచార్యుల' ఉవాచ!

ప్రాపంచిక ద్వంద్వాలంటే సుఖదుఃఖాలు, నిందాస్తుతులు, జయాపజయాలు, అవిఎప్పుడూ వస్తాపోతుంటాయి. మామూలు మనిషి ఈ ద్వంద్వాలకు పొంగుతూ, క్రుంగుతూ అన్య మనస్కుడై ఉంటాడు. యోగి వాటికి అతీతుడై ఉంటాడు.

యోగి మనస్సు విభిన్న పరిస్థితుల్లోను, అనుభవాలలోను, చలించకుండా స్థిరంగా ఉంటుంది! ఆచార్యుల వారి జీవితాన్ని చూస్తే ఆయన తన జీవితంలో ఎదురైన ప్రతిసంఘటననూ, పరిస్థితిని తనకు అనుగుణంగా ఉండేటట్లు, తన ఆధ్యాత్మిక జీవిత లక్ష్యాన్ని సాధించుకునేందుకు సహాయ పడేటట్లు మలుచుకోవటం చూస్తాము.

విభిన్న మనస్తత్వాలు కలిగిన భక్తులు, వ్యక్తులు ఆచార్యుల వద్దకు వస్తూ, పోతూండడం అందరికి తెలిసిన విషయమే. పరిస్థితులు కురుక్షేత్ర పద్మవ్యూహం సృష్టించినా, ఆచార్యుల మనస్సు ఎప్పుడూ ప్రశాంతంగా, ఆనందంగా ఉండేది. అందరికి ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించగలిగేవారు! భక్తులవద్ద పూజలందుకున్నంత సహజంగా విమర్శలను సహించేవారు! మనస్సును అదుపులో పెట్టుకోవడం ద్వారానే సముచితత్త్వం సాధ్యం! ఆచార్యులవారు మనస్సును నియంత్రించడం ద్వారా శుద్ధమై శ్రీ సాయి ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది పలికారు. ఏ విధమైన ఘర్షణ లేకుండా మృధువుగా సమర్థవంతంగా కార్యాన్ని నిర్వర్తించడమే యోగం. ఆ యోగానికి అద్భుత నిర్వచనం ఆచార్య శ్రీభరద్వాజగారు.

ఆచార్యులవారు సంసారంలో ఉన్నట్లున్నా ఆయనలో సంసారం ఉండదు. ఆచార్యుల మనస్సు శ్రీసాయి ఆధ్యాత్మిక చింతనలోనే ఉండేది. ఆనందంతో నిండిన శ్రీ సాయి ఆధ్యాత్మిక పూర్ణకలశం ఆయన హృదయంలో ఉండేది. ఒక చేత్తో శ్రీ సాయిపాదాలు పట్టుకుని మరొక చేత్తో పనిచేయడం ఎలాగో ఆచార్యుల వారు మనకు నేర్పిస్తారు.

ఆచార్యులవారు అతి చిన్న పనైనా, అతిపెద్ద బాధ్యతనైనా అవలీలగా, నేర్పుగా నిర్వహించేవారు! తన జీవితంలో ప్రతి ఒక్కపాత్రనూ ఎంతో సమర్ధవంతంగా పోషించేవారు. భర్తగా, తండ్రిగా, గురువుగా అసంఖ్యాక భక్త జనాన్ని అనుగ్రహించడంలోనూ ఉత్తమ పాత్ర నిర్వహించారు. అన్నింటికన్నా శ్రీ సాయి ఆధ్యాత్మిక ప్రచారోద్యమానికి కేంద్ర బిందువై సమర్థంగా, సారధ్యం వహించడంలోనూ, విభిన్న పాత్రలు ఎంతో నైపుణ్యంగా పరిపోషించి యోగః కర్మసు కౌశలం... అనే నిర్వచనానికి ప్రతీకగా నిలిచినారు యోగపూర్ణులు ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజ మాస్టారుగారు.


(నవంబరు 19వ తేదీ ఆదివారం పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి (తిథిప్రకారం) సందర్భముగా సమర్పణ.)

– **శ్రీ మల్లిఖార్జునరావు**, (అర్చకస్వామి), విద్యానగర్

---

# అంతా బ్రహ్మమయం

జ్ఞాని అయినవారు అన్నింటిని ఒకటిగా (బ్రహ్మమయంగా) చూస్తారు కదా, జనకమహారాజుని జ్ఞాని అంటారుకదా! అవునో కాదో పరీక్ష చెయ్యదలచి, ఒక బ్రాహ్మణుడిని, చండాలుడిని, గోవుని, ఏనుగుని, శునకాన్ని తీసుకొని జనక మహారాజు దగ్గరకి వెళ్ళేరు. జనకులు జ్ఞాని కదా! గోవుని గోశాలకు, ఏనుగుని గజశాలకు, శునకాన్ని కుక్కలదొడ్డికి పంపించాడు. బ్రాహ్మణుడిని, చండాలుడిని వారు ఉండే తావులకు పంపించి, పరీక్షించ వచ్చిన అతిథులకి మర్యాదలు చెయ్యమని తన సేవకులకి ఆజ్ఞ ఇచ్చారు. అన్నింటినీ ఒకటిగా చూడకుండా వేరుగా పంపించి వేశారు ఎందుకు? మీ దృష్టిలో అంతా బ్రహ్మమేకదా?" అని వారు అడిగారు. అందుకు జనకమహారాజు " అవును! మీరన్నట్లు జ్ఞాని దృష్టిలో అందరూ ఒకటే. కానీ మనిషి తినే అన్నం ఆవు, ఆవు తినే గడ్డి మనిషి తినడం కుదరదు కదా! అందుకే ప్రకృతిని అనుసరించి ఎవరికి ఏది యుక్తమో దానిని ఇచ్చి తప్తి పరచాలి'' అందుకే వాటిని వాటివాటి స్థలాలకు పంపివేశాను అని జవాబిచ్చారు.



– భగవాన్ శ్రీరమణమహర్షి.

# ఆహారము - ఆధ్యాత్మికము

మనం తినే ఆహారము మన మనసును చాలా వరకు ప్రభావితం చేస్తుంది. "ఆహారమును బట్టే మనస్సు" అనే పాత సూక్తి అక్షరాలా నిజం. ఆహారం చెడ్డయితే (రాజసిక, తామసిక ఆహారం) ఆలోచనలు చెడ్డవుతాయి. ఆహారం స్వచ్ఛమైనదైతే (సాత్విక ఆహారం) ఆలోచనలు మంచివవుతాయి. స్వచ్ఛమైన ఆలోచనలు సత్‌శీలాన్ని కలుగజేస్తాయి. భవగద్భక్తి లేనిదే ఆధ్యాత్మిక అభివృద్ధి లేదు.

సాత్విక ఆహారం మనసును నిర్మలం చేసి శాంత స్వభావాన్ని కలుగజేస్తుంది. కూరగాయలు, పళ్ళు, గోరువెచ్చని పాలు, వెన్న, జున్ను, పెరుగు, నెయ్యి వంటి పాల నుండి తయారైన పదార్ధాలు, తేనె, బాదంపప్పు, గోధుమలు, బియ్యము, పప్పుధాన్యములు మొదలైనవి సాత్విక ఆహారం. **తేలికగా జీర్ణమయ్యే ఆహారాలన్నీ సాత్విక ఆహారం క్రింద లెక్కకు వస్తాయి.**



రాజసిక ఆహారం మనసును ప్రాపంచిక సుఖాలవైపుకు లాగుతుంది. గుడ్లు, చేపలు, ఉప్పు, కారం, కుంకుమపువ్వు, పిండివంటలు, మసాలా వంటి సుగంధ ద్రవ్యాలు, శరీరాన్ని ఉద్వేగపరిచే కాఫీ, టీ, వేడిపాలు మొదలైనవన్నీ రాజసిక ఆహారం. **అతిగా తినేది ఏదైనా రాజసిక ఆహారం క్రింద లెక్కకు వస్తుంది.**

తామసిక ఆహారం సోమరితనం, కోపం మొదలైన చెడు లక్షణాలను కలుగజేస్తుంది. మాంసము, మధ్యము, పొగాకు, ఘాటైన పదార్ధాలు, నిలువ ఉన్న పదార్ధాలు, మత్తు పదార్ధాలు, **అమితంగా తిన్న ఏ ఆహారమైనా తామసిక ఆహారం క్రింద లెక్కకు వస్తుంది.**

కనుక ఎల్లప్పుడు స్వచ్ఛమైన (సాత్విక) ఆహారం భుజించాలి. **నిజాయితీగా ఆర్జించి, సంతోషమైన మనసుతో వండుకొని, పెద్దలకూ, ఇవ్వవలసినవారికి ఇచ్చి, తినగల భాగ్యం కలుగజేసిన ఆ భగవంతునికి కృతజ్ఞత తెలుపుకుంటూ, మితంగా తినే తేలికైన ఆహారమే స్వచ్ఛమైనది. నిజమైన సాత్వికాహారము అదే !**

కపటమైన ఆలోచనలు ఆధ్యాత్మిక అభివృద్ధిని అమితంగా ఆటంకపరుస్తాయి. అవి విషంతో సమానం. మెలుకువగా ఉండి మనసును అలాంటి ఆలోచనల నుంచిదూరంగా ఉంచాలి. కోతిపుండును బ్రహ్మరాక్షసి చెయ్యకూడదు.

ప్రతి నిత్యం స్మరణ చెయ్యండి. దానికేమైనా ఖర్చవుతుందా? చిన్నపిల్లలు ఒకటి, రెండు, మూడు, నాలుగు అని వల్లెవేసినట్లు పవిత్రనామాలను వల్లెవేసుకుంటూ ఉండండి. స్మరణ ఒక మహాశక్తి. స్మరణవలననే మనకు ధృఢమైన మనస్తత్వం కలుగుతుంది. పట్టువిడువని సహనంతో, నిర్విరామంగా, చురుకుగా స్మరణ చెయ్యాలి. ఎడతెగకుండా, ఆపకుండా, దృఢంగా చెయ్యాలి.

మీ మనసు మిమ్మల్ని ధ్యానంలో కూర్చోనివ్వడం లేదా? ఒకవేళ కూర్చున్నా, స్మరణను మర్చిపోయేలా చేస్తున్నదా?

సద్గురువు నవ్వి ఇలా అన్నారు. "మంచిది! మరింకేమి చేస్తుందీ? దాని కర్తవ్యం అది విశ్వాస పాత్రంగా నెరవేరుస్తున్నది. మరి మీరు మీ కర్తవ్యం నెరవేర్చవద్దా? బలంగా దాన్ని ఎదుర్కోండి. అది ఆత్మకు, మనసుకు మధ్య జరిగేపోరాటం. మనస్సుకు ఏమాత్రం ఎడమివ్వకండి. ఉత్తమమైన పద్ధతేమిటంటే నామస్మరణతో ముట్టడిని మీరే మొదట ఆరంభించండి. అది తిరిగి మీ మీదకు రాకుండా నిర్విరామంగా నామస్మరణ చేస్తూ ఉండండి".

"సాయి అన్న నామాన్ని ఉచ్చరించినంత మాత్రాన సప్త సముద్రాల అవతల ఉన్నా నేను నిన్ను రక్షిస్తాను" అన్నారు సాయి. ఆ నామాన్ని అలవోకగా నోటితో అనటం కాకుండా మనస్ఫూర్తిగా ధ్యాస ఆనామం మీద, నామియైన రూపం మీద, ఆ రూపానికి గల గుణం మీద నిలిపితే అదే ధ్యానం. అది నిరంతరం సంతత ధారగా సాగినప్పుడు, అదే రీతిలో సద్గురు కృప అనుభవమవుతుంది. సృష్టిలో ప్రతీది సద్గురువు ప్రసాదించినదే ! ఆయన అనుమతి, ఆజ్ఞ లేకుండా మన దగ్గరకు ఏది చేరదు అని తెలుసుకొని ఆయన కృపతో లభ్యమైన ప్రతీది ఆయన ప్రసాదముగా భావించి అంతర్యామికి కృతజ్ఞత తెలియజేస్తూ స్వీకరించే ప్రతీది సాత్విక ఆహారమే! అది మన నరనరాలలో శక్తిరూపంలో ప్రవహిస్తూ, సాత్విక భావాలు కలుగచేస్తుంది. దానితోపాటుగా ఆహారము స్వీకరించే ముందుగా అది ప్రసాదించిన భగవంతుడికి అర్పణ చేస్తున్న కృతజ్ఞతా భావంతో ఒక ముద్ద అన్నాన్ని బయట ఉంచి మిగిలిన ఆహారాన్ని సద్గురువు ప్రసాదంగా స్వీకరించటము ఎంతో శ్రేయస్కరము. "కాకబలికి అన్నం సమృద్ధిగా బయట విడిచిపెట్టిరా, దేనిని పిలవవద్దు, తరమవద్దు. అట్లాచేస్తే నీవు లక్షలాదిమందిని సత్కరించినట్లే" అన్న సాయి సూక్తిని ఆచరణ చేస్తూ తీసుకునే ఆహారము నిజమైన సాత్విక ఆహారం.

సౌజన్యం : **ఆధ్యాత్మిక పుష్పాలు**

సేకరణ : ***శ్రీమతి ఆర్. సృజన ప్రసాద్, బెంగళూరు***

# ఏరిన ముత్యాలు

**జీవితం**

జీవితం అంటే ఎదుటివారిని సంతోషపెట్టటం కాదు, మన సంతోషాలను ఎదుటివారితో పంచుకోవటం

**సంతోషం**

కష్టాల్లో ఉన్నప్పుడు అయినవారు దూరమైనారని బాధపడకు, ఎందుకంటే నీవు ఒక్కడివే జయించగలవని వారు నమ్మినందుకు సంతోషించు

**వేచిఉండు**

ఇప్పుడున్న చీకటిని కాదు,
రేపువచ్చే ఉదయం కోసం వేచిఉండు
– నేతాజీ సుబాస్‌చంద్రబోస్

**ఆనందం**

నువ్వు ఇష్టపడింది చేయటంలో కాదు, నీవు చేసేపనిని ఇష్టపడటంలోనే ఆనందం యొక్క రహస్యం దాగి ఉంది.
– శ్రీ సత్యసాయిబాబా

**సాధన**

గెలవాలన్న తపన, గెలవగలను అన్న నమ్మకం, నిరంతర సాధన, ఈ మూడే నిన్ను గెలుపుకు దగ్గరచేసే సాధనాలు

**పెంచుకో**

గొంతు పెంచటం కాదు నీమాట విలువను పెంచుకో వాన చినుకులకు తప్ప ఉరుములకు పంటలు పండవు

**సంస్కృతి**

ఆకలేస్తుంది అని అన్నం తినటం ప్రకృతి
ఆకలేస్తుందని అవతలివాడిని దోచుకోవటం వికృతి
ఆకలేస్తుందని ఎదుటివారికి పెట్టితినడం సంస్కృతి

**వివేకి**

ఇతరులను అర్థంచేసుకున్నవాడు విజ్ఞాని,
తననుతాను తెలుసుకున్నవాడు వివేకి.

**ఫలితం**

ఒక్కొక్కసారి మనశక్తి కన్నా
చాలాసార్లు సహనం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

**చూడకండి**

జీవితంలో ఎవరినీ తక్కువగా చూడకండి, ఐదురూపాయల కలం కూడ లక్షల విలువైన వాటికోసం సంతకం చేయటానికి ఉపయోగిస్తుంది

**అవకాశాలు**

దేవుడు నీకు వరాలను ఇవ్వడు కేవలం అవకాశాలను మాత్రమే ఇస్తాడు, వాటిని నీవు ఎలా మార్చుకుంటావో అనేది కేవలం నీచేతుల్లోనే ఉంది.

**భగవంతుడు**

భగవంతుడు అందరిలోనా ఉన్నాడు, కాని అందరూ భగవంతుడిలో లేరు, అందుచేతనే వారు బాధపడుతున్నారు
– శ్రీ రామకృష్ణ పరమహంస

**సత్సంగం**

మంచి ఆలోచనలతో, మంచి వ్యక్తులతో,
మంచి పనులతో స్నేహం చేయటమే సత్సంగమము

**ప్రమాదం**

వినయం, శీలం లేని విద్యావంతుడు
మృగం కంటే ప్రమాదకరం
–డా॥ బి.ఆర్. అంబేద్కర్

**హింస**

హింస అంటే శారీరకమైనదే కాదు, మాటలతో
ఎదుటివారిని బాధపెట్టినా అది హింసే అవుతుంది
– గౌతమబుద్ధుడు

**నీడ**

నీడను చూసి భయపడకూడదు,
దగ్గరలో వెలుతురు ఉంటేనే కదా నీడ పడుతుంది.

**ఆదర్శం**

ఆశతో కాకుండా ఆశయంతో పనిచేస్తే
ఫలితం ఆదర్శవంతంగా ఉంటుంది

**ప్రేమ**

మనం వెతికితే దొరికేది కాదు నిజమైన ప్రేమ
మనలను వెతుక్కుంటూ వచ్చేదే నిజమైన ప్రేమ.